

'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 308

సోమవారం 29-1-2024



ఇంట్లోనే తలవంచారు

హైదరాబాద్‌లో ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో 28 పరుగులతో ఓడిన భారత్ -12లో



విన్నర్ సినెర్...

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన ఇటలీ ప్లేయర్ -12లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సుప్రీం' ప్రమాణాలతో..

దేశ సర్వోన్నత న్యాయస్థానం తన సుదీర్ఘ ప్రస్థానంలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పిందని ప్రధాని మోదీ కొనియాడారు.

- వివరాలు 6లో



పోరాటంలో ముందుండాలి

దేశంలో అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగే పోరుకు బెంగాలీలు నాయకత్వం వహించాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.


- వివరాలు 6లో



పన్ను ఆదా.. చేద్దాం ఇలా

దీర్ఘకాలిక లక్ష్యాలు, రాబడి ఆకాంక్షలకు అనుగుణంగా పన్ను ఆదాకు ఆదాయపన్ను చట్టంలో ఉన్న మార్గాలపై కథనం

- వివరాలు 13లో



ప్రపంచ కుబేరుడిగా బెర్నార్డ్

ఎలాన్ మస్క్‌ను వెనక్కినెట్టి ఫ్రాన్స్‌కు చెందిన వ్యాపారవేత్త బెర్నార్డ్ ఆర్నాల్ట్ ప్రపంచ కుబేరుడిగా స్థానం సంపాదించారు.

- వివరాలు 6లో

ధాన్యమేదీ.. వేలం ఎట్లా?

చాలా మిల్లుల్లో యాసంగి ధాన్యం లేదని క్షేత్రస్థాయి తనిఖీల్లో వెల్లడి

2022-23 రబీ ధాన్యం వేలం వేయాలని తాజాగా సర్కార్ నిర్ణయం

కానీ ఇప్పటికే మర ఆడించి బియ్యాన్ని అమ్మేసుకున్న మిల్లర్లు

- ఇంకా తమ మిల్లుల్లోనే ఉన్నట్టు సర్కారుకు లెక్కలు చూపిన తీరు
- ఎక్కువ ధరకు అమ్మేసుకుని.. ప్రభుత్వానికి తక్కువ చెల్లించేలా ప్రయత్నం
- ఇందుకోసం గత సర్కారు హయాంలో ధాన్యం కొనుగోలుకు టెండర్లు వేసిన వైనం
- గత టెండర్ల ప్రక్రియను రద్దు చేసిన కొత్త సర్కారు.. మిల్లుల్లో తనిఖీలు.. కేసుల నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి సేకరించి, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)గా మార్చడం కోసం మిల్లులకు పంపిన లక్షల టన్నుల ధాన్యం మాయమైంది. రైస్‌మిల్లుల నిర్వాహకులు చాలా వరకు ధాన్యాన్ని ఎప్పుడో మర ఆడించి, బియ్యాన్ని అమ్మేసుకున్నా.. సర్కారుకు మాత్రం తమవద్దే ఉన్నట్టు లెక్కలు చూపుతూ వస్తున్నారు. దీనితో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని భావించిన సర్కారు.. గ్లోబల్ టెండర్లను ఆహ్వానించి విక్రయించాలని నిర్ణయించింది. ప్రణాళిక విభాగం ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా మరో నలుగురు సభ్యులతో కమిటీని కూడా నియమించింది. మిల్లుల్లో యాసంగి ధాన్యం ఎంత నిల్వ ఉందో తేల్చేందుకు అధికారులు తనిఖీలు చేపట్టగా.. మిల్లర్ల ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. చాలా మిల్లుల్లో గత యాసంగి ధాన్యాన్ని చడీచప్పుడు కాకుండా అమ్ముకున్నారని తేలడంతో.. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్ని మిల్లుల్లో ఎంత యాసంగి ధాన్యం నిల్వ ఉందో లెక్క తేల్చే పనిలో పడ్డారు.

రాష్ట్ర సర్కారుపై భారం

2022-23లో రాష్ట్ర సర్కారు సేకరించిన 66.84 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యాన్ని మిల్లులకు పంపింది. మిల్లులు దాన్ని మర ఆడించి 45.07 ఎల్ఎంటీ బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)గా ఎఫ్‌సీఐకి పంపాలి. అయితే యాసంగి ధాన్యాన్ని ముడి బియ్యంగా మిల్లింగ్ చేస్తే నూకలు ఎక్కువగా వస్తాయని, సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన బియ్యం తగ్గుతుందని మిల్లర్లు కొర్రీ పెట్టారు. కేంద్రం సుమారు 16 ఎంఎల్‌టీ ధాన్యాన్ని ఉప్పుడు బియ్యం (బాయిల్డ్ రైస్)గా మిల్లింగ్ చేసేందుకు అనుమతి ఇవ్వడంతో.. ఆ మేరకు మర ఆడించి, 10.27 ఎల్ఎంటీ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించారు. ఇదిపోగా సుమారు 50లక్షల టన్నుల ధాన్యం మిల్లుల్లోనే ఉండాలి. దాన్ని మిల్లింగ్ చేసి 35 లక్షల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంది. మిల్లులు బియ్యాన్ని అప్పగించని కారణంగా ఎఫ్‌సీఐ నుంచి నిధులు రాక.. రాష్ట్ర ప్రభుత్వంపై రూ.18వేల కోట్ల భారం పడింది.

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఆగిపోయి..

దీన్ని రికవరీ చేసుకునేందుకు మిల్లుల్లోని ధాన్యాన్ని విక్రయించాలని నిర్ణయించిన గత ప్రభుత్వం.. ఆగస్టులో 25 ఎల్ఎంటీ ధాన్యం విక్రయానికి గ్లోబల్ టెండర్లు పిలిచింది. ఆ టెండర్లలో 10 సంస్థలు

మిగతా 5వ పేజీలో ▶



రూ. 32 కోట్ల ధాన్యం మాయం చేసిన కాపుగల్లులోని రైస్‌మిల్లు

రెండు మిల్లుల్లోనే రూ.100 కోట్ల ధాన్యం తేడా!

కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడలో భారీగా సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పక్కదారి పట్టింది. ప్రభుత్వం సీఎంఆర్ కోసం కోదాడ మండలం కాపుగల్లులోని శ్రీ ఉషస్విని రైస్ ఇండస్ట్రీస్‌కు రూ.32 కోట్ల విలువైన ధాన్యం పంపగా.. మిల్లర్ ఒక్క బియ్యం గింజ కూడా తిరిగి పంపలేదు. అధికారులు ఈ మిల్లులో ఒక్క బస్తా ధాన్యం కూడా లేకపోవడాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఇక కోదాడ పట్టణంలోని ఓ రైస్ మిల్లుకు వానాకాలం, యాసంగికి సంబంధించి మొత్తం 38,660 టన్నుల ధాన్యం పంపగా.. 26,036 టన్నుల బియ్యం రావాలి. కానీ మిల్లు యజమాని ఇప్పటివరకు 5,564 టన్నుల బియ్యమే తిరిగిచ్చారు. ఇంకా రూ.70 కోట్ల విలువైన 20,472 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు.

బిహార్ సీఎంగా నితీశ్ కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ రాజేంద్ర అర్లేకర్



కూటమి మారిన నితీశ్

ఇండియా కూటమికి జేడీయూ గుడ్‌బై, బీజేపీతో దోస్తీ

బిహార్ సీఎంగా ఉదయం రాజీనామా... సాయంత్రం మళ్లీ ప్రమాణం

- బిహార్‌లో మహాఘట్‌బంధన్ సంకీర్ణం నుంచి నిష్క్రమణ
- ఎన్డీఏలో చేరిక.. బీజేపీతో కలసి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు
- ముఖ్యమంత్రిగా రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి పగ్గాలు
- ఇద్దరు బీజేపీ నేతలకు డిప్యూటీ సీఎం పదవులు
- ఒక్కరోజులో వేగంగా మారిపోయిన పరిణామాలు
- నితీశ్ చర్యపై భగ్గుమన్న కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలు
- ఆయన ఊసరవెల్లి నైజాన్ని చాటుకున్నారని ధ్వజం

6లో

అధికారమే పరమావధి | కూటమికి గట్టి దెబ్బ | ఇక ఎటూ వెళ్లను: నితీశ్ 6లో

ఆయారాం, గయారాంల నిష్క్రమణతో మా కూటమికి నష్టం లేదు: ఖర్గే

లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ మట్టి కరవడం ఖాయం: తేజస్వి

న్యూస్‌రీల్

కేసీఆర్ కాలిగోటికి కూడా రేవంత్ సరిపోడు



'మూడు ఫీట్లు లేనోడు కూడా కేసీఆర్‌ను వంద మీటర్ల లోతుకు తొక్కుతాడట.. ఈ బుడ్డరఖాన్‌తో ఏమీ కాదు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు.

- వివరాలు 2లో ▶

నర్సింగ్ ఆఫీసర్స్ ఫలితాలు విడుదల



నర్సింగ్ ఆఫీసర్స్ (స్టాఫ్ నర్సు) పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. తుది జాబితాను ఆదివారం ప్రకటించారు. 7,094 పోస్టుల్లో 6,956 మందిని ఎంపిక చేసినట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది.

- వివరాలు 5లో ▶

సీఎం రేవంత్‌తో ప్రకాశ్‌గౌడ్ భేటీ



బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిశారు. దీంతో ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రచారం జరిగింది. అయితే దీన్ని ప్రకాశ్‌గౌడ్ ఖండించారు.

- వివరాలు 2లో ▶

బాబు ప్రసంగానికి కుర్చీలే అతిథులు!



నెల్లూరు నగరంలో, కర్నూలు జిల్లా పత్తికొండలో టీడీపీ ఆదివారం నిర్వహించిన 'రా.. కదలి రా' సభలు జనం లేక వెలవెలబోయాయి. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఖాళీ కుర్చీలను చూస్తూ ప్రసంగించాల్సి వచ్చింది.

- వివరాలు 10లో ▶

కుల గణనకు చట్టబద్ధత

రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం

- వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు
- మంత్రి పొన్నంకు ముసాయిదా తయారీ బాధ్యత
- బడ్జెట్ సమావేశాల తర్వాత కులగణన ప్రక్రియ ప్రారంభం!
- త్వరలో బిహార్, కర్ణాటకకు అధ్యయన బృందాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించతలపెట్టిన కుల గణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుల గణనకు చట్టబద్ధత కల్పించనుంది. ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును తీసుకురావాలని నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాలపై ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఆలోగా కుల గణన ముసాయిదా బిల్లును సిద్ధం చేసే బాధ్యతను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలపై శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన నిర్వహించాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే కుల గణన ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించే అవకాశాలున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇంటింటి సర్వే నిర్వహించి

మిగతా 5వ పేజీలో ▶

700కిపైగా కులాలు, ఉప కులాలు

కులగణన సర్వే కోసం ఇతర రాష్ట్రాల తరహాలో ప్రత్యేక మొబైల్ యాప్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని కులాల జాబితాను యాప్‌లో పొందుపరచనున్నారు. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లోని ఉప కులాల వివరాలను సైతం సేకరించనున్నారు. పొరుగు రాష్ట్రం ఏపీలో దాదాపుగా 723 కులాలు, ఉపకులాల పేర్లను యాప్‌లో చేర్చి సర్వే నిర్వహిస్తుండగా, తెలంగాణలో సైతం అటూఇటూగా దాదాపు అదే సంఖ్యలో కులాలు, ఉప కులాలు ఉండే అవకాశం ఉంది. కులం చెప్పడానికి ఇష్టపడని/కులాన్ని వదులుకున్న వ్యక్తుల కోసం 'నో క్యాస్ట్' అనే ఆప్షన్ సైతం ఇచ్చే అవకాశం ఉంది. కులగణన ప్రక్రియకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. సర్వేలో కులంతో పాటుగా వ్యక్తుల విద్యార్హతలు, వృత్తులతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం సైతం అడిగే అవకాశం ఉంది.



ఇంద్రవెల్లి నుంచి కాంగ్రెస్ రణభేరి

12 లోక్‌సభ స్థానాల్లో గెలుపే టార్గెట్

టీపీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి ప్రణాళికలు

వచ్చే నెల 2న ఇంద్రవెల్లి సభతో కార్యాచరణ షురూ

తర్వాత నియోజకవర్గాల్లో పర్యటన.. ఆపై హైదరాబాద్‌లో సభ!

నోటిఫికేషన్‌కు ముందే మరో రెండు గ్యారంటీల అమలు?

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే టీపీసీసీ చీఫ్‌గా వచ్చే పార్లమెంటు ఎన్నికలకు రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఒకవైపు ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల అమలుకు కృషి చేస్తూనే, మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో 12 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. వారంలో మూడు రోజుల పాటు పార్టీ కోసం సమయం కేటాయిస్తానని చెప్పిన రేవంత్.. ఫిబ్రవరి 2న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి సభతో ఈ మేరకు కార్యాచరణ ప్రారంభించనున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నాలుగు అసెంబ్లీ సీట్లను సాధించినప్పటికీ, లోక్‌సభ స్థానంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్క ఖానాపూర్‌లోనే విజయం సాధించింది. మిగతా ఆరింటిలో నాలుగు చోట్ల బీజేపీ విజయం సాధించింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూరులలో బీజేపీ గెలుపొందగా, బీఆర్ఎస్ బోథ్, ఆసిఫాబాద్‌లలో విజయం సాధించింది. కాగా ఖానాపూర్‌లో వెడ్మ బొజ్జు అనూహ్య విజయాన్ని రేవంత్ అన్ని సభల్లో చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచే పార్లమెంటు ఎన్నికల రణభేరి మోగించాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో హైదరాబాద్‌లో ఆయన సమావేశం కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను ఈ భేటీకి ఆహ్వానించారు. ఇంద్రవెల్లి సభ తర్వాత కూడా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సభలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా పార్టీ యంత్రాంగాన్ని చురుగ్గా ఉంచాలని సీఎం నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి, చివరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ జరపాలని కూడా భావిస్తున్నట్లు తెలిసింది.

ఓటర్లను ఆకర్షించేలా మరో రెండు పథకాలు!

ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే అమలవుతున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి మంచి స్పందన లభించిందని కాంగ్రెస్ భావిస్తోంది. రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిమితి పెంపును కూడా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇదే క్రమంలో పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్ల

మిగతా 2వ పేజీలో ▶



నిధుల పేచీతో నిలిచిన 'ఆర్ఆర్ఆర్'!

భూసేకరణ పరిహారంలో వాటా నిధులు విడుదల చేయని రాష్ట్ర సర్కారు

- దీనితో రీజనల్ రింగ్‌రోడ్డుకు జాతీయ రహదారి నంబర్ కేటాయించని కేంద్రం
- అది లేకుంటే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేయలేని పరిస్థితి
- నిలిచిపోయిన రహదారి పనులు.. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోగా తేలకుంటే మరింత జాప్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి ఎంతో కీలకమైన రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్టుగా సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లిప్తత, పేచీల కారణంగా ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. రైతుల నుంచి నిరసన వ్యక్తమైనా వేగంగా అలైన్‌మెంట్‌ను ఖరారు చేసిన జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ).. తీరా భూసేకరణ ప్రక్రియకు అవార్డులు పాస్ చేసే తరుణంలో చేతులెత్తేసింది. దీనితో ప్రాజెక్టుకు సంబంధించి గతంలో విడుదల చేసిన పలు గెజిట్ నోటిఫికేషన్లకు కాలదోషం పట్టి రద్దయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మార్చి ఆఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సర కేటాయింపులు సందిగ్ధంలో పడ్డాయి. త్వరలో లోక్‌సభ ఎన్నికలు కూడా ఉండటంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే.. ప్రాజెక్టుకు మరింత జాప్యం తప్పదు. కేంద్రంలో కొత్త సర్కారు కొలువుదీరేదాకా ఎదురుచూడక తప్పదు.

అనుమతులకు దరఖాస్తే చేయలేదు

పెద్ద రహదారుల నిర్మాణానికి పర్యావరణ అనుమతులు కీలకం. అనుమతులొచ్చాకే టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారతమాల పరియోజన-1లో కేంద్రం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని చేర్చింది. అలైన్‌మెంట్‌కు అనుమతులు రావటంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు గత ఏడాదే భూసేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ సభలు నిర్వహించారు. రైతులు

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి





ఘోర రోడ్డు ప్రమాదం

ఐదుగురు మృతి

డ్రైవర్ నిద్రమత్తుతో అదుపుతప్పిన కారు.. ఢీకొట్టిన లారీ

ఒకరి పరిస్థితి విషమం

మృతుల్లో ఓ మహిళ, ఇద్దరు చిన్నారులు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వద్ద దుర్ఘటన

వివరాలు 5లో

రూ. 5 లక్షలిస్తే 'విద్యానిధి' మీదే!

మధ్యవర్తుల మాయ

నిధులు మంజూరు చేయిస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఎర

రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కమీషన్ డిమాండ్

- ధ్రువపత్రాల పరిశీలన, తుది జాబితా విడుదల తర్వాత మాయమాటలు
- అడ్వాన్స్‌లు తీసుకొని అదృశ్యం
- అర్హతలన్నీ ఉండి ఎంపికైన తర్వాత తమ వల్లే మంజూరైందంటూ వసూళ్లు

వరంగల్ జిల్లాకు చెందిన మురిపాల సిద్ధార్థ్ ఎంఎస్ కోసం అమెరికాకు వెళ్లాలనుకున్నాడు. బీటెక్‌లో మంచి మార్కులు రావడంతో విదేశీ విద్యానిధి పథకం కింద దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఓ మధ్యవర్తి.. ఈ పథకం కింద రూ. 20 లక్షల ఆర్థిక సాయం అందేలా చూస్తానని, అందుకు ప్రతిఫలంగా రూ. 5 లక్షలు ఇవ్వాలంటూ బేరమాడాడు. ఆర్థిక సాయంపై ఆశతో సిద్ధార్థ్ తండ్రి ఒప్పుకున్నాడు. రూ.లక్ష కూడా ఇచ్చాడు. ధ్రువపత్రాల పరిశీలన సమయంలో అధికారులు సిద్ధార్థ్ తండ్రిని పిలిచి మంచి మార్కులు, ఉత్తమ స్కోర్ ఉండడంతో మీ కుమారుడు తప్పకుండా ఎంపికవుతాడని చెప్పారు. ఈ క్రమంలో ఎంపికైన సిద్ధార్థ్ అమెరికా వెళ్లి చదువు కొనసాగిస్తున్నాడు. అయితే ఎంఎస్ కోర్సులో చేరిన తర్వాత అడ్మిషన్ సర్టిఫికెట్, ధ్రువపత్రాలను సమర్పించాలని సిద్ధార్థ్ తండ్రికి అధికారులు ఫోన్ చేశారు. దీంతో ధ్రువపత్రాలను సమర్పించిన ఆయన మధ్యవర్తి విషయాన్ని వెల్లడించారు. అధికారులు ఫిర్యాదు ఇవ్వాలని చెప్పడంతో లేఖ ఇచ్చాడు. కానీ మధ్యవర్తి ఫోన్ నంబర్ పనిచేయకపోవడంతో అధికారులు చర్యలు తీసుకోలేదు. మధ్యవర్తి మాటలు విని తాను మోసపోయినట్లు చివరకు సిద్ధార్థ్ తండ్రి గుర్తించాడు.



సాక్షి, హైదరాబాద్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా నిధి పథకం కింద గరిష్టంగా రూ. 20 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ద్వారా అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి, బీసీ సంక్షేమ శాఖ ద్వారా మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి, మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ విద్యా నిధి పేరిట ఈ పథకాలు అమలవుతున్నాయి. అర్హుడైన విద్యార్థికి రెండు దఫాలుగా గరిష్టంగా రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ఆర్థిక సాయం అందించే పథకం ఇదే కావడం గమనార్హం. కాగా తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో ఈ పథకానికి విపరీతమైన క్రేజ్ ఉంది. దీంతో మధ్యవర్తులు దరఖాస్తుదారులను మాయ మాటలతో

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

మల్లు రవి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు మల్లు రవిని అభినందించారు. అనంతరం మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక ప్రతినిధిగా తనను నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి, ఏఐసీసీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 15 అంశాలపై ప్రధాని మోదీని కలిసి విజ్ఞాపనలు అందజేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బాధ్యతల స్వీకారానికి ముందు కళాకారులు డప్పు చప్పుళ్లతో మల్లు రవికి ఘనంగా స్వాగతం పలికారు.

నితీశ్ బిహారీలకు క్షమాపణ చెప్పాలి: ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కూటములు మారుతున్న జేడీయూ అధినేత నితీశ్ కుమార్ వెంటనే బిహారీలకు క్షమాపణ చెప్పాలని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన హైదరాబాద్ దారుస్సలాంలో విలేకరులతో మాట్లాడుతూ నితీశ్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆర్జేడీతో తెగదెంపులు చేసుకుని మళ్లీ బీజేపీతో చేతులు కలపడాన్ని తప్పుబట్టారు. బిహార్ ప్రజలను నితీశ్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఒవైసీ ఆరోపించారు. ఇన్నాళ్లు బీజేపీ బీ టీమ్ ఒవైసీ అని విమర్శించిన నితీశ్ ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నితీశ్ ఎప్పటికైనా మళ్లీ ఎన్డీయేలో చేరుతారని, ఇదే విషయాన్ని తాను ఎప్పట్నుంచో చెబుతున్నానని ఒవైసీ గుర్తు చేశారు. యావత్ దేశం తమ చేతుల్లోనే ఉండాలని బీజేపీ భావిస్తోందని, అందుకు స్వార్థ రాజకీయ నేతలు దాని వెంట అనుసరిస్తున్నారని మండిపడ్డారు.

శ్రీరాముడి సాక్షిగా చెబుతున్నా.. డబ్బులు డిమాండ్ చేసింది నిజమే

డీకే అరుణపై వంశీచంద్‌రెడ్డి ఆరోపణ



స్టేషన్ మహబూబ్‌నగర్: 'శ్రీరాముడి సాక్షిగా చెబుతున్నా.. అప్పటి కాంగ్రెస్ మాజీ మంత్రి, ఇప్పటి బీజేపీ నేత డీకే అరుణ 2019లో ఎంపీగా పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ నుంచి రూ.15 కోట్లు డిమాండ్ చేసిన విషయం నిజమే'అని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. 'ఈ విషయంపై ప్రమాణం చేస్తానని రెండురోజుల క్రితం మహబూబ్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలో గల రామాలయంలో ప్రకటించాను'అని వెల్లడించారు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి రామాలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయమై ఎప్పుడైనా, ఎక్కడైనా మాట్లాడతానని డీకే అరుణ చేసిన సవాలును స్వీకరించి తాను ఆమెకు ఫోన్ చేయగా స్పందించలేదన్నారు. అందుకే రామాలయానికి వచ్చి డీకే అరుణ కోసం ఎదురుచూశానని తెలిపారు. రాములవారి సమక్షంలో ప్రమాణం చేసే ధైర్యంలేకనే ఆమె ఇక్కడికి రాలేదని పేర్కొన్నారు.


సంయమనం కోల్పోయి రేవంత్ వ్యాఖ్యలు

బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నామనే సోయి మరిచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంయమనం లేకుండా బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేత మల్లు రవి ఢిల్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుపై చేసిన విమర్శలను ఖండించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, వివిధ శాఖల మంత్రిగా ఐటీ, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణను కేటీఆర్ ప్రపంచ చిత్రపటంలో పెట్టారని, దావోస్ వేదికగా కేటీఆర్ తెలంగాణ ప్రతిష్టను పెంచారన్నారు. అన్‌పార్లమెంటరీ భాషకు రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా రేవంత్ తరహాలో దిగజారి మాట్లాడలేదన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల కొరత ఉందని, గతంలో ఆ పార్టీ గెలిచిన 3 ఎంపీ సీట్లను నిలబెట్టుకున్నా చాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రహస్య మైత్రిని త్వరలోనే బయట పెడతానని శ్రీధర్‌రెడ్డి అన్నారు.

ఈ దేశాల్లో.. డబ్బులన్నీ వ్యాపార కుటుంబాలవే..

ప్రతి దేశంలో ఎన్నో వ్యాపార సామ్రాజ్యాలు ఉంటాయి. కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు పలు కుటుంబాల ఆధ్వర్యంలోని కంపెనీలపై ఆధారపడి ఉంటుంటాయి. వాల్‌మార్ట్, ఫోర్డ్, రిలయన్స్ వంటి 'కుటుంబ' కంపెనీలు.. ఆయా దేశాల్లో ఆర్థిక అభివృద్ధికి, ఉద్యోగాల కల్పనకు ఊతంగా నిలుస్తుంటాయి. ఈ అంశంపై తాజాగా ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థ పరిశీలన జరిపింది. దేశాలవారీగా జీడీపీలో అక్కడి 'వ్యాపార' కుటుంబాల సంస్థల భాగస్వామ్యం ఎంత అన్న అంచనాలు వేసింది.



ప్రపంచవ్యాప్తంగా ప్రైవేటు క్యాపిటల్ మార్కెట్లలో కేవలం కుటుంబ కంపెనీల వాటానే 27 శాతం ఉంటుందని తేల్చింది. ఇది మరింతగా పెరుగుతూనే ఉందని పేర్కొంది.

'వ్యాపార' కుటుంబాల ఆదాయ శాతంలో ఇండియా ప్రపంచంలోనే టాప్‌లో ఉంది. ఏటా దేశ జీడీపీలో 79 శాతం వరకు పెద్దా, చిన్నా 'కుటుంబ' వ్యాపారాల నుంచే సమకూరుతున్నట్టు ఎర్నెస్ట్ అండ్ యంగ్ అంచనా వేసింది. ఈ విలువ 245 లక్షల కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది.

విలువపరంగా 'వ్యాపార' కుటుంబాలు సమకూర్చుతున్న మొత్తాన్ని చూస్తే.. రూ.1,205 లక్షల కోట్లతో అమెరికా ప్రపంచంలో టాప్‌లో ఉంది. 821 లక్షల కోట్లతో చైనా రెండో స్థానంలో ఉంది. వీటి తర్వాత ఇండియా మూడో స్థానంలో ఉంది.

కేసీఆర్ కాలిగోటికి కూడా రేవంత్ సరిపోడు

మూడు ఫీట్లు లేనోడు.. వంద మీటర్లకు తొక్కుతాడట

- అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు
- కాంగ్రెస్ ఉంటే.. కరెంట్ ఉండదని నిజం చేస్తున్నారు
- మళ్లీ వంద కిలోమీటర్ల స్పీడ్‌తో కారు వస్తుంది: కేటీఆర్



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: ''మూడు ఫీట్లు లేనోడు కూడా కేసీఆర్‌ను వంద మీటర్ల లోతుకు తొక్కుతాడట.. ఈ బుడ్డర ఖాన్‌తో ఏమీ కాదు'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణభవన్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ కాలిగోటికి కూడా రేవంత్‌రెడ్డి సరిపోడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ మేనేజ్‌మెంట్ కోటాలో సీఎం సీటును కొన్నాడని ఎద్దేవా చేశారు. అలవికాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మొత్తం 420 హామీలు ఇచ్చిందని వాటిని అమలు చేయడం చేతకాక కేసీఆర్ అప్పులు చేశారంటూ తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేసేదాకా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో 1.8 శాతం స్వల్ప ఓట్ల తేడాతోనే ఓటమి పాలయ్యామనీ, పోయింది అధికారమేననీ.. పోరాట పటిమ కాదన్నారు. కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదనే మాజీ సీఎం కేసీఆర్ మాటలను కాంగ్రెస్ సర్కారు నిజం చేస్తోందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కారుకు ఇది ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని, మళ్లీ వంద కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సగం సీట్లు గెలిచినా హంగ్ వచ్చేది

ఎన్నికల్లో 14 చోట్ల కేవలం ఐదువేల ఓట్ల తేడాతో బీఆర్ఎస్ ఓడిపోయిందని, అందులో సగం సీట్లు గెలిచినా.. హంగ్ సర్కారు వచ్చేదని కేటీఆర్ విశ్లేషించారు. మార్పు కావాలే అన్నోళ్లు ఇప్పుడు నెత్తినోరు కొట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. సచివాలయంలో లంకెబిందెలు ఉన్నాయని వస్తే.. ఉత్తబిందెలు కూడా లేవని రేవంత్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రిగా చేసిన అనుభవం లేనోడు ముఖ్యమంత్రి అయితే గిట్లనే ఉంటదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను వేర్వేరుగా పెట్టడం ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని తేలిపోయిందన్నారు.

ధర్మం కోసం పని చేస్తే మఠం పెట్టుకోండి

ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ చేసింది ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్ అడిగితే ఇవ్వలేదని, నవోదయ పాఠశాలలు తేలేదని నిందించారు. ధర్మం కోసం పనిచేస్తే.. రాజకీయాలు మానేసి మఠం పెట్టుకోవాలని హితవు పలికారు. మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడి చేస్తాం

కాంగ్రెస్ మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఫామ్‌హౌస్‌పై దాడి చేస్తామని కాంగ్రెస్ మాజీఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌పై దాడి చేస్తే వందల కోట్ల రూపాయలు బయటపడతాయని, అక్కడ ఆయన నోట్ల కట్టలపైనే పడుకుంటారని, అక్కడి ఏ గోడను తొలిచినా నోట్ల కట్టలు, వజ్ర వైఢూర్యాలు బయటకొస్తాయని ఆరోపించారు. దానిపై ఏ విధంగా దాడి చేయాలనే విషయమై తమ ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆదివారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవి బాధ్యతలు తీసుకున్న అనంతరం మధుయాష్కి మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే వీరి అవినీతి బయటకు వస్తుందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క అవినీతి అధికారినీ, కల్వకుంట్ల కుటుంబ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం వదిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య తెరవెనుక ఉన్న వ్యాపారం, అవినీతి బంధాన్ని బయటకు తీయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ, హైదరాబాద్ చుట్టూవున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో మాజీమంత్రి కేటీఆర్ కొన్ని వేల కోట్ల రూపాయలు దోచుకుని అమెరికా, దుబాయ్‌లో పెట్టారని ఆరోపించారు. కల్లబొల్లి మాటలు, అహంకారంతో మాట్లాడుతున్న కేటీఆర్‌కు రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. రాష్ట్రంలో కనీసం 14 సీట్లలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తున్నదని తెలిపారు.

..కాంగ్రెస్ రణభేరి

▶ మొదటి పేజీ తరువాయి

దృష్టిని ఆకర్షించేలా మరో రెండు గ్యారంటీల అమలుకు మార్గదర్శకాలను సిద్ధం చేయాలని ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. అందులో ఒకటి రూ.500కే గ్యాస్ సిలిండర్ కాగా, మరొకటి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. అయితే సబ్సిడీపై సంవత్సరానికి ఎన్ని గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలనే అంశంపై ఇప్పటికే అధికారులు ఓ రోడ్‌మ్యాప్ తయారు చేసినట్లు సమాచారం. కాగా రూ.500కే సిలిండర్‌ను నేరుగా తెచ్చినప్పుడే ఇచ్చే విధంగా విధి విధానాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. దీని వల్ల రూ.500కే గ్యాస్ వచ్చిన భావన మహిళలకు కలుగుతుందని, ఇది ఎన్నికల్లో ఉపకరిస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి ఇప్పటికే ఇది అమలవుతున్న కర్ణాటకలో అధికారులు పరిశీలించినట్లు తెలిసింది.

నిధుల పేచీతో నిలిచిన 'ఆర్‌ఆర్‌ఆర్'!

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యంతరాలు లేవనెత్తినా ఎలాగోలా సభలను పూర్తిచేశారు. పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ అటవీ శాఖకు దరఖాస్తు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ ఇది జరగాలంటే ముందు ఈ రోడ్డుకు జాతీయ రహదారి పేరిట కొత్త నంబర్ కేటాయించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను కేంద్రం పెండింగ్‌లో పెట్టింది.

భూపరిహార వాటా నిధులు అందనందుకే..

ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పరిహారంలో రాష్ట్రప్రభుత్వం సగం ఖర్చును భరించాల్సి ఉంది. రాష్ట్ర వాటా రూ.2,600 కోట్లు అవుతుందని తాత్కాలికంగా నిర్ధారించారు. ఈ మొత్తాన్ని చెల్లించాలని ఎన్‌హెచ్ఏఐ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసింది. కానీ అన్ని నిధులు ఒకేసారి ఇవ్వడం కుదరదని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వాదించింది. దీంతో తొలివిడతగా కనీసం రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలని ఎన్‌హెచ్ఏఐ కోరింది. దీనిని కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి కూడా తెచ్చింది. కానీ నిధుల విడుదల కాలేదు. ఇలా నిధులు రాకుండా, అవార్డులు పాస్ చేయటం సరికాదని, ఇబ్బందులు తలెత్తుతాయని భావించిన కేంద్రం రీజనల్ రింగ్‌రోడ్డు పనిని పక్కన పెట్టేసింది. జాతీయ రహదారి నంబర్ కేటాయించలేదు. కీలక ప్రాజెక్టు కాస్తా పెండింగ్‌లో పడింది.

నదుల అనుసంధానంలో మరో ముందడుగు

- పర్వతి–కాలిసింద్–చంబల్ నదులను తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్‌తో కలుపుతూ ఎంఓయూ
- రాజస్థాన్, మధ్యప్రదేశ్, కేంద్ర జలశక్తి శాఖల మధ్య జరిగిన ఒప్పందం



వెదిరె శ్రీరామ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో జల వనరుల నిర్వహణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నదుల అనుసంధానం కార్యక్రమంలో మరో ముందడుగు పడింది. జాతీయ దృక్పథ ప్రణాళిక క్రింద రెండో ప్రాజెక్ట్ అయిన పర్వతి–కాలిసింద్–చంబల్ నదులను తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్‌తో కలుపుతూ జరిగే నదుల అనుసంధానం కోసం కేంద్ర జలశక్తి శాఖతో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల అధికారులు ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మతో పాటు నదుల అనుసంధానంపై కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరే శ్రీరామ్ పాల్గొన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
- పీడిత్ అధికార్ యాత్రలో ఎమ్మెల్సీ కవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న కవిత

సాక్షి, హైదరాబాద్: జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు బీసీ కుల గణన చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లలో అంతర్భాగంగా ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలని, కేంద్రంలో ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్ దతియా జిల్లా కేంద్రం నుంచి ఓబీసీ హక్కుల ఫ్రంట్ వ్యవస్థాపకుడు దామోదర్ సింగ్ యాదవ్ తలపెట్టిన 'పీడిత్ అధికార్ యాత్ర' ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఓబీసీల అనైక్యతను ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలు వారికి దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు.

కాంగ్రెస్ ఓబీసీలకు న్యాయం చేయలేదు

అధికారంలో ఉన్నప్పుడు ఓబీసీలకు న్యాయం చేయని కాంగ్రెస్ ఇప్పుడు ఓబీసీ న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ప్రశ్నిస్తోందని కవిత ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో ఓబీసీల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ప్రశ్నించారు. దామోదర్ సింగ్ యాదవ్ ప్రారంభించిన పీడిత్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా విస్తరిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ఉద్యమాలు అందరికీ స్ఫూర్తిదాయకమని, కేసీఆర్ స్ఫూర్తితో ఓబీసీ హక్కుల సాధన ఉద్యమం ముందుకుసాగాలని కవిత పిలుపునిచ్చారు. కేసీఆర్ స్ఫూర్తితోనే ఉద్యమాన్ని మొదలు పెట్టినట్లు ఓబీసీ ఫ్రంట్ వ్యవస్థాపకుడు దామోదర్ యాదవ్ తెలిపారు.

ప్రజలు బుద్ధి చెప్పినా మారలేదు: బండి



కమలాపూర్: తాగి రాష్ట్రాన్ని నడిపిన కేసీఆర్ బార్ పెట్టుకోవాలి.. ఎప్పుడూ ముస్లింల గురించి మాట్లాడే కేటీఆర్ మసీదు కట్టుకొని నమాజ్ చేసుకోవాలని.. కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేగేట్‌పై నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనుల పురోగతిని ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హిందుత్వం, ధర్మం గురించి మాట్లాడుతున్న తనను మఠం పెట్టుకోవాలని విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజలు బుద్ధి చెప్పినా కేటీఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు. తాగి కారు నడిపితే కరాబు కాదా? అని ప్రశ్నించారు. ఆ కారు రిపేరు కాదు.. డైరెక్ట్‌గా స్క్రాప్‌కే.. ఇక రోడ్డు ఎక్కదని.. బండి వ్యాఖ్యానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలను బీజేపీ గెలుచుకోబోతోందని, బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికే పరిమితమవుతుందని జోస్యం చెప్పారు. మేధావి అని చెప్పుకునే మాజీ ఎంపీ వినోద్‌కుమార్ నిధులు తీసుకువచ్చి ఒక పనైనా చేశాడా? అని బండి ప్రశ్నించారు.

నూతన జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణకు త్వరలో కమిషన్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పానుగోడులో వజ్రోత్సవాల్లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి/హుజూర్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని నూతన జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం త్వరలో కమిషన్ ఏర్పాటు చేస్తుందని భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పానుగోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ వజ్రోత్సవాల్లో మంత్రి మాట్లాడారు. అంతకుముందు హుజూర్‌నగర్ మండలం లింగగిరిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జిల్లాలు, మండలాల ఏర్పాటు ప్రక్రియ అస్తవ్యస్తంగా జరిగిందని, కమిషన్ సూచనల మేరకు వాటిని సవరిస్తామని చెప్పారు. వేసవిలో తాగునీటి సరఫరాపై నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటిలభ్యతను బట్టి ప్రణాళికాబద్ధంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. కేసీఆర్‌హయాంలో అప్పు రూ.6 లక్షల 70 వేల కోట్లకు పెంచి ప్రతి వ్యక్తిపై రూ.1.50 లక్షల అప్పులభారం మోపారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ మూడేళ్లలోనే కుంగిపోయిందన్నారు. విద్యుత్ శాఖలో రూ. 30 వేల కోట్లు, పౌర సరఫరాల శాఖలో రూ.58 వేల కోట్లు, ఇరిగేషన్ శాఖలో రూ.14 వేల కోట్ల అప్పులు చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో ఎక్కడైనా 24 గంటల కరెంట్ ఇచ్చారనేది బూటకమని అన్నారు.

సీఎం రేవంత్‌తో ప్రకాశ్‌గౌడ్ భేటీ

జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి కలసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

- ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ ప్రచారం
- నియోజకవర్గ సమస్యల విషయంలోనే కలిశానన్న ప్రకాశ్‌గౌడ్
- పార్టీ మారడం అవాస్తవమని వెల్లడి

సాక్షి, హైదరాబాద్/మణికొండ: బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. రేవంత్ సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. దీనితో ప్రకాశ్‌గౌడ్ బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దీనిని ప్రకాశ్‌గౌడ్ ఖండించారు.

మర్యాదపూర్వకంగానే కలిశా: ప్రకాశ్‌గౌడ్

తాను మర్యాదపూర్వకంగానే సీఎం రేవంత్‌తో భేటీ అయ్యానని ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, బహదూర్‌గూడ, ఘాన్సిమియాగూడ గ్రామాల్లో భూసంబంధ సమస్యల పరిష్కారం కోసమే సీఎంను కలిశానని ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని తాను కోరగా.. సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. భేటీ వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని, తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో 'భేటీ'ల కలకలం!



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు వరుసగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం అవుతుండటం కలకలం రేపుతోంది. కాంగ్రెస్ స్వల్ప మెజారిటీతో అధికారం చేపట్టిన నేపథ్యంలో విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నం చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది. ఈనెల 24న ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి మాణిక్‌రావు తదితరులు సీఎం రేవంత్‌ను కలిశారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కూడా రెండు రోజుల కింద సీఎంతో భేటీ అయ్యారు. తాజాగా ప్రకాశ్‌గౌడ్ కూడా కలిశారు.

గతంలో టీడీపీ నుంచి వెళ్లిన నేపథ్యంలో..

సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆయన సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు గతంలో టీడీపీలో పనిచేసినవారే కావడంతో ఈ భేటీలకు ప్రాధాన్యత ఏర్పడింది. గతంలో టీడీపీలో పనిచేసి ప్రస్తుతం బీఆర్ఎస్, ఇతర పార్టీల్లో ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలతో రేవంత్‌రెడ్డి సన్నిహితులు మంతనాలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారుతాయనే అంచనాల నేపథ్యంలో.. ఆలోగా చేరికల వ్యూహాన్ని అమలు చేయాలని రేవంత్ భావిస్తున్నట్టు చెప్తున్నారు. ఈ పరిణామాలతో అప్రమత్తమైన బీఆర్ఎస్ పెద్దలు.. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతల కదలికలపై కన్నేసినట్టు సమాచారం.

రేవంత్‌రెడ్డికి సీఎం పదవి.. కేసీఆర్ భిక్షే



- చావునోట్లో తలపెట్టి ప్రత్యేక రాష్ట్రం తెచ్చారు
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే మెడలు వంచుతాం
- 420 అబద్ధపు హామీలతో గద్దెనెక్కారు
- ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్: రేవంత్‌రెడ్డి అనుభవిస్తున్న సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్షేనని, ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ ఆమరణ దీక్ష చేసి, చావునోట్లో తలపెట్టి తెలంగాణ తేవటంతోనే ఇవాళ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 420 అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు. వాటిని నెరవేర్చకుంటే మెడలు వంచుతామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై గ్రామీణ ప్రాంతాల్లో, సోషల్ మీడియాలో సైతం విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను నెరవేరుస్తామన్నా రని, ఇప్పటికే 60 రోజులు గడిచాయని గుర్తు చేశారు. దళితుల అభివృద్ధి కోసం బ్యాంకుల్లో దళితబంధు పథకం డబ్బులు వేస్తే, వాటిని ఫ్రీజింగ్‌లో పెట్టారన్నారు. రైతుబంధు డబ్బులను నేటికీ అన్నదాతలకు జమ చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. అలాగే డీడీలు కట్టిన గొల్లకురుమలు గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రైతురుణ మాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పటికీ అమలు చేయలేక పోయారని మండిపడ్డారు. రాష్ట్రంలో 18 ఏళ్ల నిండిన మహిళలు 1.52 కోట్ల మంది ఉన్నారని, వారికి రూ. 2,500 చొప్పున ఎప్పుడు వేస్తున్నారో చెప్పాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజలు తిరగబడతారన్నారు. బడ్జెట్ లేదని తెలిసి కూడా అధికారం చేజిక్కించుకునేందుకు నోటికొచ్చిన హామీలన్ని ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.4 వేల పింఛన్‌ను ఎప్పటి నుంచి ఇస్తారో తెలపాలని ప్రభుత్వాన్ని నిలదీశారు.

వ్యవసాయానికి కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటలు వ్యవసాయానికి కరెంటిస్తే.. ప్రస్తుతం 14–16 గంటలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. పదవులు వస్తే బాధ్యత పెరగాలే తప్ప, ప్రతిపక్షాలను కించపరిచేలా మాట్లాడొద్దని ఒక మంత్రికి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒకటేనంటూ దుష్ప్రచారం

కేటీఆర్‌పై బీజేపీ నేత కె.లక్ష్మణ్ విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: అధికారం కోల్పోవడంతో మతిభ్రమించిన మాజీ మంత్రి కేటీఆర్... బీజేపీ, కాంగ్రెస్ ఒకటేనంటూ దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మండిపడ్డారు. ఓటమి కుంగుబాటులో కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబ అవినీతి, అహంకారం కారణంగా ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించారే తప్ప, అది కాంగ్రెస్ విజయం కాదన్నారు. ఎన్నికల్లో ఉచితాలు, గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులను, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఆదివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి జనసేనతో పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేసి పది సీట్లు సాధిస్తామనే ధీమా వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ ఎంక్వైరీ జరిపించి, అవినీతి సొమ్మును కక్కించి ప్రజలకు పంచుతామన్న కాంగ్రెస్ నాయకుల గొంతులు మూగబోయాయని విమర్శించారు. అవినీతి ఆరోపణలున్న అధికారులతోనే కాంగ్రెస్ మంత్రులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ – కాంగ్రెస్ పార్టీలు రెండూ తోడుదొంగల వంటివని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టాలని కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని లక్ష్మణ్ తెలిపారు.



టీజీటీఏ డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- పల్లెల్లో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేస్తాం

సాక్షి, హైదరాబాద్(బంజారాహిల్స్): రెవెన్యూ వ్యవస్థను గ్రామీణ స్థాయి నుంచి పటిష్టం చేస్తామని, ప్రతి గ్రామంలో రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన ఒక వ్యక్తి ఉండేలా చూడటమే ఈ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను భ్రష్టు పట్టించి గాలిలో పెట్టిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దలు చేస్తున్న తప్పులను బయటకు లీక్ అవుతాయనే భయంతో ఆ వ్యవస్థనే లేకుండా చేయాలని చూశారని ఆరోపించారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) నూతన సంవత్సర డైరీ, కేలండర్లను మంత్రి ఆవిష్కరించారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఆ ప్రభుత్వంలో 10–25 తేదీల వరకు ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదని గుర్తు చేశారు.

ధరణిని ప్రక్షాళన చేస్తాం

ధరణి అనే ఒక పోర్టల్‌ను తీసుకొచ్చి గత సర్కారు ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని మంత్రి పొంగులేటి విమర్శించారు.

ప్రభుత్వంలో సంస్కరణలు, మార్పులు అవసరమని, కానీ అవి కేవలం కొందరి కోసం కాకుండా సామాన్య ప్రజలకు మేలు చేయాలన్నారు. ధరణిలో ఉన్న లొసుగులను ప్రక్షాళన చేసి సామాన్య ప్రజలకు మేలు చేయాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

సీఎం కాలేదని కేటీఆర్ అసంతృప్తి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, హైదరాబాద్: తానే ముఖ్యమంత్రి అవుతానని కేటీఆర్ అనుకున్నారని, సీఎం పదవి రాకపోయేసరికే ఆయన ఇబ్బంది పడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఎద్దేవా చేశారు. ఆయన ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతలు అసంబద్ధంగా మాట్లాడుతున్నారని, ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టడంతో వారి కుళ్లుబుద్ధి బయటపడుతోందన్నారు. కోదండరామ్ ఎంఎల్‌సీ కావడంపై హర్షం వ్యక్తం చేశారు. వచ్చే లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విశాల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న చిన్న పెద్ద రాజకీయ పార్టీలను కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. అప్పుడే ప్రమాదకరమైన ప్రధాని మోదీని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో జరిగే సీపీఐ జాతీయ సమావేశాలకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ నేత అమర్ కౌర్, పార్టీ రాజ్యసభ పక్ష నేత బినయ్ విశ్వం హాజరుకానున్నట్టు తెలిపారు. ఇండియా కూటమిలో కీలక పాత్ర పోషించిన బిహార్ సీఎం నితీశ్.. కక్కిన కూడు తినేందుకే.. తిరిగి ఎన్‌డీఏ కూటమిలోనికి వెళ్తున్నారని దుయ్యబట్టారు. కేజ్రీవాల్‌తో పాటు జార్ఖండ్ సీఎంకు నోటీసులు జారీ చేశారని, ఒక్కో ఎంఎల్‌ఏకు రూ.25 కోట్లు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు బీజేపీకి అనుకూలంగా ఉన్నారని విమర్శించారు. బాబుపైన 17ఏ కేసులు పెండింగ్ ఉన్నాయని నారాయణ గుర్తు చేశారు.

‘ఉపాధి’ కోర్సులపై దృష్టి పెట్టాలి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

‘ఉన్నత విద్య- సవాళ్లు’ అంశంపై జాతీయ సదస్సు ప్రారంభం

బంజారాహిల్స్ (హైదరాబాద్): యువతకు ఉపాధి అందించే కోర్సులపై యూనివర్సిటీలు దృష్టిసారించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సామాజిక శాస్త్ర విభాగం, తెలంగాణ ఉన్నత విద్యామండలి, ఐసీఎస్‌ఎస్‌ఆర్–దక్షిణ భారతదేశ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో ‘భారతదేశంలో ఉన్నత విద్య–సమస్యలు, నాణ్యత–సమగ్రత–సవాళ్లు’ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన లింబాద్రి మాట్లాడుతూ దేశంలో ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య 28.4 శాతం కాగా.. తెలంగాణలో ఇది 40 శాతంగా నమోదవడం శుభపరిణామమన్నారు. అలాగే జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు, మహిళల నమోదు శాతం కూడా బాగా పెరిగిందన్నారు. ఇందులో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ పాత్ర కీలకమని వివరించారు. వర్సిటీలు నైపుణ్యంతో కూడిన, ఉపాధి అందించే కోర్సులను ప్రవేశపెట్టేలా చర్యలు చేపట్టాలని, తద్వారా ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్యను మరింత పెంచడానికి ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొ.వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ, దూర విద్యలో విస్తృత ప్రయోజనాలు, దూర విద్యా వ్యాప్తికి అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ ఉన్నత విద్య వ్యాప్తి ఆ దిశగా సాగడం ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, డీన్లు, అన్ని విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న లింబాద్రి, చక్రపాణి తదితరులు

సీఐ ప్రేమ్‌కుమార్ అరెస్ట్

బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడు రహీల్ కేసులో అప్పటి పంజగుట్ట సీఐ దుర్గారావుతో కలిసి కుట్ర

ప్రేమ్‌కుమార్‌కు శనివారం సీసీఎస్‌లో పోస్టింగ్... ఆదివారం అరెస్ట్.. పరారీలో ఉన్న దుర్గారావు కోసం గాలిస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్, ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): మద్యం మత్తులో కారు వేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్‌ను కేసు నుంచి తప్పించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ ప్రేమ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలిలా... నిజామాబాద్ జిల్లా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రహీల్ గత డిసెంబర్ 24 తెల్లవారుజామున హైదరాబాద్ పంజగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ వద్ద మద్యం మత్తులో వాహనం నడిపి బారికేడ్లను ధ్వంసం చేయడంతో పాటు ప్రజావాణికి వచ్చిన వారిని ఢీకొట్టిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన వెంటనే అప్పటి పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు.. రహీల్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో దుబాయ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే షకీల్ ఈ కేసు నుంచి తన కుమారుడిని తప్పించేందుకు సీఐ దుర్గారావు బ్యాచ్‌మేట్, అప్పటి బోధన్ ఎస్‌హెచ్‌వో ప్రేమ్‌కుమార్‌తో పాటు తన అనుచరుడైన బోధన్ వాస్తవ్యుడు వస్సేను రంగంలోకి దింపాడు. దాంతో పంజగుట్ట పోలీసులు రహీల్ స్థానంలో షకీల్ డ్రైవర్ అబ్దుల్ ఆరిఫ్‌ను ఉంచి రహీల్ దుబాయ్ పరారయ్యేందుకు సహకరించారు. ఈ ఎపిసోడ్‌కు అక్కడితో తెరపడుతుందని భావించారు. అయితే అనూహ్యంగా విషయం వెలుగులోకి రావడంతో కొత్త కథ అల్లారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయించేందుకు రహీల్‌ను పంజగుట్ట ట్రాఫిక్ ఠాణాకు తరలిస్తుండగా... తప్పించుకున్నాడని దుర్గారావు చెప్పుకొచ్చారు. ఈ అంశంపై అనుమానాలు వ్యక్తం కావడంతో రంగంలోకి దిగిన వెస్ట్‌జోన్ డీసీపీ ఎం.విజయ్‌కుమార్ సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లడంతో కట్టుకథ మొత్తం వెలుగులోకి వచ్చింది. అప్పటికప్పుడు దుర్గారావుపై సస్పెన్షన్ వేటు పడగా.. ఆరిఫ్‌ను అప్పుడే అరెస్టు చేసి రహీల్‌పై అదనపు సెక్షన్ల కింద ఆరోపణలు చేర్చారు.



ప్రేమ్‌కుమార్ దుర్గారావు

శనివారం పోస్టింగ్... ఆదివారం అరెస్ట్

మొత్తంగా ఈ కేసులో ప్రేమ్‌కుమార్ కీలకంగా వ్యవహరించారని, అతని సూచనలతోనే పంజగుట్ట ఎస్‌హెచ్‌వో దుర్గారావు కేసును పక్కదారి పట్టించి, రహీల్ దుబాయ్ పారిపోవడానికి సహకరించారని పోలీసులు గుర్తించి ఆదివారం అరెస్టు చేశారు. వాస్తవానికి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీఐల బదిలీలు శనివారం జరగ్గా బోధన్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న బీడీ ప్రేమ్‌కుమార్‌ను సీసీఎస్–3కి బదిలీ చేశారు. బదిలీ జరిగి 24 గంటలు కాకుండానే ఆయనను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈయనతో పాటు అదే పట్టణానికి చెందిన వస్సేను కూడా కటకటాల్లోకి పంపారు. ఇక పరారీలో ఉన్న పంజగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ బి.దుర్గారావు కోసం వెస్ట్‌జోన్ పోలీసులు గాలిస్తున్నారు.

‘స్త్రీనిధి సంస్థలో రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలి’

ఎంపీ లక్ష్మణ్‌కు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: స్త్రీనిధి సహకార సమాఖ్యలో పాతుకుపోయిన రిటైర్డ్ ఉద్యోగులను తొలగించేలా చూడాలని, సిబ్బంది సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్‌కు స్త్రీనిధి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ బ్యాంకుగా గుర్తించి, రూ.5,400 కోట్ల ఔట్ స్టాండింగ్ కలిగిన ఈ సంస్థలో పన్నెండేళ్లుగా పాతుకుపోయిన రిటైర్డ్ అధికారుల స్థానంలో ఐఏఎస్ అధికారుల నియామకం, ఇతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరింది. ఈమేరకు ఆదివారం లక్ష్మణ్‌కు ఈ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగ్‌పూర్ రామ్ మోదీ వినతి పత్రం అందించారు. తమ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించిన లక్ష్మణ్ తగిన తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

దేశవ్యాప్తంగా సమర్థవంతంగా తపాలా సేవలు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో తపాలా శాఖ దేశవ్యాప్తంగా సమర్థవంతమైన సేవలందిస్తోందని కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హా చౌహాన్ అన్నారు. అబిడ్స్‌లోని తపాలాశాఖ ప్రధాన కార్యాలయంలో ఆదివారం తెలంగాణ తపాలాశాఖ రూపొందించిన భద్రాద్రి రామాలయ ప్రత్యేక పోస్టల్ కవర్‌ను ఆయన ముఖ్య అతిథిగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాద్రి రామాలయ విశేషాలతో ప్రత్యేక పోస్టల్ కవర్‌ను రూపొందించడం, దానిని స్వయంగా విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు డాక్‌సదన్ ఆవరణలో మొక్కలను నాటి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, హైదరాబాద్ రీజియన్ పీఎంజీ శ్రీలత, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ, కార్పొరేటర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.



42 శాతానికి బీసీ రిజర్వేషన్లు: ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్ (హైదరాబాద్): పంచాయతీరాజ్ సంస్థల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, చైర్మన్లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల పదవుల్లో బీసీ జనాభా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. 1993లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 24 శాతం ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం 22 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం చేసిన అనవసర ఖర్చుల వల్ల రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని, అప్పులు పేరుకుపోయాయని చెప్పారు. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌కు సంబంధం లేని డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల ఏర్పాటు ఎప్పుడు!

- కంపెనీలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శలు
- గడువు ముగిసినా పలుచోట్ల భూ సేకరణలో వైఫల్యం
- పంట చేతికొచ్చాక ఫ్యాక్టరీ లేకపోతే రైతులకు ఇబ్బంది అంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడంలో కంపెనీలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. అలాగే ఆయిల్‌పామ్ సాగు చేయించడంలోనూ, ఆ మేరకు రైతులను ఒప్పించడంలోనూ అనాసక్తి చూపిస్తున్నాయని తెలుస్తోంది. కొన్ని కంపెనీలు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని కూడా సేకరించలేదు. దాదాపు మూడేళ్ల క్రితమే ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, కంపెనీలు పట్టించుకోవడంలేదని వ్యవసాయరంగ నిపుణులు అంటున్నారు. ఇప్పటివరకు భూములు కొనకపోతే ఫ్యాక్టరీలు ఎప్పుడు నిర్మిస్తారోనన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మూడేళ్లలోపు ఫ్యాక్టరీని నిర్మించాలి. కానీ ఈ నిబంధనను కంపెనీలు అమలు చేయడం లేదు. పంట చేతికొచ్చే సమయానికి ఫ్యాక్టరీ అందుబాటులో లేకుంటే రైతులు ఇబ్బందులు పడతారు. ఇప్పటికే కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేసిన జిల్లాల్లో పంట గెలలు అందుబాటులోకి వచ్చాయి. మరో ఏడాదిలో మరింత దిగుబడి వస్తుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు నిర్లిప్తంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భూమి కొనని కంపెనీలు: వరి, తదితర పంటలకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఒకప్పుడు కేవలం ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్‌పామ్ పంట సాగును ఇతర జిల్లాలకు విస్తరించాలని ప్రణాళికలు రూపొందించింది. దేశవ్యాప్తంగా కేంద్రం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోనూ వివిధ జిల్లాల్లో అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఒకప్పుడు కేవలం ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోనే రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టారు. ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆయిల్‌ఫెడ్‌తోపాటు 14 కంపెనీలకు జిల్లాలను కేటాయించింది. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది చివరికి ఫ్యాక్టరీలను నిర్మించాలి. కానీ ఇందులో ఐదు కంపెనీలు ఇప్పటివరకు ఫ్యాక్టరీల ఏర్పాటుకు భూమిని కొనుగోలు చేయలేదని తెలుస్తోంది. ఈ కంపెనీలు ఇప్పటివరకు కూడా భూములే కొనుగోలు చేయకపోతే ఫ్యాక్టరీలు ఎప్పటికి పూర్తవుతాయోనని అంటున్నారు. ఈ నేపథ్యంలో సాగు లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలతోపాటు ఫ్యాక్టరీల ఏర్పాటుకు చర్యలు తీసు కోని కంపెనీలకు ఉద్యానశాఖ నోటీసులు జారీ చేసింది. అయితే కంపెనీలు మాత్రం ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావడం లేదంటూ వివరణ ఇచ్చాయి. ఇదిలా ఉండగా కంపెనీలపై ఒత్తిడి తేవడంలో అధికారులు విఫలమయ్యారని చర్చ జరుగుతోంది.

ఫిబ్రవరి 11 నుంచి అనురాగ్ సెట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అనురాగ్ ప్రైవేటు యూనివర్సిటీలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, నర్సింగ్ తదితర కోర్సుల్లో 2024–25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఫిబ్రవరి 11 నుంచి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అనురాగ్ వర్సిటీ సీఈఓ ఎస్.నీలిమ తెలిపారు. విద్యార్థులు వచ్చేనెల 10 వరకు ఆన్‌లైన్‌లోరిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాలాజీ ఉట్ల, డైరెక్టర్ పల్లా అనురాగ్‌తో కలిసి అనురాగ్ సెట్–2024 నోటిఫికేషన్ విడుదల చేశారు. అనురాగ్ సెట్–2024లో టాపర్లకు రూ.6.5కోట్ల స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎలాంటి ఎంట్రన్స్ ఫీజు లేదని, ఉచితంగానే https://anurag.edu.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిప్యూటీ జైలర్లుగా ముగ్గురికి పదోన్నతి

- ఉత్తర్వులు జారీ చేసిన హైదరాబాద్ రేంజ్ డీఐజీ డి.శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ (మెన్)గా పనిచేస్తున్న ముగ్గురు అధికారులకు డిప్యూటీ జైలర్లుగా పదోన్నతి కల్పిస్తూ జైళ్లశాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతితోపాటు పోస్టింగ్‌లు కేటాయించారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జైలులో అసిస్టెంట్ డిప్యూటీ జైలర్‌గా ఉన్న పి.రాజేంద్రబాబును సంగారెడ్డి సెంట్రల్ జైల్ డిప్యూటీ జైలర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ జైలులో అసిస్టెంట్ డిప్యూటీ జైలర్‌గా ఉన్న ఎం.సుధాకర్‌రెడ్డికి కల్వకుర్తి సబ్ జైలు డిప్యూటీ జైలర్‌గా పోస్టింగ్ ఇస్తూ కరీంనగర్ జిల్లా జైలుకు ఎటాచ్ చేశారు. అదేవిధంగా చర్లపల్లి సెంట్రల్ జైలులో అసిస్టెంట్ డిప్యూటీ జైలర్‌గా ఉన్న వై.వెంకటరెడ్డికి మిర్యాలగూడ సబ్ జైలు డిప్యూటీ జైలర్‌గా పోస్టింగ్ ఇస్తూ నల్లగొండ జిల్లా జైలుకు అటాచ్ చేసి నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంబంధిత యూనిట్ల అధికారులు ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని డీఐజీ శ్రీనివాస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



> మనిషనేవాడు కేవలం దేవుడి తప్పా?
> లేక దేవుడే మనిషి చేసిన తప్పా?
> – ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 29 జనవరి 2024

ఏది సత్యం? ఏదసత్యం?

'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అనేది ఉపనిషత్ వాక్యం. ఉన్నది ఒకటే సత్యం. దానినే పండితులు అనేక రకాలుగా చెబుతారని దీని అర్థం. వెలుతురు ఉన్న లోకంలో చీకటి ఉన్నట్లే, వసంతం ఉన్న ప్రకృతిలో శిశిరం ఉన్నట్లే సత్యం ఉన్న ప్రపంచంలో అసత్యం కూడా ఉనికిలో ఉంటుంది. అది సహజం. 'సత్యమేవ జయతే'– ఇది కూడా ఉపనిషత్ వాక్యమే! మన దేశం గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజున ఈ వాక్యాన్ని జాతీయ ఆదర్శంగా స్వీకరించాం. 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్/ న బ్రూయాత్ సత్యమప్రియం/ ప్రియంచ నానృతం బ్రూయాత్/ ఏష ధర్మ స్సనాతనః'– ఇది సుభాషిత శ్లోకం. ఎప్పుడూ సత్యాన్నే పలకాలి. సత్యాన్ని ప్రియంగా పలకాలి. సత్యమే అయినప్పటికీ అప్రియంగా పలుకరాదు. ప్రియమైనదే అయినంత మాత్రాన అసత్యాన్ని పలుకరాదు. ఇదే సనాతన ధర్మం అని ఈ శ్లోకానికి అర్థం. అనాదిగా ప్రచారంలో ఉన్న ఉపనిషత్ వాక్యాలను, సుభాషిత శ్లోకాలను గమనిస్తే, అవన్నీ సత్యం పట్ల నిబద్ధతకు అద్దం పడతాయి. సత్యం కోసం సర్వస్వాన్నీ వదులుకున్న సత్యహరిశ్చంద్రుడి కథ మన జాతిపిత మహాత్మా గాంధీ సహా ఎందరికో ఆదర్శప్రాయం.

మరి సత్యసంధతపై ఇంత కట్టుదిట్టమైన పునాదులు ఉన్న మన దేశం నలుచెరగులా నిరంతరం సత్య వాక్కులే వినిపిస్తూ ఉండాలి కదా! సత్యమే వర్ధిల్లుతూ ఉండాలి కదా! అలా అనుకుంటే అది అమాయకత్వమే! దీపం కింద నీడలా సత్యాన్ని అంటిపెట్టుకుని అసత్యమూ ఉంటుంది. సత్యానిదే అంతిమ విజయం కావచ్చు గాక, కాని అప్పుడప్పుడు అసత్యం బలం పుంజుకుని లోకంలో అనర్థాలకు కారణమవుతుంది.

అసత్యం తెచ్చిపెట్టే అనర్థాలకు ఉదాహరణలు మన రామాయణ, మహాభారతాల్లో దొరుకుతాయి. రామబాణం తాకినప్పుడు మాయలేడి రూపంలోని మారీచుడు 'హా సీతా! హా లక్ష్మణా!' అంటూ రాముడి గొంతుతో ఆర్తనాదాలు చేసి, సీతాపహరణానికి కారకుడయ్యాడు. కురుక్షేత్ర సంగ్రామంలో ధర్మరాజు 'అశ్వత్థామ హతః' అని బిగ్గరగా పలికి, భేరీనాదాలు మోగే సమయంలో 'కుంజరః' అని గొణిగి ద్రోణాచార్యుడి మరణానికి కారకుడయ్యాడు. అబద్ధం చేసే అలజడి మార్మోగే సమయంలో మనకు మెదడు పనిచేయదు. వెనువెంటనే నిజాన్ని తెలుసుకోగల వ్యవధి ఉండదు. నిజాన్ని తెలుసుకునే వ్యవధిలోగానే అబద్ధం నానా అనర్థాలను కలిగిస్తుంది.

అసత్య ప్రచారం అట్టహాసంగా సాగుతున్నప్పుడు సత్యమేదో, అసత్యమేదో తేల్చుకోవడం దుస్సాధ్యంగా మారుతుంది. పత్రికలు మొదలయ్యాక ఆధునిక ప్రపంచంలో అసత్య ప్రచారం బలం పుంజుకోవడం మొదలైంది. అబద్ధాలకు పత్రికలు ఊతమివ్వగల అవకాశాలను తొలితరాల్లోనే కొందరు రాజకీయవేత్తలు గుర్తించారు. పత్రికల ద్వారా అబద్ధాలను ప్రచారం చేయడాన్ని హిట్లర్ అనుయాయి గోబెల్స్ ఒక కళలా సాధన చేశాడు. 'ప్రజాభిప్రాయాన్ని మలచే కార్యక్రమాన్ని పర్యవేక్షించే పూర్తి అధికారం రాజ్యానికి ఉంది' అనేది గోబెల్స్ జ్ఞానగుళిక. రెండో ప్రపంచ యుద్ధకాలంలో నాజీ నిరంకుశ రాజ్యానికి గొంతునిచ్చిన గోబెల్స్‌ను ఆరాధించేవారు ప్రపంచంలో నేటికీ ఉన్నారు. నిజానికి ఇప్పుడు గోబెల్స్‌కు బాబుల్లాంటి వాళ్లు పుట్టుకొచ్చారు. ఇలాంటి పరిస్థితులను చూడటం వల్లనే కాబోలు 'ఏది పుణ్యం, ఏది పాపం/ ఏది సత్యం, ఏదసత్యం? / ఏది నరకం, ఏది నాకం?/ ఓ మహాత్మా, ఓ మహర్షీ!' అని వాపోయాడు మహాకవి.

ఇది హైటెక్కు టమారాల యుగం. ఇది సమాచార విప్లవశకం. స్మార్ట్‌ఫోన్ల ఆవిష్కరణతో ప్రపంచం పిడికిట్లో ఇమిడిపోయిన కాలం. క్షీరనీర న్యాయంగా అబద్ధాల నుంచి నిజాలను వేరు చేయగల హంసలు బొత్తిగా కరవైపోతున్న రోజులివి. నిజం వేషాన్ని ధరించిన అబద్ధాన్ని గుర్తించడం అగ్నిపరీక్షగా మారిన రోజులివి. సమాచార ప్రచారానికి ఒకప్పుడు వార్తాపత్రికలు, రేడియో మాత్రమే ఆధారంగా ఉండేవి. ఇప్పుడు ఇరవై నాలుగు గంటలూ ప్రసారాలతో ఊదరగొడుతున్న టీవీ చానళ్లు, నిరంతర కథనాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వార్తా వెబ్‌సైట్లు, వీటికి తోడుగా సామాజిక మాధ్యమ సాధనాలు అనుక్షణం జనాల మీదకు పుంఖాను పుంఖాలుగా సమాచారాన్ని వదిలిపెడుతున్నాయి. వరద ఉధృతి ఉప్పొంగినప్పుడు జలప్రవాహంతో పాటు చెత్తా చెదారం కొట్టుకొస్తుంటాయి. నిర్విరామంగా సాగే నిరంతర సమాచార ప్రవాహంలో సత్యంతో పాటు అర్ధసత్యాలు, అసత్యాలు కూడా అలాగే కొట్టుకొస్తుంటాయి. గుట్టలు గుట్టలుగా పోగుపడుతున్న అసత్యాలు, అర్ధసత్యాల అడుగున సత్యం కనుమరుగుగా ఉంటుంది.

సత్యాన్ని మరుగుపరచేలా సాగుతున్న అసత్యాల, అర్ధసత్యాల సమాచార ప్రవాహం సమాచార కాలుష్యాన్ని పెంచుతోంది. సమాచార కాలుష్యం ప్రపంచానికే పెనుముప్పుగా పరిణమిస్తోంది. అబద్ధాల రణగొణల మధ్య నిజాల గొంతు వినిపించకుండా పోతున్న పరిస్థితి ఏర్పడుతోంది. తప్పుడు సమాచారం ప్రపంచ దేశాలకు ప్రమాదకరంగా మారుతోందని ఇటీవల ప్రపంచ ఆర్థిక వేదిక తన 'గ్లోబల్ రిస్క్ రిపోర్ట్–2024'లో వెల్లడించింది. అసత్యాలు, అర్ధసత్యాలతో హోరెత్తిస్తున్న తప్పుడు సమాచారం ప్రపంచ దేశాల్లో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించడమే కాకుండా, రాజకీయ అస్థిరతకు, అశాంతికి, హింసకు, ఉగ్రవాదానికి దారితీస్తుందని ప్రపంచ ఆర్థిక వేదిక సమర్పించిన ఈ నివేదిక హెచ్చరించింది. 'సత్యమేవ జయతే' అని జాతీయ ఆదర్శంగా చెప్పుకుంటున్న మన భారతదేశమే తప్పుడు సమాచారం వ్యాప్తిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవడం వర్తమాన విషాదం.

తప్పుడు ప్రచారాలపై పాత్రికేయ అస్త్రం

కామెంట్



కరణ్ థాపర్

ఉద్దేశపూర్వకమైన తప్పుడు ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలు ఇవీ అని వెల్లడించడం ఉత్తమమైన పాత్రికేయ విలువలకు ప్రామాణికం అవుతుంది. అటువంటి ఒక ప్రామాణిక గ్రంథమే సీనియర్ జర్నలిస్టులు రాసిన 'లవ్ జిహాద్ అండ్ అదర్ ఫిక్షన్స్: సింపుల్ ఫ్యాక్ట్స్ టు కౌంటర్ వైరల్ ఫాల్స్‌హుడ్స్'! పుస్తకం పేరులో కనిపిస్తున్న 'అదర్ ఫిక్షన్స్' ఏమిటంటే... పాపులేషన్ జిహాద్, బలవంతపు మతమార్పిళ్లు, ముస్లింలను బుజ్జగించడం లాంటి అసత్య ప్రచారాలు. వాస్తవాల నిర్ధారణకు క్షేత్రస్థాయిలో నుండి, మీడియా వార్తల తవ్వకాల నుండి సంగ్రహించిన కచ్చితమైన పరిశోధనాంశాలతో హాస్యాస్పదమైన అభియోగాలను రచయితలు బట్టబయలు చేశారు. 2014 తర్వాత 'గో–సంబంధ దాడులు' ఎంత పెరిగాయో కూడా ఈ పుస్తకం చూపిస్తుంది.

ఒకవేళ మీకు కూడా నాలాగే భారతీయ పాత్రికేయ వృత్తి వైఖరులపై నిరాశ మొదలై ఉంటే, కనుచూపు మేరలో భూమ్యాకాశాలు కలిచేచోట ఒక శుభవార్త ఉందని తెలుసుకుని మీరెంతగానో సంతోషిస్తారు. అది టీవీ న్యూస్ ఛానెల్ కోసమో లేదా వార్తాపత్రిక కోసమో జరిగిన పనైతే కాదు. నిజానికి అదొక పుస్తకం. ఆ పుస్తకం అత్యున్నత పాత్రికేయ ప్రమాణాలను కలిగివుండి, ఖ్యాతిని కోల్పోతున్న వృత్తిపై విశ్వాసాన్ని పాదుగొల్పే ఒక గణనీయ పునరుద్ధరణ. ఈ రోజు నేను ఆ పుస్తకం వైపు మీ దృష్టిని మరల్చాలని అనుకుంటున్నాను.

'లవ్ జిహాద్ అండ్ అదర్ ఫిక్షన్స్: సింపుల్ ఫ్యాక్ట్స్ టు కౌంటర్ వైరల్ ఫాల్స్‌హుడ్స్' అనే ఆ పుస్తకాన్ని ఇద్దరు మాజీ ఎన్డీటీవీ జర్నలిస్టులు శ్రీనివాసన్ జైన్, మరియమ్ అలావీ; 'స్క్రోల్' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సుప్రియా శర్మ కలిసి రాశారు. పుస్తకం పేరులో కనిపిస్తున్న 'అదర్ ఫిక్షన్స్' ఏమిటంటే... పాపులేషన్ జిహాద్, బలవంతపు మతమార్పిళ్లు, ముస్లింలను బుజ్జగించడం, ఇంకా సోకాల్డ్... 'పింక్ రివల్యూషన్'.


ప్రతి కేసులోనూ మొదట ఈ పుస్తక రచయితలు ఉద్దేశపూర్వకమైన తప్పుడు ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలు ఇవీ అని వెల్లడిస్తారు. ఆ తర్వాత వాస్తవాల నిర్ధారణకు క్షేత్రస్థాయిలో నుండి, మీడియా వార్తల తవ్వకాల నుండి సంగ్రహించిన కచ్చితమైన పరిశోధనాంశాలతో హాస్యాస్పదమైన ఆ అభియోగాలను బట్టబయలు చేస్తారు. లేదా ఆ ఆరోపణల్లోని అవాస్తవాలను ధ్వంసం చేస్తారు.

పుస్తకం గురించి నేను చెప్పవలసి ఉన్నదానిలో ఇంతకుమించి ఒక్కమాటైనా చెప్పకుండా నేను జాగ్రత్త పడాలనుకుంటున్నాను. మీకై మీరు చదవవలసిన అవసరం ఉన్న పుస్తకం ఇది. తనని చదివించుకునేలా చేస్తుంది. మిమ్మల్ని ఒప్పించేలా చదివిస్తుంది. అయినా గానీ, మీ ఆకలిని నన్ను కాస్త రెచ్చగొట్టనివ్వండి.

లవ్ జిహాద్‌పై ఈ పుస్తక రచయితలు విశ్వ హిందూ పరిషత్ అంతర్గత పత్రిక ప్రత్యేక సంచిక ప్రచురించిన జాబితాలోని కేసులను విశ్లేషించారు. ''లవ్ జిహాద్‌పై అందుబాటులో ఉన్న ఏకైక సమగ్ర సాక్ష్యాధార సమాచారం అదొక్కటే''. అయితే నిజానికది, ''147 వార్తా కథనాల క్రమానుగత కూర్పు మాత్రమే''. ఆ కూర్పులో మొదటి కేసు 2011 నవంబరు నాటిది, చివరి కేసు 2020 సెప్టెంబర్ లోనిది.

వాటిల్లో డెబ్బై మూడు, అంటే సగానికి సగం కేసులు 'వాస్తవాలకు నిలబడనివి'. ''అవన్నీ లింకులు తెగినవి, చెప్పిందే చెప్పినవి, భారతదేశానికి సంబంధం లేనివి''. తక్కిన డెబ్బై నాలుగు... ''మోసం, అపహరణ, విడిచిపెట్టటం, అత్యాచారం, హత్య మొదలైన వాటితో సహా లింగ సంబంధ నేరాల విస్తృత సమాచారం. ''అన్నిటిలోనూ ఉమ్మడిగా ఉన్నది ఒకటే. నిందితుడు ముస్లిం, బాధితురాలు హిందువు'' అని రచయితలు పేర్కొన్నారు. లవ్ జిహాద్ లక్ష్యం హిందూ మహిళల్ని మాయచేసి, మభ్యపెట్టి మతం మార్చడమే అయితే ఈ ఉదాహరణలు కేసును బలహీన పరుస్తాయి.





2014 తర్వాత ''గో–సంబంధ దాడులు'' ఎంతలా విపరీతంగా పెరిగాయో కూడా ఈ పుస్తకం చూపిస్తుంది. ''ఇంటర్నెట్‌లోని మీడియా ఆర్కైవ్స్‌ను ఉపయోగించి మేము రెండు కాలాల వ్యవధిలో... 2009 నుండి 2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో, 2014లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి 2023 మే వరకు... జరిగిన గో–సంబంధ దాడుల సంఖ్యను లెక్కించాం'' అని పుస్తక రచయితలు వెల్లడించారు.

నిజం ఏమిటో తెలిసిన కొద్దిమందికి ఆ లెక్కలు ఆశ్చర్యం కలిగించవు. తెలియని ఎక్కువమంది మాత్రం నమ్మలేనట్లు చూస్తారు. ''2009–2014 మధ్య ఒకే ఒక గో–సంబంధ హింసాత్మక సంఘటనను మేము కనుగొన్నాము.'' ఆ కేసులో కూడా, ''దాడి వీహెచ్‌పీ నేతృత్వంలో జరిగింది''. అందుకు భిన్నంగా, ''2014 నుంచి 2023 మే వరకు అలాంటి గో–సంబంధ దాడులు 136 వరకు జరిగినట్లు మా లెక్కల్లో తేలింది. ఆ దాడుల్లో 66 మంది మరణించారు. 284 మంది గాయపడ్డారు. హతులైన వాళ్లలో కనీసం 70 శాతం మంది ముస్లింలే'' అని వారు వివరాలు పొందుపరిచారు.

ద్వేషపూరిత ప్రసంగాల విస్తృతిపై ఈ రచయితలు బహిర్గతపరచిన వివరాలను కూడా మీకు చెబుతాను. ''2009–2014 మధ్య కాంగ్రెస్ హయాంలో దాదాపుగా 25 వరకు అలాంటి ద్వేష ప్రసంగాలు మా లెక్కకు అందాయి. ఆ సంఖ్య బీజేపీ హయాంలో ప్రముఖ వ్యక్తులు చేసిన విద్వేష ప్రసంగాలతో కలిపి 460కి చేరుకుంది''. అంటే తొమ్మిది రెట్ల దూకుడు!

మీలో చాలామంది లవ్ జిహాద్, పాపులేషన్ జిహాద్, బలవంతపు మతమార్పిళ్ల వంటి అపోహల్ని నమ్మకపోవచ్చు. ముస్లింల బుజ్జగింపు జరుగుతోందంటే మాత్రం బహుశా మీలో ఎక్కువమంది నమ్మే అవకాశమైతే ఉంది. అప్పుడైతే మీరు ఆ అంశానికి సంబంధించిన అధ్యాయాన్ని ఈ పుస్తకంలో తప్పనిసరిగా చదవాలి. అందులో రచయితలు ఈ బుజ్జగింపు అభియోగాన్ని అక్షరాలా తుడిచిపెట్టేశారు. ఎంత ప్రభావవంతంగా వారు ఆ పని చేశారన్నది కనిపెట్టే విషయాన్ని మీకే వదిలేస్తాను. కానీ వారిచ్చిన ముగింపులలో ఒకదాని గురించి చిన్న ముక్క చెబుతాను. ''హిందూ రైట్‌వింగ్ పొరబడింది. ముస్లింలు కాంగ్రెస్ బుజ్జగింపులకు దూరంగా ఎక్కడో అట్టడుగున ఉండిపోయారు. కాంగ్రెస్ దేనికైనా దోషిగా నిలబడింది అంటే... ఆ దోషం... అంత సుదీర్ఘంగా అధికారంలో ఉండి కూడా ముస్లింలను పైకి తేవటంలో విఫలం అవటమే'' అని రచయితలు వ్యాఖ్యానించారు.

చిన్నపాటి ధార్మిక ఉపన్యాసంతో నేనిది ముగిస్తాను. సత్యాన్ని చూడకూడదని అనుకునేవారు, అంధులుగానే ఉండిపోయేందుకు ప్రాధాన్యం ఇచ్చేవారు ఈ పుస్తకం చదవకండి. ఎందుకంటే అది వారి నిరాధారమైన భ్రమల్ని పటాపంచలు చేస్తుంది. కానీ నిజం ఏమిటో తెలుసుకోగోరే యథార్థవాదులకు ఇది చదవవలసిన పుస్తకం. వాస్తవాలను సరళంగా, పూత పూయని పదాలతో తేలిగ్గా జీర్ణమయ్యేలా మీకు ఈ పుస్తకం చెబుతుంది. అంతే తేలిగ్గా మీరు పుస్తకం లోపలి విషయాలను అంగీకరించ గలుగుతారని నేను ఆశిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనుషులు కాదా?



మొత్తం అఫ్గానిస్తాన్ కంటే ఒక్క పాకిస్తానీయుడి ప్రాణాలు విలువైనవి అని (పాకిస్తాన్) జనరల్ అసీమ్ మునీర్ అన్నారు. ఇలా అనడం ద్వారా, గత ఏడు దశాబ్దాలలో ఇంకెవరూ పాక్–అఫ్గాన్ సంబంధాలను చెడగొట్టలేనంతగా చెడగొట్టారు. ఇది మునీర్ సిద్ధాంతమా?

– తిలక్ దేవేశర్, రచయిత

ఇంత అవమానమా?



'భారతదేశానికి 1947 నుంచీ దేహం ఉంది. 2024లో ఆత్మను పొందింది' అని చెప్పే తీర్మానాన్ని కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అంటే, 75 ఏళ్లుగా మనం ఆత్మలేని దేహాలం, కేవలం రాజకీయ మాంసాన్ని ఈడ్చుకుంటూ వస్తున్నామా? నా ప్రియమైన దేశం గురించి ఎవరూ ఇంత అవమానకరంగా, అప్రతిష్ఠపాలు చేసేలా మాట్లాడటం ఎప్పుడూ వినలేదు. విషాదం!

– సందీప్ మనుధానె, విద్యావేత్త

అంటగడుతున్నారా?



ప్రధానిగా మోదీ హయాంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఏడు సార్లు ఇండియాకు వచ్చారు. ఈ ఏడుసార్లూ ఫ్రెంచ్ మిలిటరీ ఉత్పత్తులు, ముఖ్యంగా రఫేల్‌కు సంబంధించిన భారీ కొనుగోళ్లను ఇండియా జరిపింది. ఎందుకు? రఫేల్‌ను ఇంకే దేశమూ కొనడం లేదు. ఇండియా మాత్రం ఎందుకు తప్పకుండా కొనాలి?

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఆగాల్సిన హననం



గాజాలో ఇజ్రాయెల్ నరమేధ నేరాలకు పాల్పడుతోందని అంతర్జాతీయ న్యాయస్థానం మంచి తీర్పు వెలువరించింది. ఇది వెంటనే ఆగిపోవాలి. ఆ తీర్పును ఇప్పుడు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆచరణలోకి తేవాలి. దీన్ని యూఎస్ వీటో చేయదని ఆశ. లేదంటే నరమేధంలో అది స్పష్టమైన భాగస్వామి అవుతుంది.

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్ట్

కొత్త మార్పు




ఇజ్రాయెల్ మీద హమాస్ జరిపిన దాడులను సంకేతిస్తూ, జోర్డాన్‌లో ఒకతను '7 అక్టోబర్' పేరుతో దుకాణం తెరిచాడు. దుకాణానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల తర్వాత ఆ పేరును తొలగించాడు. ఇది మధ్య ప్రాచ్యంలో వస్తున్న మార్పునూ, హమాస్ తీవ్రవాద సానుభూతిపరుల మీద వ్యతిరేకతనూ సూచిస్తోంది.

– అమ్జద్ తాహా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

దక్షిణాది ప్రథమ ప్రజా ఉద్యమకారుడు

దక్షిణ భారతదేశ చరిత్రలో 19వ శతాబ్దం పూర్వార్ధంలోనే మద్రాస్ పట్టణం కేంద్రంగా సమకాలీన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక పునరుజ్జీవన యుగనిర్మాతల్లో ఒకడిగా పేరు మోసిన కర్మవీరుడు గాజుల లక్ష్మీనరసు చెట్టి (1806–68). చెన్నపట్టణంలో కోట్లకు పడగలెత్తిన వాణిజ్య ప్రముఖుడు గాజుల సిద్దులు చెట్టి తనయుడిగా తండ్రిని మించిపోయి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక క్షేత్రాల్లో ఎనలేని సేవచేసి, చరిత్ర కెక్కిన శలాక పురుషుడు ఈయన.



మద్రాస్ ప్రెసిడెన్సీలో పేదరికం, అజ్ఞానం, అవిద్యల వల్ల మూగజీవాల్లా బతుకుబండి ఈడుస్తున్న లక్షలాది మందిలో చైతన్యం కలిగించి, ఈస్ట్ ఇండియా అధికారుల్ని నిలదీసే ధైర్యసాహసాలు వాళ్లలో రగిల్చిన ప్రశాంత రణధీరుడు.

ఆయన సునిశిత దృష్టి సమకాలీన సాంఘిక జీవితంలోని లోటుపాట్లను, అసమానత్వాన్ని, మూఢ విశ్వాసాల్ని లోతుగా పరిశీలించి, నిరసించింది. లక్ష్మీనరసు బతుకు బడిలో చదువు సాములు నేర్చి, ప్రజల కష్టాల్ని, కడగండ్లను గమనించి వాటి నివారణకై కంకణ బద్ధులయ్యారు. జనహిత నాయకుల సహవాసం, దేశ విదేశీ మేధావుల సాంగత్యం ఆయన్ను సమాజ హితైషిగా, సంఘ సంస్కర్తగా రూపొందించాయి. ఆయన వికసిత వ్యక్తిత్వం వల్ల దక్షిణ భారతదేశ చరిత్రలో యుగ ప్రవర్తకుడు కాగలిగారు.

లక్ష్మీనరసు చెట్టి సగటు ప్రజల విద్య, ఉద్యోగం, వ్యవసాయం, వ్యాపారం వంటివాటికి సంబంధించిన సమస్యల్ని మహజర్ల ద్వారా ఈస్టు ఇండియా కంపెనీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 'క్రిసెంట్' అనే ఇంగ్లీషు పక్ష పత్రిక (1844)ను స్థాపించి వలస ప్రభుత్వ విధానాల్ని తీవ్రంగా ప్రతిఘటించారు. ప్రభుత్వ నిర్ణయాలు, లొసుగుల్ని పరిశోధక పాత్రికేయుల ద్వారా బట్టబయలు చేయించి అధికార వర్గానికి సింహస్వప్న మయ్యారు. మిషనరీల మతాంతీకరణకు విరుద్ధంగా పోరాడి, దాన్ని అరికట్టడంలో కొంతవరకు విజయం సాధించారు. ఆయన స్థాపించిన 'ది మద్రాస్ నేటివ్ అసోసియేషన్' (1852) ద్వారా కూడా ప్రజల సమస్యలు కొన్ని తీర్చారు. ఆయన వెనుక లక్షలాది ప్రజలున్నారన్న సత్యాన్ని వలస ప్రభుత్వం గ్రహించి, ఆయనకు 'కంపానియన్‌షిప్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఇండియా' అన్న బిరుదునిచ్చింది. 1863లో మద్రాస్ ప్రభుత్వ శాసన మండలి సభ్యునిగా గవర్నరు ద్వారా నియమింపబడ్డారు. ఈ రాజనీతి కోవిదుడు తంజావూరు, మైసూరు, నిజామ్ రాజ కుటుంబాల సమస్యల్ని ఎంతో విజ్ఞతతో వలస ప్రభుత్వాధికారులతో మంతనాలు జరిపి పరిష్కరించారు. ఆయన గొప్పదనాన్ని వివరిస్తూ 'ఆయన దేశభక్తి నిష్కళంకమైనది. త్యాగనిరతి అసమానమైనది. అరుదైన ఆయన వ్యక్తిత్వం భారతదేశ చరిత్రలో శాశ్వతమైనది' అన్నారు చరిత్రకారుడు జి. పరమేశ్వరన్ పిళ్ళై. అటువంటి మహనీయుడు మద్రాసులో 1868లో మృతి చెందారు. ఆయన ప్రజోద్యమాల చరిత్రను 'దక్షిణ భారతదేశంలో ప్రథమ ప్రజా ఉద్యమకారుడు – గాజుల లక్ష్మీనరసు చెట్టి (1806–1868)' అనే పేరుతో ఓ గ్రంథాన్ని ప్రతిభావంతంగా రాశారు వకుళాభరణం రామకృష్ణ, కొంపల్లి సుందర్‌లు. లోతుగా అధ్యయనం చేసి నిష్పాక్షికంగా, స్పష్టంగా రాసినందుకు వారు అభినందనీయులు.

– ఘట్టమరాజు | 99640 82076

తెలుగు భాషా ఉద్దండుడు

సందర్భం



పున్నా కృష్ణమూర్తి

పల్నాడు జిల్లాలో చారిత్రక పట్టణం మాచర్ల. విద్యార్థి దశలో 1960ల్లో లక్ష్మిందేవి మిద్దెల పక్కన లైబ్రరీ నుంచి గడియారం స్తంభం పక్కన కాశీపతి గారి ఇంటికి వెళ్ళేవాడిని. వారి కుమారుడు నా క్లాస్‌మేట్ చంద్రమౌళిని కలుపుకొని బడికి వెళదామని! కాశీపతి స్వర్ణ కంకణం, గండపెండేరం ధరించి తన సహజమైన ఆహార్యంతో వరండాలో కుర్చీపై కూర్చుని ఉండేవారు. ఆయన తెలుగు భాషకు వెన్నెముక అని తెలియదు. ఒకరోజు లక్ష్మిందేవి చెరువు దగ్గర ఒక కారు, ఒక జీపు ఆగి ఉన్నవని, జీపు నుంచి పల్లకీ తీసి బోయీలు మోసుకుంటూ, మేళతాళాలు ముందు రాగా ఊర్లోకి వస్తున్నారని ఉప్పందింది. ఆ పల్లకీ పోకూరి వారి ఇంటి ముందు ఆగింది. కాశీపతి గారికి సంప్రదాయ మర్యాదలు చేసిన పెద్దలు వారిని పల్లకీ ఎక్కించారు. ఊరి బయటకు వెళ్ళాక పల్లకి నుంచి సగౌరవంగా కారులో కూర్చో పెట్టారు. ఆ కారు గద్వాల సంస్థానం నుంచి వచ్చిందని విన్నాము.

నందన నామ వత్సరం (1892–93) మాఘ మాసం తొలి దశమి సూర్యోదయ వేళ మాచర్ల మండలం వెల్దుర్తి సమీపంలో బోడిలివీడు గ్రామంలో జన్మించానని పోకూరి కాశీపతి చెప్పుకున్నారు. రెంటచింతల ఫాదరీ బడిలో ఫస్ట్ ఫారం ఇంగ్లీష్ చదివాననీ, సిరిగిరి పాడులో పెద తండ్రి రంగోజు కోటయ్య ఆశుకవితా మెలకువలు తెలిపారనీ తన విశిష్ట రచన 'కాశీపతి చమత్కృతి'లో తెలిపారు.

'చిత్ర కవి' బిరుదాంకితుడైన కాశీపతి సంప్రదాయ తెలుగు కవిత్వంలో అనితరమైన ప్రక్రియలలో సాహిత్యాన్ని సృజించారు. ఒక వస్తువు చూసే కోణాన్ని బట్టి పరిపరివిధాలుగా కన్పిస్తుంది. అలాగే ఒక కావ్యం అర్థం చేసుకునే రీతిని బట్టి అనేక కావ్యాలుగా కన్పిస్తుంది. అష్ట దిగ్గజాలలో ఒకరైన పింగళి సూరన రామాయణ– మహాభారతంలోని కొన్ని ఘట్టాలను 'రాఘవ పాండవీయం' అనే ద్వ్యర్థి కావ్యం రాశారు. పోకూరి ద్వ్యర్థి –త్ర్యర్థి కావ్యాలు రాశారు. వారి రచన 'సారంగధరీయం'లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం– సారంగధర–తారాశశాంకం ఇతివృత్తాలు మూడు కావ్యాలు మూడు పాయల జడ వలె ఆహ్లాద పరుస్తాయి. ఒక పద్యానికి 30 అర్థాలు వచ్చే 'త్రిమ్శదర్థ' రత్నావళి రచించారు. గంటకు వందలాది



పోకూరి కాశీపతి (1893-1974)

పద్యాలు ఆశువుగా చెప్పగలరని పేరొందిన పల్నాటి సోదరకవులకు ఆశుకవితలో కొనసాగింపు పోకూరి కాశీపతి. కొల్హాపూర్‌లో జరిగిన ఒక కవిత్వ సభలో గంటకు రెండు వందల పద్యాలు ఆశువుగా చెప్పారనీ, ఒక యతి తప్పిందని ఒక పండితుడు అధిక్షేపించిన నేపథ్యంలో 'కవి సింహ' బిరుదాంకితుడు సింహమువలె ప్రత్యుత్తర ఆశు కవితలతో జయజయ ధ్వానాలు అందుకున్నారనీ ప్రత్యక్ష సాక్షి శ్రీ రంగాపురం పోతేదార్ కేశవాచార్యులు పేర్కొన్నారు.

ప – ఫ – బ– భ వంటి అక్షరాలు లేకుండా పెదవులు కలవని అక్షరాలతో అచ్చ తెలుగు పదాలతో 'నిర్వచన నిరోష్ఠ్య శుద్ధాంధ్ర హరిశ్చంద్రోపాఖ్యానం' రచించి, గద్వాల సంస్థానాధిపతి రామభూపాలునికి 1921లో పోకూరి అంకితమిచ్చారు. గద్వాల సంస్థానం ఆస్థాన కవిగా నియమితులైనారు. తెలంగాణ–రాయలసీమ–ఆంధ్ర ప్రాంతాలలోనే కాకుండా కాశీ తదితర సంస్కృత పీఠాలలో సంస్కృత భాషలో తన ప్రతిభను ప్రదర్శించారు. ఎన్నో గజారోహణలు చేశారు. ఎన్నెన్నో గండపెండేరాలు తొడిగించుకున్నారు. గద్వాల సంస్థానం రద్దు అయిన తర్వాత (1948) ఏటా నామమాత్రపు పిలుపులు ఉండేవి. కాశీపతి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఢిల్లీకి పిలిపించుకుని గౌరవించి, గౌరవ భృతిని ఏర్పాటు చేశారు. పోకూరి అభిమానుల్లో ప్రముఖ కవులు జాషువా, తుమ్మల సీతారామమూర్తి, కరుణశ్రీ, ప్రసాదరాయ కులపతి, సి. నారాయణరెడ్డి తదితర సమకాలీనులెందరో ఉన్నారు.

చెన్నైలో 1920 ప్రాంతంలో కాశీపతి అష్టావధానం చేశారు. ఆ అవధానంలో ఒక పృచ్ఛకులు తాపీ ధర్మారావు. వారు ఆశువుగా కాఫీపై ఒక దండకం చెప్పవలసిందిగా పోకూరి వారిని కోరారు. 'శ్రీమన్మహాదేవీ ... అంబ కాఫీ జగన్మోహినీ...' అంటూ వారు చెప్పిన దండకం మద్రాస్ కాఫీ ప్రియులకు కొత్త రుచులను ఇచ్చింది. ఇటీవలి కాలంలో ఒక ప్రముఖ కవి తానే కాఫీ దండకాన్ని తొలిసారిగా రాశాను అన్నారు. బహుశా పోకూరి కాశీపతి ఆశువుగా చెప్పడం వారి దృష్టికి వచ్చి ఉండదు.

పోకూరి కాశీపతి ప్రయోగాలు ఆకాశంలో నక్షత్రాలైతే అందులో ఒక ఉదాహరణ. (నిర్వచన నిరోష్ఠ్య శుద్ధాంధ్ర హరిశ్చంద్రోపాఖ్యానం ఆశ్వా: 2, పద్యం 76) ఒకే అక్షరంతో రాసిన కందపద్యం.


నే నిన్నై నను నీన/న్నానా నే నాన
నూననా నాన్ననవౌ / నా నిన్ను నెన్న నన్నా / నా
నేనున్నాన నానినా నన్నున్నా

ఈ తెలుగు ఉద్దండ పడితుని 131 జయంతిని ఇటీవలే సాహితీ లోకం జరుపుకొన్నది.

వ్యాసకర్త ఇండిపెండెంట్ జర్నలిస్టు
మొబైల్: 76809 50863

క్రమశిక్షణతోనే ఫలితం

అనగనగా ఓ ముని. ఓ చెట్టు కింద కూర్చుని తన పంచెకు ఉన్న చిరుగును కుట్టుకుంటున్నాడు. ఆయన గొప్ప శివ భక్తుడు. అప్పుడు శివపార్వతులు ఆకాశమార్గంలో పోతున్నారు. 'నాథా! చూశారా మీ భక్తుడు చేస్తున్న పని' అని అడిగింది పార్వతి. 'చూశాను' అన్నాడు పరమేశ్వరుడు. 'ఇప్పటికిప్పుడు వెళ్ళి ఏదన్నా వరాన్ని ప్రసాదించి వద్దాం' అన్నది పార్వతి. అయితే పరమేశ్వరుడు 'ఆయన వరాలు పొందే స్థితిని దాటేశాడు. ఇప్పుడు మనం ఆయన వద్దకు వెళ్ళడం అనవసరం. మనం మన దారిన పోదాం' అన్నాడు.



కానీ పార్వతి తన నాథుడిని ఒప్పించింది. మరుక్షణం శివపార్వతులు ముని ఎదుట ప్రత్యక్షమయ్యారు. ముని వారికి కొంతసేపు సపర్యలు చేశాడు. అనంతరం ఆయన యథాప్రకారం చిరిగిన పంచె కుట్టుకోసాగాడు. కొంతసేపు అక్కడ మౌనం రాజ్యమేలింది. ఆది దంపతులు కాసేపు తర్వాత మౌనాన్ని వీడి 'మేము వెళ్ళొస్తాం' అన్నారు. 'అలాగే. నా ఆతిథ్యం స్వీకరించినందుకు మీకు ధన్యవాదాలు' అన్నాడు ముని.

అంతట శివుడు 'ఎవరికైనా మేము దర్శనమిస్తే వారికి ఏదో ఒక వరాన్ని ఇచ్చి గానీ వెళ్ళము. కనుక ఏదన్నా వరం అడుగు' అన్నాడు శివుడు. అందుకు 'వరమా? మీ దర్శనమే నాకు చాలు. నాకు ఏ వరమూ అక్కర్లేదు' అన్నాడు ముని. కానీ శివపార్వతులు బలవంతం చేయడంతో మరో దారి లేక ఒక వరం అడిగాడు. 'నేను కుట్టేటప్పుడు ఈ సూదికి వెనకాతలే దారం పోవాలి, అది చాలు' అన్నాడు. ఆయన మాటలకు శివపార్వతులు విస్తుపోయారు. 'ఇదేం వరం? మరొకటి అడుగు' అంది జగన్మాత పార్వతి. అంతట మునివర్యుడు 'నేను క్రమశిక్షణ తప్పకుండా ప్రవర్తిస్తే రావలసిన ఫలితం తానుగా వెనకతాలే వస్తుంది కదా. అటువంటప్పుడు మీరు నాకెందుకు వరమివ్వాలి' అన్నాడు.

ముని మాటలు విన్న శివపార్వతులు నవ్వుకున్నారు. ఆనందంతో అక్కడి నుంచి వెళ్ళిపోయారు. స్వచ్ఛమైన దైవ భక్తి, నమ్మకం ఉన్న వారికి తాము సరిగ్గా నడుచుకుంటే తమకు రావలసిన ఫలితం వస్తుందన్న ఎరుకే మునిపుంగవుని ఏ వరమూ అడగకుండా చేసింది.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.చవితి తె.6.18 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి పంచమి, **నక్షత్రం:** పుబ్బ సా.5.11 వరకు తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.1.11 నుండి 2.55 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.36 నుండి 1.24 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.41 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.04 నుండి 11.53 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.49.

నర్సింగ్ ఆఫీసర్స్ ఫలితాలు విడుదల

- 6,956 మంది ఎంపిక
- తుది జాబితా వెల్లడి
- 31న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు
- ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: నర్సింగ్ ఆఫీసర్స్ (స్టాఫ్ నర్సు) పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. తుది జాబితాను ఆదివారం ప్రకటించారు. 7,094 పోస్టుల్లో 6,956 మందిని ఎంపిక చేసినట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు ప్రకటించింది. జోన్ల వారీగా రిజర్వేషన్, కటాఫ్‌లను పొందుపరుస్తూ వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 31వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందించనున్నారు. కొత్త ప్రభుత్వంలో మొదటి నియామకం కావడంతో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని భావిస్తున్నారు. దీనిలో భాగంగానే ఎల్బీ స్టేడియంలో భారీగా కార్యక్రమం ఏర్పాటు చేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను ఇవ్వనున్నారు. ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులందరినీ ప్రత్యేక బస్సుల్లో తీసుకురావాలని సర్కారు అన్ని జిల్లాల వైద్యాధికారులకు సూచించింది.

గత ప్రభుత్వం నోటిఫికేషన్..

2022 డిసెంబర్ 30వ తేదీన 2022న 5,204 నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి గతేడాది ఆగస్టు 2న పరీక్ష నిర్వహించింది. 40,936 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 38,674 మంది పరీక్ష రాశారు. ప్రభుత్వం మారిన తర్వాత గత డిసెంబరు 15న ఆ నోటిఫికేషన్‌కు మరో 1,890 పోస్టులను కలిపారు. వీటిలో డీఎంఈ పరిధిలో 5650 పోస్టులు, టీవీవీపీ పరిధిలో 757, ఎంఎన్‌జే, గురుకులాల్లో మిగతా పోస్టులను భర్తీ చేయనున్నారు.

పేస్కేల్ రూ. 36,750 – రూ. 1,06,990

నర్సింగ్ ఆఫీసర్స్‌కు పేస్కేల్ రూ. 36,750 – రూ.1,06,990 ఖరారు చేశారు. దీంతో అభ్యర్థుల నుంచి కూడా భారీగా డిమాండ్ ఏర్పడింది. నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు, ఇతరులూ దరఖాస్తు చేసుకున్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పాయింట్లు కేటాయించడంతో వారే ఎక్కువగా ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. రాత పరీక్షలో మార్కులకు గరిష్ఠంగా 80 పాయింట్లు ఉంటాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గరిష్ఠంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించిన వారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లోని వారికి 2 పాయింట్ల చొప్పున కేటాయించారు.

భద్రాచలాన్ని అభివృద్ధి చేయాలి

- ప్రధాన మంత్రి మోదీకి సాత్‌సేన లేఖ

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో రాముడికి గుడి కట్టించిన విధంగానే దక్షిణ భారతదేశంలో అంతే ప్రతిష్ఠ కలిగిన భద్రాచలాన్ని సైతం అభివృద్ధి చేయాలని 'సాత్‌సేన' ద్రవిడ వెల్ఫేర్ అసోసియే షన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరింది. 'భద్రాచలం అభివృద్ధి మండలి' ఏర్పాటు చేసి కేంద్ర బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు కేటాయించాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం సాత్‌సేన అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ప్రధానికి లేఖ రాశారు. లేఖలో ప్రస్తావించిన అంశాలపై వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 'రామాయణం ప్రకారం సీతమ్మతల్లి, రామచంద్రులు సంచరించిన పర్ణశాల భద్రా చలం పక్కనే ఉంది. సీతమ్మను రావణుడు అపహరించుకుపోయిన ప్రదేశమూ భద్రాచలమే. రావణుడితో వీరోచితంగా పోరాడి జటాయువు ప్రాణాలు విడిచింది కూడా భద్రాచలం వద్దే. ఇలా రామాయణంలోని కీలక ఘట్టాలన్నీ భద్రాచలంలోనే జరిగాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన భద్రాచలం అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఈ పుణ్యక్షేత్రానికి రైలుమార్గం వేసి, ఖమ్మం నుంచి భద్రాచలం రోడ్డును ఆరు లేన్ల రోడ్డుగా మార్చాలి' అని పేర్కొన్నారు. భద్రాచలాన్ని సందర్శించాల్సిందిగా ప్రధానిని కోరారు.

కొనసాగుతున్న డీసీఏ తనిఖీలు

- లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ దుకాణాలపై ఫోకస్

సాక్షి, హైదరాబాద్: డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న, నిల్వ చేస్తున్న మెడికల్ దుకాణాలపై రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మందులను నిల్వ ఉంచడంతోపాటు, విక్రయిస్తున్న వారిపై డీసీఏ అధికారులు ఫోకస్ పెంచారు. తొలుత హైదరాబాద్ నగర పరిధిలోనే ఎక్కువ ప్రాంతాల్లో సోదాలు చేపట్టిన డీసీఏ అధికారులు ఇప్పుడు అన్ని జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లోని డ్రగ్ లైసెన్స్ లేని దుకాణాల జాబితా వెలికి తీస్తున్నారు. తాజాగా హైదరాబాద్ నగర పరిధి ఫలక్‌నుమాలోని జంగంమెట్టులో ఆదివారం నిర్వహించిన సోదాల్లో అచ్యుతరెడ్డి అనే వ్యక్తి డ్రగ్ లైసెన్స్ లేకుండానే మెడికల్ దుకాణం నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఈ దుకాణంలో నిల్వ ఉంచిన మొత్తం 40 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 1.20 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

మెదక్ జిల్లా శివ్వంపేట్ మండలంలో...

మెదక్ జిల్లా శివ్వంపేట్ మండలం కొత్తపేట గ్రామంలో డీసీఏ అధికారులు శనివారం నిర్వహించిన సోదాల్లో నిబంధనలకు విరుద్ధంగా డి. శ్రీనివాస్ అనే వ్యక్తి మెడికల్ షాప్ నడుపుతు న్నట్టు గుర్తించారు. ఈ సోదాల్లో రూ. 70 వేల విలువైన 42 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. సదరు వ్యక్తి శ్రీనివాస్ క్లినిక్‌ను నడుపుతూ ఎలాంటి అర్హత లేకుండానే ఆర్‌ఎంపీ (రూరల్ మెడికల్ ప్రాక్టీ షినర్)గా చెలా మణి అవుతున్నట్టు గుర్తించారు. డ్రగ్ లైసెన్స్ లు లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాప్‌లకు మందులు సరఫరా చేస్తే మెడికల్ ఏజెన్సీలు, డీలర్లపైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు.

ధాన్యమేదీ.. వేలం ఎట్లా?

▶ మొదటి పేజీ తరువాయి

అర్హత పొందినా.. క్వింటాల్ ధాన్యాన్ని సగటున రూ.1,865 ధరకే కొంటామంటూ బిడ్లు దాఖలు చేశాయి. ధర తక్కువకావడంతో ప్రభుత్వం ఆ టెండర్లను రద్దుచేసి.. పలు నిబంధనలను సడలిస్తూ అక్టోబర్ 7న మళ్లీ టెండర్లను ఆహ్వానించింది. ఎక్కువమంది బిడ్ వేసేందుకు వీలుగా.. ధాన్యం లాట్ల పరిమాణాన్ని, టర్నోవర్ అర్హతను తగ్గించింది. కొంత మంది కలసి జాయింట్ వెంచర్‌గా బిడ్డింగ్ దాఖలు చేసే అవకాశమూ ఇచ్చింది. దీనితో పెద్ద ఎత్తున టెండర్లు దాఖలయ్యాయి. మిల్లర్లు కూడా సిండికేట్ అయి ఎవరి మిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని వారే కొనుగోలు చేసుకునేలా గ్రూప్ టెండర్లు వేశారు. కానీ అప్పటికి ఎన్నికల షెడ్యూల్ రావడంతో.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల సంఘం టెండర్ల ప్రక్రియను నిలిపేసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత టెండర్ల ప్రక్రియను రద్దు చేసి.. కొత్తగా గ్లోబల్ టెండర్ల కోసం కమిటీని ఏర్పాటు చేసింది. మిల్లుల్లో ఉన్నట్టు లెక్క చూపించిన ధాన్యానికే ధరకట్టాలనుకున్న మిల్లర్ల ప్లాన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మరోవైపు మిల్లుల్లో ధాన్యం నిల్వలపై ప్రభుత్వం తనిఖీలు చేపట్టడంతో.. అసలు సంగతి బయటపడింది.

తనిఖీలు.. క్రిమినల్ కేసులు..

అధికారిక లెక్కప్రకారం 2022–23 యాసంగి ధాన్యమే 50లక్షల మెట్రిక్ టన్నుల మేర మిల్లుల్లో నిల్వ ఉండాలి. దానికి ముందు ఖరీఫ్ (వానాకాలం)కు సంబంధించిన ధాన్యం 8 లక్షల టన్నులు.. ఇటీవల సేకరించిన 2023–24 వానాకాలం ధాన్యం 45 లక్షల టన్నులు కూడా ఉండాలి. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలోని 3,300 రైస్‌మిల్లుల్లో కలిపి కోటి టన్నులకుపైగా ధాన్యం నిల్వలు ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టిన అధికారులకు ఎక్కడా తగినస్థాయిలో ధాన్యం కనిపించడం లేదు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ డీఎస్ చౌహాన్‌ల ఆదేశాల మేరకు.. అదనపు కలెక్టర్ల నేతృత్వంలోని డీఎస్‌ఓలు, డీఎంల బృందాలు మిల్లుల్లో 2022–23 ఖరీఫ్, రబీ ధాన్యం లెక్కలను పరిశీలించి కేసులు నమోదు చేస్తున్నాయి.

- ఇటీవల పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో మిల్లర్లు ఏకంగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వానికే 'సీఎంఆర్' బియ్యాన్ని విక్రయించినట్టు తేలింది. దీనిపై కేసులు నమోదు చేస్తున్నారు.
- కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూరులోని ఓ రైస్‌మిల్లుకు 38 టన్నుల ధాన్యం కేటాయించగా.. 23,504 క్వింటాళ్లు మాయమైనట్టు గుర్తించారు. రూ.7.18 కోట్లు జరిమానా చెల్లించాలని నోటీసులిచ్చి, మిల్లు నిర్వాహకుడిని అరెస్టు చేశారు.
- మెదక్ జిల్లాలోని హవేలీ ఘన్‌పూర్‌లోని ఓ మిల్లులో రూ.4.75 కోట్ల విలువైన 1,422 టన్నుల ధాన్యం మాయమైనట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. ఇక్కడి దూర్గుపల్లిలోని ఓ మిల్లులో రూ.2 కోట్ల విలువైన బియ్యం మాయమైంది.
- సూర్యాపేట జిల్లాలో ధాన్యాన్ని పక్కదారి పట్టించిన 12 మిల్లులపై ఆర్ఆర్ యాక్ట్ కింద కేసులు పెట్టారు.
- జోగులాంబ గద్వాల జిల్లాలోని 3 రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు పెట్టారు. వనపర్తిలోని 5 మిల్లుల్లో స్టాక్‌లో భారీ తేడాలు ఉన్నట్టు గుర్తించారు.
- సిద్దిపేట జిల్లాలో 20 మిల్లులు వడ్లను అమ్మేసుకున్నట్టు తేల్చారు.
- నిజామాబాద్ జిల్లాలో 8 మిల్లుల్లోని స్టాక్‌లో రూ.33 కోట్ల మేర తేడాలు ఉన్నట్టు గుర్తించి కేసులు నమోదు చేశారు. అత్యధికంగా గంగా రైస్ మిల్ నుంచి రూ.8.09 కోట్లు, రాయల్ ట్రేడింగ్ కంపెనీ రూ.6.48 కోట్లు, ఎంఎస్ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్ రూ.5.05 కోట్ల బకాయిలు ఉన్నట్టు గుర్తించారు.

'ఎమ్మెల్సీ కోదండరాంకు మంత్రి పదవివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ కోదండరాంకు మంత్రి పదవి ఇవ్వాలని సీపీఎస్ ఉపాధ్యా య, ఉద్యోగ సంఘం–తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు కోరారు. తెలంగాణ ప్రజల అవసరాలు, విద్యా వ్యవస్థలో ప్రొఫెస ర్‌గా పనిచేసిన వారికి విద్యా వ్యవస్థపై పూర్తి అవగాహన ఉంటుందని, అందుకే ఆయనకు విద్యాశాఖ కేటాయించాలని తెలిపారు.

ఆల్ఫా హోటల్‌కు బాంబు బెదిరింపు

నిందితుడి అరెస్టు



నిందితుడు గౌస్‌పాషా

రాంగోపాల్‌పేట్: ఆల్ఫా హోటల్ పరిసరాల్లో బాంబులు ఉన్నాయని పోలీసులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన గౌస్ పాషా కూకట్‌పల్లిలోని హ్యాపీ హోటల్‌లో కుక్‌గా పని చేస్తూ జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి అతను ఖమ్మం నుంచి 100కు ఫోన్ చేసి సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్ పరిసరాల్లో బాంబులు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు చర్చించుకుంటున్నారని పోలీసులు వస్తే తాను వారిని చూపిస్తానని చెప్పాడు. దీంతో మార్కెట్ ఎస్సై కిషన్ యాదవ్‌తో పాటు సీసీఎస్ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ అక్కడికి చేరుకుని హోటల్‌తో పాటు పరిసరాలన్నీ తనిఖీ చేశారు. ఎక్కడ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, బాంబులు కనిపించ లేదు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఖమ్మంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'సీఎం కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం'




సాక్షి, హైదరాబాద్: కులగణనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అందుకు అవసరమైన విధివిధానాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడాన్ని తాము అభినందిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో, కాల పరిమితితో కూడిన కులగణన ప్రక్రియను చేపట్టాలన్నారు. 2014లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే శాస్త్రీయంగా లేకపోవడం, ఆ వివరాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని మండిపడ్డారు. దేశ జనాభా లెక్కలు 2021 లోనే జరగాల్సి ఉన్నా వివిధ కారణాలతో ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో రిజర్వేషన్ల పరంగా బీసీలకు తీవ్రం నష్టం వాటిల్లుతోందని సురేశ్ ఆవేదన వ్యక్తంచేశారు. కులగణన జరిగేలోపే నూతన బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కమిషన్లను నియమించి కులగణన ప్రక్రియను పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని సురేశ్ కోరారు. 'రాష్ట్రంలో దేశంలో కులగణన ఆవశ్యకత–ప్రయోజనాలు' అనే అంశంపై త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

పెరిక కులస్తుల్లో రాజకీయ చైతన్యం రావాలి: సురేశ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పెరిక సామాజిక వర్గంలో రాజకీయ చైతన్యం రావాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ సభ్యుడు పెరిక సురేశ్ అన్నారు. ఆదివారం జరిగిన పెరిక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన సామాజిక వర్గంలో పెరికలున్నారని, విద్య, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయ రంగంలో వారు రాణించాల్సిన అవసరముందన్నారు. ఉమ్మడి నల్లగొండ, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పెరికలు అత్యధికంగా ఉన్న ప్పటికీ రాజ కీయంగా వారికి సముచిత స్థానం దక్కలేదని, నల్లగొండ పార్లమెంట్ నియోజక వర్గంలోనే 1.25 లక్షల మంది పెరిక కులస్తులున్నారని వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీలు పెరికలకు టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లక్ష్యాన్ని పూర్తిచేసిన పీవోఈఎం-3 : ఇస్రో



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ నెల 1న ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ58 ప్రయోగంలో పీఎస్-4తో చేసిన ఆర్బిటల్ ఎక్స్‌పర్‌మెంటల్ మాడ్యూల్-3 (పీవోఈఎం-3) నిర్దేశించిన లక్ష్యాన్ని అతి తక్కువ వ్యయంతో పూర్తి చేసినట్లు ఇస్రో ఆదివారం తెలిపింది. ప్రయో గంలో భాగంగా పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ 650 కిలోమీటర్ల ఎత్తులో ఎక్స్‌పోశాట్ అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టిన తరువాత పీఎస్-4 అంటే నాలుగో దశతో ఆర్బిటల్ ఎక్స్‌పర్‌మెంటల్ మాడ్యూల్-3 పేరుతో చేసిన ఎక్స్ పర్‌మెంట్ అనుకున్న లక్ష్యాలను ఛేదించింది. 650 కి.మీ ఎత్తు నుంచి పీవోఈఎం-3ను 350 కి.మీ వృత్తాకార కక్ష్యకు తగ్గించింది. పీవోఈఎం-3లో అమర్చిన పేలోడ్ సాయంతో పవర్ జనరేషన్, టెలీమెట్రీ, టెలికమాండ్ అనే 3 పరికరాలతో 400 కక్ష్యలను పూర్తి చేసింది. పీవోఈఎం-3 ప్రస్తుతం 322 కి.మీ ఎత్తులోని కక్ష్యలో ఉన్నట్లుగా ఇస్రో ప్రకటించింది.

కుల గణనకు చట్టబద్ధత

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని సామాజిక వర్గాల వారీ గణాంకాలను సేకరించనున్నారు.

పాలసీల రూపకల్పనలో కీలకం!

చివరిసారిగా 1931లో బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో కులాల వారీగా జనగణన నిర్వహించింది. ఇప్పటికీ నాటి లెక్కలనే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వ పాలసీలకు రూపకల్పన, నిర్ణయాలు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ప్రభుత్వం వద్ద రాష్ట్ర ప్రజల వివరాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై కచ్చితమైన తాజా సమాచారం అందుబాటులో ఉంటే, వాటికి అనుగుణంగా ఉత్తమ విధానాల రూపకల్పన, నిర్ణయాలు చేయడానికి అవకాశం ఉంటుందని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్ల అమలుకు సైతం ఈ గణాంకాలు ఉపయోగపడతాయి.

బిహార్, కర్ణాటకల్లో కులగణన పూర్తి

బిహార్‌లో అక్కడి ప్రభుత్వం రెండు దఫాలుగా కులగణన సర్వే నిర్వహించి 4 నెలల కింద ఫలితాలను ప్రకటించగా, ఆ రాష్ట్రంలో 63 శాతం బీసీలున్నట్టు తేలింది. గత ఏడాది కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'సోషియో ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషన్ సర్వే' పేరిట కులగణన నిర్వహించింది. కానీ ఫలితాలను ఇంకా ప్రకటించలేదు. ఈ 2 రాష్ట్రాల్లో కులగణన నిర్వహించేందుకు అ వలంభించిన పద్ధతులు అధ్యయనం చేయాలని, ఇందుకోసం ఆయా రాష్ట్రాలకు అధికారులను పంపించాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. కాగా ఏపీలో సైతం ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కులగణన ప్రక్రియను ప్రారంభించింది.

భూతల్లిని నమ్మినవారికి ఎల్లప్పుడూ జయమే

- రికావ్యాలీ వెంచర్ ప్రారంభోత్సవంలో యాంకర్ శ్రీముఖి



బాలానగర్: భూమిపై పెట్టు బడులు పెట్టిన వారందరూ బాగుపడ్డారని, భూతల్లిని నమ్మిన వారికి ఎల్లప్పుడూ జయమే లభిస్తుందని ప్రముఖ యాంకర్ శ్రీముఖి అన్నారు. బాలానగర్ మండలం పెద్దాయపల్లి సమీపంలోని ఎన్‌హెచ్–44 పక్కన 22.7 ఎకరాల్లో రికావ్యాలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాగ్నటిక్ సిటీ వెంచర్‌ను ఆదివారం రిటైర్డ్ డీజీపీ ఎస్‌కే జయచంద్రతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు రిటైర్డ్ డీఐజీ రవివర్మ, రిటైర్డ్ డీఎస్పీలు సాయి రెడ్డి, గోపాల్‌రాజ్ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వ లన చేశారు. అన్ని అనుమతులతో ఏర్పాటు చేసి న వెంచర్ భవిష్యత్‌కు బంగారుబాటలు వేస్తుందని శ్రీముఖి అన్నారు. వెంచర్‌లో పెట్టుబడులు పెడితే భవిష్యత్‌లో ఎంతో లాభాదాయకంగా ఉంటుందని జయచంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో రికావ్యాలీ ఎండీ అర్పత్ నియాజీ, జీసీసీ మాజీ చైర్మన్ వాల్యానాయక్, గిరిజన నాయకుడు లక్ష్మణ్ నాయక్, వైస్ ఎంపీపీ వెంకటాచారి, సర్పంచ్ శంకరప్ప, నాగేందర్ పాల్గొన్నారు.

సీఎంఓఏఐ అధ్యక్షుడిగా లక్ష్మీపతి గౌడ్

- ప్రధాన కార్యదర్శిగా పెద్ది నర్సింహులు



లక్ష్మీపతి గౌడ్



పెద్ది నర్సింహులు


సింగరేణి(కొత్తగూడెం),గోదావరిఖని: సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) అధ్యక్షుడిగా తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ భారీ మెజారిటీతో గెలుపొందారు. సింగరేణి బ్రాంచ్ ఈసీ ఎన్నికల్లో మణుగూరు ఏరియా పీకే ఓసీ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా ఆర్జీ- 3 ఏరియాకు చెందిన పొనుగంటి శ్రీనివాస్, కార్పొరేట్ ఏరియాకు చెందిన రాజీవ్ కుమార్ విజయాన్ని కై వసం చేసుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్జీ–2 ఏరియాలో ఓసీపీ–3 ఈఅండ్ఎం విభాగంలో ఎస్ఈగా పని చేస్తున్న పెద్దినర్సింహులు గెలుపొందారు. సహాయ కార్యదర్శులుగా ఆర్జీ–1 ఏరియా డిప్యూటీ సీఎంఓ రాంపోగు కిరణ్‌రాజ్‌కుమార్, భూపాలపల్లి ఏరియాకు చెందిన సీహెచ్ రాజగోపాల్, కార్పొరేట్ కార్యాలయ కోశాధికారిగా ఇజ్జిగిరి నరేష్, సహాయ కోశాధికారిగా బి.రాజ్‌గోపాల్ ఎన్నికయ్యారు.

రాత్రి పొద్దుపోయే వరకూ సాగిన కౌంటింగ్

పదిరోజులుగా ఉత్కంఠభరితంగా సాగిన సింగరేణి అధికారుల సంఘం ఎన్నికలు ఆదివారం ముగిశాయి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 12ఏరియాల్లో అధికారులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 6గంటలకు సింగరేణి స్థాయి ఎన్నికల లెక్కింపు ప్రారంభించారు. ఈఎన్నికల్లో 2,096 ఓట్లకు 1,856ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల ముఖ్య అధికారి గురువయ్య ఆధ్వర్యంలో అన్నిఏరియాల జీఎంల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు కొనసాగింది. రాత్రి 11గంటల తర్వాత ఓట్ల లెక్కింపు పూర్తయింది.

డీఓపీటీకి తెలియకుండా భూముల కొనుగోలు

- మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌పై కాంగ్రెస్ ఆరోపణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ నిబంధనలు ఉల్లంఘించి ఆస్తులు కొనుగోలు చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు ఎక్కడైనా స్థిర, చరాస్తులు కొనుగోలు చేయాలంటే ముందు డీఓపీటీ (కేంద్ర ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం)కి సమాచారం ఇవ్వాలని, ఆ విభాగం అనుమతి తీసుకున్న తర్వాతే ఆస్తులను కొనుగోలు చేయాల్సి ఉంటుందని వారు చెపుతున్నారు. కానీ సోమేశ్‌కుమార్ ఈ అంశాన్ని పట్టించుకోకుండా హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న జిల్లాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, బినామీల పేరుపై పెద్ద ఎత్తున ఆస్తులను సమకూర్చుకు న్నారని ఆరోపిస్తున్నారు. సోమేశ్‌కుమార్ భార్య పేరున యాచారం మండలం కొత్తపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 249, 260లలో 25.19 ఎకరాల వ్యవసాయ భూములు కొనుగోలు చేశారని, 2018 జనవరి 25న ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని చెపుతున్నారు. ఈ విషయాన్ని డీఓపీటీకి తెలియ చేయలేదని అంటున్నారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత, సామాజిక కార్యకర్త మన్నె నర్సింహారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమేశ్‌తోపాటు మరికొంత మంది ఐఏఎస్‌లు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఆస్తులు కూడబెట్టారని ఆయన ఆరోపించారు.

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతిమధురం

60 ఏళ్ల తరువాత అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కరీంనగర్: వారంతా 75 ఏళ్ల వయసు దాటిన వయోవృద్ధులు. 60 ఏళ్ల అనంతరం ముదిమి వయసులో ఒకచోట కలుసుకున్నారు. గత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1964లో పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కృషిభవన్‌లో ఆదివారం జరిగిన ఈ వేడుకకు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. అనంతరం గ్రూప్‌ఫొటో దిగారు.

24 మంది ఎమ్మెల్యేల ఎన్నికపై పిటిషన్లు

- రాష్ట్ర హైకోర్టులో దాఖలు
- కేటీఆర్, హరీశ్‌రావు ఎన్నికపై కూడా..
- ప్రస్తుతం స్క్రూటినీ దశలో.. త్వరలో నంబర్ కేటాయింపు!

సాక్షి, హైదరాబాద్: గత నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలిచిన 24 మంది అభ్యర్థుల ఎన్నికను సవాల్ చేస్తూ హైకోర్టులో 24 పిటిషన్లు దాఖలయ్యాయి. వారి ఎన్నిక చెల్లదని, శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ కొందరు, తమను ఎమ్మెల్యేలుగా ప్రకటించాలని మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎన్నికను కూడా సవాల్ చేయడం గమనార్హం. చట్ట ప్రకారం ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోపు ఆ ఎన్నికను సవాల్ చేస్తూ పిటిషన్ వేయాల్సి ఉంటుంది. కాగా ఈ పిటిషన్లన్నీ ఇంకా స్క్రూటీని దశలోనే ఉన్నాయి. నంబర్లు కాలేదు. అన్నీ సరిగా ఉంటే త్వరలో రిజిస్ట్రీ నంబర్లు కేటాయించనుంది.

కేటీఆర్ విజయంపై పిటిషన్

2023 ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్, కాంగ్రెస్ తరఫున మహేందర్‌రెడ్డి పోటీ చేశారు. కేటీఆర్‌కు 89,244 ఓట్లు, మహేందర్‌రెడ్డికి 59,557 ఓట్లు వచ్చాయి. అయితే కేటీఆర్ విజయం చెల్లదని, అఫిడవిట్‌లో పూర్తి సమాచారం వెల్లడించలేదంటూ మహేందర్‌రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడిపై ఉన్న 32 ఎకరాల భూమి వివరాలు చెప్పలేదని ఫిర్యాదు చేశారు. అలాగే వీవీ ప్యాట్లను మరోసారి లెక్కించాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కేటీఆర్ ఎన్నికను రద్దుచేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హరీశ్‌రావు పూర్తి సమాచారం వెల్లడించలేదు

సిద్దిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కాంగ్రెస్ తరఫున హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. హరీశ్‌రావుకు 1,05,514, హరికృష్ణకు 23,206 ఓట్లు, చక్రధర్‌కు 16,610 ఓట్లు వచ్చాయి. అయితే గెలిచిన హరీశ్‌రావు అఫిడవిట్‌లో పూర్తి సమాచారం వెల్లడించకుండా రహస్యంగా ఉంచారని, తన కుమారుడి వివరాలు పేర్కొనలేదని చక్రధర్ పిటిషన్ దాఖలు చేశారు. 2018లో 36 కేసులుండగా, 2023లో 3 కేసులున్నట్లు చెప్పారని.. మిగతా కేసులు గురించి ప్రస్తావించలేదని పేర్కొన్నారు. ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరారు.

మరికొందరిపై కూడా..

హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ ఈటల రాజేందర్ (బీజేపీ), జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్) విజయాన్ని సవాల్ చేస్తూ అజారుద్దీన్ (కాంగ్రెస్), కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావు ఎన్నికపై బండి రమేశ్ (కాంగ్రెస్) పిటిషన్లు దాఖలు చేశారు. గద్వాల, ఆసిఫాబాద్, పటాన్‌చెరు, కామారెడ్డి, షాద్‌నగర్, ఆదిలాబాద్, మల్కాజిగిరి, కొత్తగూడెం తదితర నియోజకవర్గాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఎన్నికను సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థులు పిటిషన్లు వేశారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్‌లలో అవకతవకలున్నాయని, కొన్ని వివరాలు వెల్లడించలేదని ఆరోపించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లను మళ్లీ లెక్కించాలని కోరారు. ఇలావుండగా నాగర్‌కర్నూల్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన మర్రి జనార్దన్‌రెడ్డి ఎన్నికల కమిషన్ తన విధులను సక్రమంగా నిర్వహించలేదంటూ పిటిషన్ వేశారు.

మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
ఐదుగురు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాధవి

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వద్ద ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారును గుర్తు తెలియని లారీ ఢీకొన్న ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, మహిళ ఉన్నారు. నార్కట్‌పల్లి – అద్దంకి హైవేపై మిర్యాలగూడ పట్టణ పరిధిలోని కృష్ణానగర్ కాలనీ వద్ద అర్ధరాత్రి 12.10 నిమిషాల సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

తీర్థయాత్రలకు వెళ్లి వస్తుండగా..

మిర్యాలగూడ మండలం నందిపాడుకు చెందిన చెరుపల్లి చెరుపల్లి మహేష్ హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. మూడురోజుల క్రితం అతని కుటుంబంతో పాటు బంధువులు కొందరు కలిసి కారులో తీర్థయాత్రలకు వెళ్లారు. యాత్ర ముగించుకుని ఆదివారం రాత్రి గుంటూరు వైపు నుంచి ఇంటికి తిరిగి వస్తూ మరో ఐదు నిమిషాల్లో ఇల్లు చేరతారనగా ప్రమాదం చోటు చేసుకుంది. నిద్ర మత్తులో ఉండి డ్రైవింగ్ చేస్తుండగా కారు డివైడర్ దాటి రావడంతో అటుగా వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ (32), అతని భార్య చెరుపల్లి జ్యోతి (30), కుమార్తె రిషిక (6), మహేష్ షడ్డకుడు బొమ్మ మహేందర్ (38), అతని కుమారుడు లియాన్ష్ (2) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మహేందర్ భార్య మాధవిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మహేందర్‌ది యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి అని తెలిసింది. మృతదేహాలను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు చేవెళ్లకు కేటీఆర్

చేవెళ్ల, పరిగి కార్యకర్తల సమావేశానికి హాజరు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని చేవెళ్ల, పరిగి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. ఉదయం 11 గంటలకు చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో జరిగే ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు పరిగి నియోజకవర్గంలోని ఎస్ గార్డెన్‌లో ముఖ్యకార్యకర్తలతో కేటీఆర్ భేటీ అవుతారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఈనెల 27న అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యకర్తల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 10లోగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు పూర్తి చేసేలా బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేసింది.

'జైపాల్‌రెడ్డి పరిశోధక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి'

సాక్షి, హైదరాబాద్: ఓయూ పూర్వ విద్యార్థి సూదిని జైపాల్‌రెడ్డి పేరుతో పరిశోధక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఓయూలో తెలంగాణ కోసం ఉద్యమాలు చేసి ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జైపాల్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు.

సుప్రీం ప్రమాణాలతో సుదృఢ ప్రస్థానం

సుప్రీంకోర్టు వజ్రోత్సవాల్లో ప్రధాని మోదీ ● సమస్యలపై చర్చ జరగాల్సిందే: సీజేఐ ● ఉత్సవాల్లో పాల్గొన్న పలు దేశాల సీజేఐలు

సాక్షి, న్యూఢిల్లీ: అత్యున్నత న్యాయస్థానం తన సుదీర్ఘ ప్రస్థానంలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పిందంటూ ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. తద్వారా దేశ ప్రజాస్వామ్య యాత్రను మరింతగా బలోపేతం చేసిందన్నారు. సుప్రీంకోర్టులో తొలి విచారణ జరిగి ఆదివారంతో 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన వజ్రోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్ దేశాల ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న స్వేచ్ఛ, సమానత్వం, న్యాయసూత్రాల పరిరక్షణకు నిరంతరం పాటుపడుతోందని కితాబిచ్చారు. వ్యక్తిగత హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛ వంటి కీలకాంశాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పులు ఇతర దేశాలకు కూడా కరదీపికలని అభిప్రాయపడ్డారు. దేశ సామాజిక, రాజకీయ ప్రస్థానాన్ని అవి మేలిమలుపు తిప్పాయన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనకు సాధికార న్యాయవ్యవస్థ అత్యంత కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ''శరవేగంగా మారుతున్న అవసరాలకు అనుగుణంగా చట్టాలను కూడా హబూబా ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. ఈ నూతన చట్టాలు భవిష్యత్ భారతాన్ని మరింతగా బలోపేతం చేస్తాయి. సులభ, సత్వర న్యాయం దేశ పౌరులందరి హక్కు. అందుకే ఈ–కోర్టు మిషన్ ప్రాజెక్టు–3కి నిధులు పెంచాం. కోర్టుల్లో మౌలిక సదుపాయాల పెంపుకు నిబద్ధతతో పని చేస్తున్నాం'' అని చెప్పారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతను ఇతోధికంగా పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ లక్ష్యంతోనే తాజాగా జన్ విశ్వాస్ బిల్లును తీసుకొచ్చినట్టు చెప్పారు. ముున్ముందు న్యాయవ్యవస్థపై అనవసర భారాన్ని అది తగ్గిస్తుందని వివరించారు. అలాగే వివాదాలకు ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపేందుకు ఉద్దేశించిన మధ్యవర్తిత్వ చట్టం కూడా కోర్టు పని భారాన్ని బాగా తగ్గించగలదని ఆశాభావం వెలిబుచ్చారు.

వాయిదా సంస్కృతికి తెర పడాలి: సీజేఐ

కోర్టుల్లో పేరుకుపోతున్న కేసులు, కాలం చెల్లిన విధానాలు, కేసుల వాయిదా సంస్కృతి వంటి సమస్యలు న్యాయ వ్యవస్థను బాగా ప్రభావితం చేస్తున్నాయని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆవేదన వెలిబుచ్చారు. వీటిని నిర్మాణాత్మక రీతిలో పరిష్కరించడం తక్షణావసరమని అభిప్రాయపడ్డారు. అందుకే వీటిపై అర్థవంతమైన చర్చ జరగాల్సి ఉందన్నారు. సమర్థంగా సకాలం న్యాయం అందించాలంటే కోర్టుల్లో వాయిదా సంస్కృతి నుంచి వృత్తిపరమైన సంస్కృతికి మారాలని ఉద్బోధించారు. కేసుల పరిష్కారంలో అంతులేని జాప్యానికి కారణమవుతున్న సుదీర్ఘ వాదనలకు చెక్ పెట్టాల్సి ఉందన్నారు. ''న్యాయ వృత్తి ఒకప్పుడు ఉన్నత వర్గాల పురుషులకే పరిమితమైందిగా ఉండేది. కానీ పరిస్థితులు మారుతున్నాయి. జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం 36 శాతానికి పెరగడం స్వాగతించదగ్గ పరిణామం. అలాగే తాజాగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో ఎంపికైన వారిలో 50 శాతానికి పైగా మహిళలే కావడం హర్షణీయం. న్యాయ వృత్తిలోకి కొత్తవారిని ప్రోత్సహించడంలో లింగ భేదం, నేపథ్యాలతో నిమిత్తం లేకుండా సమానావకాశాలు కల్పించాలి. అలాగే జడ్జిల్లోనూ, లాయర్లలోనూ ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ ప్రాతినిధ్యం ఎంతగానో పెరగాల్సి ఉంది'' అన్నారు. ''కోర్టులకు సుదీర్ఘ సెలవులపైనా చర్చ జరగాల్సి ఉంది. ఇందుకోసం న్యాయవాదులు, న్యాయమూర్తులకు 'ఫ్లెక్సీ టైం' వంటి ప్రత్యామ్నాయాల సాధ్యాసాధ్యాలనూ ఆలోచించాలి. కోర్టుల లోపల, వెలుపల రాజ్యాంగ నిర్దేశిత నిబద్ధతతో నడుచుకుంటున్నామా, లేదా అని అందరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలి. సర్వోన్నత న్యాయస్థాన వజ్రోత్సవ వేడుకలు ఇందుకు సరైన సందర్భం'' అని సీజేఐ పిలుపునిచ్చారు. ఈ–కోర్టుల పురోగతిని వివరించారు. దేశ న్యాయ వ్యవస్థను సమర్థంగా, పర్యావరణహితంగా సాంకేతికతతో కూడిందిగా మార్చడానికి కృషి చేస్తున్నట్టు వివరించారు.

ప్రజల కోర్టు: సీజేఐ

సుప్రీంకోర్టు వజ్రోత్సవాల సందర్భంగా ఆదివారం లాంఛనంగా ఏర్పాటైన ధర్మాసనానికి సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యం వహించారు. 75 ఏళ్ల క్రితం 1950 జనవరి 28న భారత సుప్రీంకోర్టు తొలి విచారణ జరిగిన తీరు, అప్పుడు పాటించిన స్వతంత్ర విలువలు నేటికీ అనుసరణీయమేనన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులకు విధి నిర్వహణలో పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి గీటురాళ్లని అభిప్రాయపడ్డారు. వారు సామాజిక, రాజకీయ ఒత్తిళ్లకు మానవ సహజమైన మొగ్గుదలలకు అతీతంగా తీర్పులు వెలువరించాలని పేర్కొన్నారు. ఈ దిశగా జడ్జిల సామర్థ్యాలను మరింతగా పెంచే ప్రయత్నాలు ఇప్పటికే జరుగుతున్నాయని గుర్తు చేశారు. ''సుప్రీంకోర్టు తొలి విచారణ పార్లమెంటులోని ప్రిన్సెస్ చాంబర్లో సాదాసీదాగా జరిగింది. నాటినుంచి సుదీర్ఘ ప్రస్థానంలో కోర్టు పనితీరు నానాటికీ మెరుగవుతూనే వస్తోంది. ప్రజల కోర్టుగా రూపుదిద్దుకుంటోంది. ప్రజల నుంచి ఏటా ఏకంగా లక్షకు పైగా అందుతున్న లెటర్ పిటిషన్లు అత్యున్నత న్యాయస్థానంపై వారి విశ్వాసానికి అద్దం పడుతున్నాయి'' అన్నారు.



ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

అభ్యర్థులు దొరక్కుంటే అన్ రిజర్వ్‌డే

యూజీసీ ప్రతిపాదన ..తిరస్కరించిన కేంద్రం

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు రిజర్వు చేసిన పోస్టుల్లో సంబంధిత కేటగిరీల అభ్యర్థులు దొరకని సందర్భాల్లో ఆయా పోస్టులను అన్ రిజర్వ్‌డుగా ప్రకటించాలంటూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) తాజా ప్రతిపాదిత మార్గదర్శకాలల్లో పేర్కొంది. ఈ మేరకు రూపొందించిన మార్గదర్శకాలను అభిప్రాయ సేకరణ కోసం ఆన్‌లైన్‌లో ఉంచింది. అయితే, యూజీసీ ప్రతిపాదించిన మేరకు ఉన్నత విద్యాసంస్థల్లోని రిజర్వ్‌డు పోస్టులు వేటినీ కూడా డీ రిజర్వ్‌డుగా మార్చడం లేదని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ స్పందిస్తూ 'ఉన్నత విద్యా సంస్థల్లోని రిజర్వ్‌డు పోస్టులను అన్ రిజర్వ్‌డుగా ప్రకటించడమనే విధానం గతంలో లేదు, ఇకపై అమలు కాబోదు. రిజర్వ్‌డు కేటగిరీలోని అన్ని బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ అయ్యేలా చూసుకోవాల్సిన బాధ్యత ఉన్నత విద్యాసంస్థలదే'అని స్పష్టం చేశారు.

హరియాణా అసెంబ్లీకి ఒంటరిగానే ఆప్

చండీగఢ్: హరియాణలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లో ఆప్ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఇండియా కూటమిలో భాగస్వామిగానే ఉంటామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్–మేలో, హరియాణా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్‌లో జరిగే అవకాశాలున్నాయి. హరియాణాలోని జింద్‌లో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో కేజ్రీవాల్ పై నిర్ణయం ప్రకటించారు. 'హరియాణ ప్రజలిప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీని మాత్రమే నమ్ముతున్నారు. పంజాబ్, ఢిల్లీల్లో ఆప్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో అక్కడి ప్రజలు సంతోషంగా ఉన్నారు. అందుకే, ఈ రాష్ట్ర ప్రజలు కూడా మార్పును కోరుతున్నారు. ఆప్‌కే అధికారమివ్వాలని భావిస్తున్నారు'అని కేజ్రీవాల్ చెప్పారు. రాష్ట్రాన్ని పాలించిన పార్టీల పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఆయా పార్టీల నేతలు తమ జేబులనే నింపుకున్నారని ఆరోపించారు.

మూడు ఉపగ్రహాలను ప్రయోగించిన ఇరాన్

జెరూసలేం: గాజాలో హమాస్, ఇజ్రాయెల్ ఆర్మీకి మధ్య కొనసాగుతున్న భీకరపోరు కారణంగా మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ మూడు ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపినట్లు ఇరాన్ ప్రకటించింది. సిమోర్గ్ రాకెట్‌తో వాటిని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు తెలిపింది. సెమ్నాన్ ప్రావిన్స్‌లోని ఇమామ్ ఖొమైనీ అంతరిక్ష కేంద్రంలో రాత్రివేళ ఈ ప్రయోగం జరిగినట్లు తెలుస్తోంది. ఇందులో మహ్దా అనేది పరిశోధక ఉపగ్రహం కాగా, కేహన్–2, హతెఫ్–1 అనేవి జీపీఎస్, కమ్యూనికేషన్‌కు సంబంధించిన నానో శాటిలైట్లని ప్రభుత్వ టీవీ తెలిపింది. గాజాపై యుద్ధంలో సైనికపరంగా జోక్యం చేసుకోనప్పటికీ, ఇటీవల జరిగిన ఇస్లామిక్ స్టేట్ భారీ ఆత్మాహుతి దాడి, ఇరాన్ అండదండలున్న హౌతీ తిరుగుబాటుదారులు విదేశీ నౌకలపై దాడులు చేయడం వంటివి ఇరాన్ మతపెద్దలపై ఒత్తిడి పెంచింది. ఈ నేపథ్యంలోనే ఉపగ్రహ ప్రయోగాలు చేపట్టినట్లుగా భావిస్తున్నారు.

ఫిరాయింపుల చట్టంపై సమీక్ష కమిటీ: ఓం బిర్లా

ముంబై: ఫిరాయింపుల నిరోధక చట్టంపై సమీక్షకు కమిటీ వేసినట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. దీనికి మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ సారథ్యం వహిస్తారని ఆదివారం 84వ ఆలిండియా ప్రిసైడింగ్ అధికారుల సదస్సు ముగింపు సందర్భంగా ఆయన ప్రకటించారు. ఎమ్మెల్యేలు తరచూ పార్టీలు మారడాన్ని అరికట్టేందుకు ఉద్దేశించిన ఫిరాయింపుల నిరోధక చట్టం రాజ్యాంగం పదో షెడ్యూల్‌లో ఉంది. దీని ప్రకారం ఎమ్మెల్యేలు పార్టీ మారినా, పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటేసినా అనర్హత వేటు వేయవచ్చు.

మళ్లీ కూటమి మారిన నితీశ్

ఇండియా కూటమికి గుడ్‌బై, ఎన్డీఏలో చేరిక

- మహాఘట్‌బంధన్ సంకీర్ణం నుంచీ నిష్క్రమణ
- సీఎంగా రాజీనామా, సాయంత్రానికి ప్రమాణం
- బీజేపీ మద్దతుతో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు
- బిహార్లో రాజకీయ రగడకు ఎట్టకేలకు తెర

పట్నా: బిహార్ రాజకీయ రగడకు ఊహించిన విధంగానే తెర పడింది. గోడదూకుళ్లకు పెట్టింది పేరైన జేడీ(యూ) అధినేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మళ్లీ కూటమి మారారు. ఆదివారం ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పి మరోసారి బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ గూటికి చేరారు. ఉదయం సీఎం పదవికి రాజీనామా చేసి జేడీ(యూ), ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాఘట్‌బంధన్ సర్కారుకు చరమగీతం పాడారు. సాయంత్రానికల్లా బీజేపీ మద్దతుతో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. తద్వారా 72 ఏళ్ల నితీశ్ బిహార్ ముఖ్యమంత్రిగా రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి పగ్గాలు చేపట్టారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరుల సమక్షంలో రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిహార్ బీజేపీ చీఫ్ సమ్రాట్ చౌదరి, పార్టీ నేత విజయ్‌కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. నితీశ్ చర్యపై కాంగ్రెస్‌తో పాటు విపక్ష ఇండియా కూటమిలోని ఆర్జేడీ, డీఎంకే, జేఎంఎం, ఆప్ తదితర పార్టీలు మండిపడ్డాయి. బిహార్ ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారన్నాయి. భాగస్వాములను మోసగించడంలో సిద్ధహస్తుడైన ఆయన మరోసారి ఊసరవెల్లి నైజాన్ని చాటుకున్నారంటూ కాంగ్రెస్ దుయ్యబట్టింది. నితీశ్ వంటి ఆయారాం, గయారాంల నిష్క్రమణతో ఇండియా కూటమికి నష్టమేమీ లేదని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ''ఆయన ఇలా చేస్తారని నాకు ముందే తెలుసు. ఎన్డీఏలోకి వెళ్లడం ఖాయమని ఆర్జేడీ చీఫ్ లాలు, ఆయన కుమారుడు తేజస్వి కూడా నాకు చెప్పారు. కానీ ఇండియా కూటమి చెదిరిపోకుండా ఉండాలని నేను బయటికి చెప్పలేదు'' అన్నారు. ఆట ఇప్పుడే ఆరంభమైందని తేజస్వి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో జేడీ(యూ) మట్టికరవడం ఖాయమంటూ శాపనార్థాలు పెట్టారు. నితీశ్‌ది ద్రోహమంటూ సీపీఐ (ఎంఎల్) దుయ్యబట్టింది. గోడ దూకుడుకు పర్యాయపదంగా ఆయన చరిత్రలో నిలిచిపోతారంటూ ఎన్సీపీ (శరద్ పవార్) ఎద్దేవా చేసింది. ''స్నోలీగోస్టర్ (విలువల్లేని వ్యక్తి) పదం నితీశ్‌కు బాగా సరిపోతుంది. ఇదే వర్డ్ ఆఫ్ ద డే'' అంటూ కాంగ్రెస్ నేత శశిథరూర్ చమత్కరించారు. పదేపదే కూటములు మార్చడం నితీశ్‌కు పరిపాటేనని తృణమూల్ కాంగ్రెస్ పేర్కొంది. జేడీ(యూ) మాత్రం కాంగ్రెస్ స్వార్థపూరిత వైఖరి వల్లే నితీశ్ ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది. కొత్త సర్కారుకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. బిహారీల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడుతుందంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఇండియా కూటమికి చావుదెబ్బ!

తృణమూల్ కాంగ్రెస్, ఆప్ ఇచ్చిన ఇటీవలి షాక్‌లకు ఇప్పటికే మూలుగుతున్న కాంగ్రెస్ సారథ్యంలోని ఎన్డీఏ కూటమికి నితీశ్ తాజా నిష్క్రమణతో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇప్పటికే దూకుడు మీదున్న బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిని ఈ పరిణామం మరింత బలోపేతం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్లో అన్ని స్థానాల్లోనూ తృణమూల్ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించడం తెలిసిందే. పంజాబ్‌లోనూ ఆప్‌ది ఒంటరిపోరేనని రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ కూడా అదే రోజు స్పష్టం చేశారు.



ఆదివారం ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌తో సీఎం నితీశ్ కుమార్, డిప్యూటీ సీఎంలు సమ్రాట్ చౌదరి, వీకే సిన్హా



నితీశ్‌కుమార్‌తో జేపీ నడ్డా ముచ్చట్లు

అధికారమే పరమావధి

2020లో ఏర్పాటైన ప్రస్తుత బిహార్ అసెంబ్లీ పదవీకాలంలో నితీశ్ సారథ్యంలో ఇది ఏకంగా మూడో ప్రభుత్వం కావడం విశేషం! అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం బీజేపీ మద్దతుతో నితీశ్ సీఎం అయ్యారు. జేడీ(యూ)లో చీలికకు బీజేపీ కుట్ర చేస్తోందంటూ 2022లో ఆ ప్రభుత్వాన్ని కుప్పకూల్చి ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి మహాఘట్‌బంధన్ సర్కారును ఏర్పాటు చేశారు. 18 నెలలకే దాన్నీ పడదోసి తాజాగా మరోసారి ఎన్డీఏతో జట్టు కట్టి మళ్లీ సీఎంగా పీఠమెక్కారు. మొత్తమ్మీద కూటములు మారడం నితీశ్‌కు ఇది ఐదోసారి. ఆయన తొలిసారిగా 2000లో బిహార్ సీఎం పదవి చేపట్టారు. 2013లో ఎన్డీఏతో 17 ఏళ్ల బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్, సీపీఐ మద్దతుతో ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో జేడీ(యూ) ఘోర ఓటమికి బాధ్యత వహిస్తూ సీఎం పదవి నుంచి నితీశ్ కుమార్ తప్పుకున్నారు. కానీ 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్‌తోకలిసి పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. 2017లో తిరిగి ఎన్డీఏ గూటికి చేరి 2022 దాకా అందులో కొనసాగారు.

ఇక ఎటూ వెళ్లను: నితీశ్

అంతకుముందు ఆదివారం రోజంతా పట్నాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతూ వచ్చాయి. ఉదయమే జేడీ(యూ) శాసనసభా పక్షం నితీశ్ నివాసంలో భేటీ అయింది. ఏ నిర్ణయమైనా తీసుకునే హక్కును ఆయనకు కట్టబెడుతూ తీర్మానించింది. వెంటనే నితీశ్ రాజ్‌భవన్‌కు వెళ్లి సీఎం పదవికి రాజీనామా సమర్పించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. మహాఘట్‌బంధన్‌లో పరిస్థితులు సజావుగా లేకపోవడం వల్లే ప్రభుత్వాన్ని రద్దు చేస్తున్నట్టు చెప్పారు. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు నితీశ్‌కు మద్దతిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు తీర్మానించారు. ఆ వెంటనే తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా గవర్నర్‌ను నితీశ్ కోరడం, సీఎంగా ప్రమాణం చేయడం చకచకా జరిగిపోయాయి. తర్వాత నితీశ్ మరోసారి మీడియాతో మాట్లాడారు. ఎన్డీఏను వీడి ఇకపై ఎటూ వెళ్లేది లేదని చెప్పుకొచ్చారు. ఆయన తమ సహజ భాగస్వామి అని బీజేపీ చీఫ్ నడ్డా అన్నారు. జేడీ(యూ)తో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో మొత్తం 40 సీట్లనూ స్వీప్ చేస్తామని అన్నారు



మ్యూజియంలోని పెయింటింగ్‌పైకి సూప్ విసురుతున్న ఉద్యమకారిణులు

మోనాలిసా పెయింటింగ్‌పైకి సూప్ స్ప్రే

పారిస్: ప్రపంచ ప్రఖ్యాత మోనాలిసా పెయింటింగ్‌పైకి పర్యావరణ ఉద్యమకారులు సూప్‌ను స్ప్రే చేశారు. అయితే, పెయింటింగ్‌కు గ్లాస్ రక్షణ ఉండటంతో ఎటువంటి నష్ట వాటిల్లలేదు. 16వ శతాబ్దంలో ప్రఖ్యాత చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ చేతుల్లో రూపుదిద్దుకున్న మోనాలిసా చిత్రం ప్రస్తుతం సెంట్రల్ పారిస్‌లోని లౌవ్రె ప్రదర్శనశాలలో ఉంది. శుక్రవారం ఉదయం 'రిపోస్టె అలిమెంటయిర్'అనే గ్రూపునకు చెందిన ఇద్దరు మహిళా ఉద్యమకారులు గుమ్మడి సూప్‌ను మోనాలిసా పెయింటింగ్‌పైకి స్ప్రే చేశారు. అనంతరం వారు 'కళ, ఆరోగ్యకరమైన సుస్థిరమైన ఆహార హక్కుల్లో ఏది ముఖ్యమైంది? వ్యవసాయరంగం సమస్యల్లో ఉంది. రైతులు చనిపోతున్నారు. ప్రభుత్వం స్పందించాలి'అని డిమాండ్ చేశారు. మ్యూజియం సిబ్బంది వెంటనే వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. పెయింటింగ్‌ను తొలగించి, శుభ్రం చేశాక గంట తర్వాత తిరిగి ప్రదర్శనకు ఉంచారు. మన వారసత్వం మాదిరిగానే ఈ పెయింటింగ్ భవిష్యత్ తరాలకు చెందాల్సిందని ప్రభుత్వం పేర్కొంది. ఉద్యమకారుల వాదనలో అర్థం లేదని కొట్టిపారేసింది. ఇంధన ధరలు పెరిగాయని, నియంత్రణలు ఎక్కువయ్యాయంటూ శుక్రవారం రైతులు పారిస్‌ను దిగ్బంధించారు.

గతంలోనూ దెబ్బతింది

ప్రదర్శనకు ఉంచిన మోనాలిసా చిత్రంపై 1950లో ఓ సందర్శకుడు యాసిడ్ పోశాడు. దీంతో, పెయింటింగ్ దెబ్బతింది. అప్పటి నుంచి పెయింటింగ్‌కు రక్షణగా గ్లాస్‌ను ఏర్పాటు చేశారు. 2019లో పారదర్శకమైన బుల్లెట్‌ప్రూఫ్ అద్దాన్ని రక్షణగా బిగించారు. 2022లో ఓ ఉద్యమకారుడు భూ గ్రహాన్ని కాపాడాలని కోరుతూ పెయింటింగ్‌పైకి కేక్‌ను విసిరేశాడు.

అన్యాయాలపై పోరులో ముందుండాలి

- బెంగాలీలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపు
- నేడు బిహార్‌లో ప్రవేశించనున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర

సిలిగురి: దేశంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి పశ్చిమబెంగాల్, బెంగాలీలు నాయకత్వం వహించాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం సిలిగురిలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. యాత్రకు లభిస్తున్న ఆదరణకు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'స్వాతంత్ర్య పోరాట సమయంలో సైద్ధాంతిక పోరాటానికి నాయకత్వం వహించిన బెంగాల్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అన్యాయాన్ని ఎదుర్కోవడం, ఐక్యతను పెంపొందించడం, విద్వేష వ్యాప్తిని అరికట్టడం బెంగాల్, బెంగాలీల కర్తవ్యం. 'మీరు సందర్భానికి తగినట్లుగా స్పందించకుంటే ప్రజలు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరు, ఇది ఏ ఒక్క వ్యక్తికో సంబంధించింది కాదు. బెంగాల్ ఈ పోరాటానికి నాయకత్వం వహించాలి'అని రాహుల్ ఉద్ఘాటించారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్వేషాలను, హింసను పెంచుతోంది. నిరుపేదలు, యువతకు బదులుగా కొందరు కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తోంది'అని మండిపడ్డారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన టీఎంసీ లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించడం, ఆ పార్టీ చీఫ్, సీఎం మమతా బెనర్జీని సముదాయించేందుకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ప్రయత్నాలు జరుగుతున్న వేళ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై టీఎంసీ స్పందించింది. నిజమే, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ముందుండి పోరాడిన చరిత్ర బెంగాలీలకు ఉంది. సీఎం మమతా బెనర్జీ సైతం ప్రతిపక్ష కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ నాయకత్వం మాత్రం రాష్ట్రంలో కాషాయదళంతో అంటకాగుతోంది'అని టీఎంసీ నేత శంతను సేన్ ఆరోపించారు. న్యాయ్ యాత్ర సోమవారం ఉత్తర్ దినాజ్‌పూర్ జిల్లా నుంచి బిహార్‌లోకి ప్రవేశించనుంది.



సిలిగురిలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న రాహుల్

రాజ్యాంగ నిర్మాతలకు శ్రీరాముడే స్ఫూర్తి

'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం కోట్లాది మంది ప్రజలను ఏకం చేసిందని, ఆ మహత్తర సందర్భం దేశ సమష్టి బలాన్ని చాటిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ ఏడాదిలో మొదటిసారిగా ఆదివారం ప్రసారమైన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాతలకు ఆ శ్రీరాముడే ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు. అందుకే జనవరి 22వ తేదీన అయోధ్యలో జరిగిన ఉత్సవాన్ని 'దేవుడు దేశానికి, రాముడు రాజ్యానికి'వచ్చిన సందర్భంగా పేర్కొంటున్నట్లు చెప్పారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం గురించి కోట్లాది మంది ప్రజలు కూడా ఇదేవిధంగా భావించారన్నారు. 'ప్రతి ఒక్కరూ ఆ రోజు రామ భజన గీతాలు ఆలపించి ఆ రామునికే అంకితమిచ్చారు. రామ జ్యోతిని వెలిగించి దీపావళిని జరుపుకున్నారు. ప్రతి ఒక్కరి మాటల్లోనూ, ప్రతి ఒక్కరి గుండెల్లోనూ రాముడే నిండిపోయాడు'అని ప్రధాని అన్నారు.

నూతన కుబేరుడు బెర్నార్డ్ ఆర్నాల్ట్

పారిస్: ఫ్రాన్సుకు చెందిన ప్రముఖ లగ్జరీ వస్తువుల కంపెనీ ఎల్‌వీఎంహెచ్ సీఈవో బెర్నార్డ్ ఆర్నాల్ట్(74) అత్యంత సంపన్నుడిగా స్థానం సంపాదించారు. ఎలాన్ మస్క్ స్థానంలో ఆర్నాల్ట్‌ను చేరుస్తూ తాజాగా ఫోర్బ్స్ కంపెనీ రియల్ టైం బిలియనీర్ల జాబితాను ప్రకటించింది. ప్రపంచ కుబేరుడి స్థానంలో ఎలాన్ మస్క్ ఆస్తుల విలువ శుక్రవారం 204.5 బిలియన్ డాలర్లకు తగ్గిపోగా, బెర్నార్డ్ ఆర్నాల్ట్ ఆస్తుల విలువ ఏకంగా 23.6 బిలియన్ డాలర్లు పెరిగి 207.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఫోర్బ్స్ వివరించింది. ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా కంపెనీ షేర్ల విలువ గురువారం ఒక్కసారిగా 13 శాతం తగ్గడంతో ఆ మేరకు మస్క్ ఆస్తిలో 18 మిలియన్ డాలర్ల మేర కోతపడింది. అదే సమయంలో, ఎల్‌వీఎంహెచ్ షేర్ల విలువ శుక్రవారం 13 శాతం పెరుగుదల నమోదు చేసుకోగా ఆ కంపెనీ మార్కెట్ విలువ 388.8 మిలియన్ డాలర్లకు ఎగబాకిందని ఫోర్బ్స్ తెలిపింది. బెర్నార్డ్‌కు ఎల్‌వీఎంహెచ్‌తోపాటు లూయిస్ విట్టన్, ట్యాగ్ హ్యూయెర్, డామ్ ప్రిగ్నోన్, టిఫనీ అండ్ కో వంటి ప్రముఖ బ్రాండ్లు కూడా ఉన్నాయి. 500 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన ఏకైక యూరప్ కంపెనీగా గత ఏడాది ఏప్రిల్‌లో ఎల్‌వీఎంహెచ్ గుర్తింపు పొందింది.

గాజాకు సాయం పునరుద్ధరించండి

ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్ పిలుపు

రఫా: గాజా స్ట్రిప్‌లోని పాలస్తీనియన్లకు అందించే మానవతా సాయాన్ని యథా ప్రకారం కొనసాగించాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనీ గుటెరస్ సంబంధిత దేశాలను కోరారు. లేని పక్షంలో 20 లక్షల మందికి పైగా శరణార్థులకు అందాల్సిన సాయం, పునరావాస కార్యక్రమాల్లో భారీగా కోత పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే తీవ్ర మానవీయ సంక్షోభం నెలకొందని అన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు మెరుపుదాడికి దిగిన విషయం తెలిసిందే. పాలస్తీనా శరణార్థులకు సాయం, పునరావాసం కోసం పనిచేస్తున్న ఐరాస సిబ్బందిలో డజను మంది ఆ దాడిలో పాల్గొన్నట్లు ఆరోపణలు రావడంతో అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఇటలీ తదితర 8 దేశాలు సాయం నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. పాలస్తీనా శరణార్థులకు అందుతున్న సాయంలో ఈ దేశాల వాటా దాదాపు 60 శాతం వరకు ఉంటుంది. సాయం ఆగిపోతే పాలస్తీనా శరణార్థులకు అవసరమైన కనీస ఆహార నిల్వలు సైతం మరికొద్ది రోజుల్లోనే అడుగంటే ప్రమాదముందని భావిస్తున్నారు. హమాస్‌కు తోడ్పాటు అందించినట్లుగా భావిస్తున్న 12 మంది ఉద్యోగుల్లో ఇప్పటి వరకు 9 మందిని బాధ్యతల నుంచి తొలగించారు. ఒకరు చనిపోగా మరో ఇద్దరిని గుర్తించే పనిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



రాజన్నకు సమ్మక్క రద్దీ

రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

8లో ▸



గోదావరిలో పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురి వద్ద గల గోదావరిలో ఆదివారం వేలాదిమంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. సెలవుదినం కావడంతో అధికసంఖ్యలో తరలివచ్చారు.

గరిష్ఠం/కనిష్ఠం

30.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేకుర్తి కంటి ఆస్పత్రికి ఉత్తమసేవా పురస్కారం



అవార్డు స్వీకరిస్తున్న వేణుమూర్తి

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ నేత్ర వైద్యశాలకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. 25 ఏళ్లుగా నేత్ర విభాగంలో చేస్తున్న సేవలకు గాను ద గివ్ కాంక్లేవ్ అనే సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. ఆదివారం ముంబైలో కాంక్లేవ్ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షురాలు డా.పట్టి ల్ చేతుల మీదుగా ఆసుపత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండ వేణుమూర్తి అవార్డు స్వీకరించారు. ఆస్పత్రి కార్యదర్శి ప్రకాషహొల్లా, కోశాధికారి బొమ్మ పవన్‌కుమార్ పాల్గొన్నారు. చిదుర సురేశ్, ఇంజినీర్ కోల అన్నారెడ్డి, టి.మురళీధర్‌రావు అభినందించారు.

గణితంపై భయం వీడాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్: గణితంపై భయాన్ని వీడితే మంచి ప్రతిభ చూపొచ్చని డీఈవో జనార్దన్‌రావు సూచించారు. ఆదివారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు గణిత ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల గణిత అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంగల శ్రీనివాస్ 'తరగతుల గణిత అధ్యాయాలు– వాని తాత్విక నేపథ్యం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన 62మందిని ఘనంగా సత్కరించారు. జిల్లా అకడమిక్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, గణిత ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోట లక్ష్మారెడ్డి, నలమాచు హరిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాద్వాయి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నలమాచు సుదర్శనం, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎం.స్వదేశ్‌కుమార్, జిల్లాసైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ సమన్వయకర్త నాగేశ్వర్‌రావు తమ సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతిభాపాటవ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గణిత ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగ మనోహర్‌రెడ్డి, చక్రధర్, ప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా కోరం సంజీవరెడ్డి



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గం

కరీంనగర్: తీగలగుట్టపల్లి రోడ్డులో ఉన్న రంగనేని గార్డెన్స్‌లో ఆదివారం ట్రస్మా జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. 2024–26 ఏడాదికి నూతన జిల్లా కమిటీ, కరీంనగర్ నగర కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కోరం సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భగవతి రమణారావు, కోశాధికారిగా రంగు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముసిపట్ల తిరుపతిరెడ్డి, నగర అధ్యక్షుడిగా రావుల నరేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా బండ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షుడిగా ఇంద్రపాల నటరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ ఈ.ప్రసాదరావు, సొగాని కొమురయ్య వ్యవహరించారు. ట్రస్మా రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామని పేర్కొన్నారు.

కుక్కలు.. కోతులు.. పందులు



'నగరంలోని ఓ కార్పొరేటర్ ఒకరోజు తన డివిజన్‌లో ఇటీవల పర్యటించాడు. ఆయా వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నాడు. సమస్యలున్నాయని చెబితే అక్కడికి వెళ్లి స్వయంగా పరిశీలిస్తున్నాడు. ఇదే సమయంలో అక్కడే తిరుగుతున్న ఓ కుక్క అకస్మాత్తుగా కార్పొరేటర్ చేతిని కరిచింది. ఇప్పుడాయన ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నాడు.'



'నగరంలోని ఓ మూడంతస్తుల నివాస భవనం. ఆ ఇంట్లో ఒక్కో అంతస్తులో ఇద్దరేసి అన్నదమ్ములు నివాసం ఉంటారు. పై అంతస్తులో ఉన్న అన్న కిందికి రావాలంటే.. కింద ఉన్న తమ్ముడు ప్రతీరోజు టపాసులు కాలుస్తుంటాడు. ఇదేమి సంబరాలు అనుకుంటున్నారా. అవేమీ సంబరాలు కావు. మెట్లపై ఉన్న కోతులను తరిమివేసేందుకు అన్నదమ్ములు పేలుస్తున్న బాణాసంచా బాధ.'



'సిటీలోని శివారుకాలనీల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మురికి కాలువల్లో జలకాలాడుతున్నాయి. మురుగు అంతా రోడ్ల పైకి తీసుకొస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడుతున్నాయి. అంతేకాదు చెత్త డంపింగ్ ఏరియాల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. పందుల కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా స్థానికులు రోగాలతో సతమతమవుతున్నారు.'

- నగరవాసుల బెంబేలు
- ఎక్కడి పనులు అక్కడే
- అక్రమాల పుట్ట.. పట్టణ ప్రణాళిక
- నేడు బల్దియా సర్వసభ్య సమావేశం

కరీంనగర్ కార్పొరేషన్:

ఇవి నగరపాలకసంస్థ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న కుక్కలు, కోతులు, పందుల బెడదకు సజీవ తార్కాణాలు. నగరంలోని 60 డివిజన్లలోనూ దాదాపు ఇదే పరిస్థితి. కోతుల బెడద కొన్ని డివిజన్లలో తీవ్రంగా ఉండగా, కుక్కలు మాత్రం ప్రతీ డివిజన్‌లో పదుల సంఖ్యలో ఉండి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో కుక్కల దాడిలో చిన్నారులు మృత్యువాత పడ్డ సంఘటనలు కనిపిస్తున్నా.. నగరపాలకసంస్థ పరిధిలో మాత్రం కట్టడి చర్యలు కనిపించడం లేదు. కాలనీల్లో కుక్కల భయానికి చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్లమీదికి రాలేని పరిస్థితి నెలకొంది. పైగా కొన్ని ప్రాంతాల్లో వాహనాలు వెళితే చాలు కుక్కలు వాటివెంట పడుతున్నాయి. కుక్కల నుంచి తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురైన ఉదంతాలు చోటుచేసుకొన్నాయి. కోతులు కూడా గుంపులుగా ఇండ్లల్లోకి వస్తూ, వస్తువులు చిందరవందర చేస్తున్నాయి. గతంలో కోతులు, కుక్కలను పట్టి తరలించిన అధికారులు, కొంత కాలంగా పట్టించుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటికైనా అధికారులు పరిస్థితి తీవ్రతను పరిగణలోకి తీసుకొని కుక్కలు, కోతులను తరలించాలని నగరవాసులు కోరుతున్నారు.



కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయం

ఎక్కడిపనులు అక్కడే

కారణాలేవైనా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో మెజార్టీ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయి. ప్రధానంగా సీఎంఏ నిధులతో చేపట్టిన పనులకు ఆటంకాలు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.103కోట్లతో నగరంలో పనులు చేపట్టారు. ముఖ్యంగా స్మార్ట్‌సిటీలో వర్తించని అంతర్గత రోడ్లను ఈ నిధులతో చేపట్టారు. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ పనులు అకస్మాత్తుగా మందగించాయి. కొన్నిచోట్ల పనులు సగంలోనే నిలిపివేశారు. సీఎంఏతో పాటు ఇతర నిధులతో చేపట్టిన పనులను కూడా అక్కడక్కడా కాంట్రాక్టర్‌లు మధ్యలోనే ఆపివేస్తున్నారు. దీనిపై ఆయా కాలనీవాసులు ఆందోళనలు కూడా చేస్తున్నారు.

అక్రమాల పుట్ట.. పట్టణ ప్రణాళిక

నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక అక్రమాల పుట్టగా మారింది. పట్టణ ప్రణాళిక విభాగంలో దీర్ఘకాలికంగా తిష్ట వేసిన ఒకరిద్దరు అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణాలు జరిగినా, నిబంధనలు ఉల్లంఘించినా.. తమను 'కలిస్తే' చాలు వారికి అండగా ఉండడం ఆ అధికారుల నైజం. తమను కలవలేదా...నిబంధనలకు అనుగుణంగా ఉన్నా భవన నిర్మాణాలకు అనుమతులు రావు. కంచె చేను మేసిన చందంగా...అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన సదరు అధికారులు ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. రేకుర్తిలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ భూముల్లో అక్రమ నిర్మాణాల వెనుక పట్టణ ప్రణాళిక అధికారులు ఉన్నారని ఇటీవల హైదరాబాద్ ప్రజాదర్బార్‌లో మనోహర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడం తెలిసిందే. వావిలాలపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా తమ ఇంటివైపు కిటికీను ఏర్పాటు చేశారంటూ ఇటీవల కామినేని సరిత అనే గృహిణి ఫిర్యాదు చేయగా, ఆ కిటికీని తొలగించారు. నెల రోజుల తరువాత అదే కిటికీని సదరు ఇంటి యజమానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు అందచేయగా, ఆయన తాజాగా కిటికీని ఏర్పాటు చేసుకున్నాడు.

నేడు సమావేశం

నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశం సోమవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరగనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షత వహించనున్నారు. ఎజెండా కాపీలను గతంలోనే సభ్యులకు అందచేశారు.

మీడియాకు ఎంట్రీ ఉందా?

నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశంలో మీడియాకు ప్రవేశం ఉందా అనేది చర్చనీయాంశంగా మారింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కౌన్సిల్ సమావేశాలకు మీడియాకు అనుమతి లేదంటూ అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలిచ్చారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రభుత్వం మారిన తరువాత తొలి సమావేశం జరుగుతుండడంతో సమావేశాలకు మీడియాను అనుమతిస్తారా లేదా అనేది వేచి చూడాలి.

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి

- హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధ



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జిలు పి.శ్రీసుధ, ఇవి. వేణుగోపాల్

కరీంనగర్‌క్రైం: కోర్టుల్లో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ పి.శ్రీసుధ సూచించారు. కరీంనగర్ జిల్లా కోర్టు భవన సమదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్(జువైనల్) కోర్టును ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ పి శ్రీ సుధ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి.వేణుగోపాల్ ప్రారంభించారు. భవిష్యత్తులో బాలనేరస్తుల కేసులు లేనిజిల్లాగా కరీంనగర్ ఏర్పడాలని ఆశిస్తున్నానని తెలిపారు. దానికోసం న్యాయవాదులు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవీ.వేణుగోపాల్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా తన జన్మస్థలమని, కేసుల్లో కాక్షిదారులకు సత్వర న్యాయం జరిగి భవిష్యత్తులో దేశంలోనేలోనే కరీంనగర్ మొదటిస్థానంలో నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా కోర్టు డెవలప్‌మెంట్ విషయంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, మెజిస్ట్రేట్లు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కారుణ్య నియామక పత్రం అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- 31న సంస్థ కార్మికులకు శుభవార్త తెలియజేస్తాం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యానగర్/మానకొండూర్: ఆర్టీసీ అభివృద్ధిలో ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్టీసీ కరీంనగర్ డిపో–2లో నిర్వహించిన కరీంనగర్, ఖమ్మం రీజియన్‌కు చెందిన ఉద్యోగుల కారుణ్య నియామక పత్రాల ప్రదానోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 45 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈనెల 31న ఆర్టీసీ కార్మికులకు శుభవార్త చెప్తామన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ పూర్వవైభవం వచ్చిందన్నారు. వెయ్యి కొత్తబస్సులు కొనుగోలు చేశామని, 3వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.రఘునందన్ రావు, ఈడీ అడ్మిన్ ఎస్.కృష్ణకాంత్, కరీంనగర్ ఆర్ఎం ఎస్.సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ విలాస్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, సెక్యూరిటీ ఆఫీసర్ బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల వృద్ధే దేశాభివృద్ధి

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం చిగురుమామిడి మండలం రేకొండ, సీతారాంపూర్, చిన్నముల్కనూర్, గునుకులపల్లె, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వచ్చే వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఏ ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. రేకొండలో హాలిక్ శ్రమజీవి కో–ఆపరేటివ్ సొసైటీ 51వ స్వర్ణోత్సవాలకు హాజరయ్యారు. సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డితో కలిసి రూ.4.60 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గోదాంను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి పవన్‌కుమార్, ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్, పీఆర్ డీఈఈ రవిప్రసాద్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నర్సయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ నర్సరీలపై నిఘా

- ఎదుగుదల లేని మొక్కలు, కల్తీ నారు అమ్మితే జైలుకే
- విక్రేతలకు ఉద్యానశాఖలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్
- 4 లక్షల మొక్కలకు రూ.500, ఆ పైవాటికి రూ.వెయ్యి

కరీంనగర్ అర్బన్: ఎదుగుదల లేని మొక్కలు విక్రయించినా, కల్తీ నారు అంటగట్టినా ఇకపై కటకటాలు లెక్కించాల్సిందే. పూలు, పండ్ల మొక్కలు, బంతి, మిర్చి నారు విక్రయాలు జోరందుకున్నాయి. జిల్లాలో ఒకప్పుడు అంకెల్లో ఉన్న నర్సరీలు నేడు వందలకు చేరాయి. హైబ్రిడ్ మొక్కలని అంటగట్టడం, అంతలోనే ఉడాయించడం నర్సరీ నిర్వాహకుల తంతు. దీంతో నిజాయితీగా వ్యవహరించేవారిపై నమ్మకం సన్నగిల్లుతోంది. అయితే ఇకపై గత ఘటనలకు తావు లేకుండా ప్రైవేటు నర్సరీలను కూడా చట్ట పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కోరలు లేని గత చట్టానికి సవరణలు చేసి ఉద్యానశాఖకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. నర్సరీల రిజిస్ట్రేషన్ సదరుశాఖ కనుసన్నల్లో సాగనుంది. ఇకపై జిల్లాలో ఉన్న నర్సరీలన్నీ ఉద్యానశాఖ పరిధిలో చేరాల్సిందే. రైతులు, ప్రకృతి ప్రేమికులకు నాణ్యమైన మొ క్కలు, నారు విక్రయాలతో పాటు నర్సరీలు బాధ్యతగా వ్యవహరించనున్నాయి. నష్టపరిహారం ఇచ్చే నిబంధన ఉండటంతో పారదర్శకంగా ఉండనున్నారు.

పక్కాగా రిజిస్ట్రేషన్.. లేకుంటే కఠినచర్యలు

రైతులను మోసగించే నర్సరీదారులను ఏకంగా జైలుకు పంపించే నూతన నియమావళిని జారీ చేసింది ప్రభుత్వం. గతంలో ఖమ్మం జిల్లాలో నాసిరకం మిర్చి విత్తనాలు సరఫరా చేసిన వారిపై పీడీ యాక్టు నమోదు చేసిన ప్రభుత్వం రైతు రక్షణకు ఈ చట్టాన్ని రూపొందించింది. ఏటా నకిలీ మకిలీ ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతోంది. ఈ క్రమంలో నర్సరీదారుల నూతన లైసెన్సు పొందే అంశం నుంచి నారు ఏ దశలో విక్రయించాలి, అక్రమాలు జరిగితే విధించే శిక్షలు తదితర విషయాలన్నీ అందులో వివరంగా పేర్కొంటూ జీవోను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్



నగర శివారులో కొనసాగుతున్న ప్రైవేటు నర్సరీ

(నియంత్రణ) నియమావళి–2012కు పలు సవరణలు చేస్తూ తెలంగాణ రిజిస్ట్రేషన్ ఆఫ్ నర్సరీ రూల్స్–2017 పేరిట ఉద్యాన శాఖ దీన్ని రూపొందించింది. 4 లక్షల లోపు మొక్కలుండే నర్సరీకి రూ.500 రిజిస్ట్రేషన్ రుసుము కాగా 4లక్షలకు పైగా మొక్కలుండే నర్సరీలకు రూ.వెయ్యి రుసుంగా నిర్ణయించారు. ఏ సర్వే నంబర్ భూమిలో నర్సరీ నిర్వహిస్తున్నారు, భూసార పరీక్ష ఫలితాలున్నాయా, ఏ నేల, నేల స్వభావం, ఏ ఏ మొక్కలు వృద్ధి చేస్తున్నారు, భూమికి సంబంధించిన పాసుపుస్తకాలు ఇలా అన్ని వివరాలను అందజేయాలి. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పూలు, ఔషధ, సుగంధ ద్రవ్యాల నాణ్యమైన మొక్కల తయారీకి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. పండ్ల మొక్కల ఉత్పత్తికి రూ.5వేలు, కూరగాయలు, పూలు, ఔషధ, సుగంధ ద్రవ్యాల మొక్కల తయారీకి నాలుగు లక్షల మొక్కల తయారీకి రూ.వెయ్యి, 4లక్షలకు మించిన ఉత్పత్తికి రూ.2500 ఫీజు చెల్లించాలి. పండ్ల మొక్కల నర్సరీలను ఏడాదికోసారి, కూరగాయ నర్సరీలను 4 నెలలకోసారి అధికారులు ఆకస్మిక తనిఖీ చేస్తారు.

నిబంధనలు తప్పనిసరి

అనుమతి పొందిన నర్సరీలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. విత్తనం ఎక్కడ నుంచి సేకరించారు. బిల్లు వివరాలు, లాట్ నంబర్, బ్యాచ్ నంబర్, విత్తన పరీక్ష వివరాల పత్రాలు, విత్తనం తయారుచేసిన తేది, గడువు తేదీ, విత్తిన తేదీ, నారు మొక్కలు అమ్మిన తేదీ తదితర వివరాలు విధిగా నమోదు చేయాలి. నర్సరీ ప్రధాన ద్వారం వద్ద ఒక బోర్డు ఏర్పాటు చేసి అక్కడ లభించే నారు మొక్కల సంఖ్య, ధరల పట్టిక తెలుగులో రాసి ఉంచాలి. నాణ్యమైన నారు మొక్కల తయారీకి సరైన భూమి ఎన్నుకోవడంతో పాటు చుట్టూ ఫెన్సింగ్ వేయాలి. పిల్ల, తల్లి మొక్కల బ్లాక్‌లను వేరుగా ఉంచాలి. నీటితో పాటు కార్యాలయం, స్టోర్ వసతులు ఉండాలి. మొలకలు, నర్సరీ బెడ్ల తయారీ, షెడ్‌నెట్ హౌజ్, నెట్‌హౌజ్, పాలీటన్నెల్, ఛాంబర్ తదితరాలు సమకూర్చుకోవడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి. నారు వయస్సు, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యేక నిబంధనలు రూపొందించారు. నిబంధనలు పాటించని నర్సరీదారులపై చట్ట ప్రకారం రూ.50వేల జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష లేదా రెండూ విధించవచ్చు. నర్సరీ రిజిస్ట్రేషన్ కోసం గడువేమి లేదని, వీలైనంత త్వరగా ఉద్యాన శాఖలో సంప్రదించి నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారులు వివరించారు.

గురుకులాలకు కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి

- పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): గురుకుల విద్యాలయాలకు కామన్ సర్వీస్ రూల్స్, కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ అసోసియేషన్(పీఆర్‌జీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అపూర్వ డిగ్రీ కళాశాలలో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడిజిల్లా గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకుల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీఆర్‌జీటీఏ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించి, నూతన సొసైటీలవారీగా రాష్ట్ర, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 317సమస్యను పరిష్కరించి, బదిలీలు చేపట్టాలని కోరారు. బీసీ వెల్ఫేర్, జనరల్ సొసైటీల పాఠశాలలు, కళాశాలల పనివేళలు మార్చాలని, డిప్యూటీ వార్డెన్ విధులనుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, కేర్‌టేకర్లు, కౌన్సిలర్లను నియమించాలని, రెండో శనివారాన్ని సెలవుదినంగా ప్రకటించాలని, డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు ఉన్నతవిద్యాశాఖ విధివిధానాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌జీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అర్రూరి నరేశ్ మాట్లాడుతూ పీఆర్‌జీటీఏ గురుకులాల్లో పనిచేసే ఉపాధ్యాయ, అధ్యాపకుల చేత స్థాపించబడిందని, రాష్ట్రంలోని బలమైన ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూటీఎస్ మద్దతుతో ఏర్పడిందని అన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.తిరుపతిరెడ్డి, ఎం.జైపాల్‌రెడ్డి, పీఆర్‌జీటీఏ రాష్ట్ర సెక్రటరీ వేముల స్వప్న, జాయింట్ సెక్రటరీలు ఉప్పు అశోక్, శ్రీనివాసాచారి, నిర్మలానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కె.రామకృష్ణారెడ్డి, పి.విద్యాసాగర్, టీఎంఆర్‌ఈఐఎస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చెలకాని సంజీవరెడ్డి, ఎంజేపీటీబీసీడబ్ల్యూఈఐఎస్ రాష్ట్ర అధ్యక్షుడు టి.గట్టయ్య, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.రాజు, వైస్ ప్రెసిడెంట్ బి. వనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దిలీప్ కుమార్‌రెడ్డి

మల్లన్నకు మొక్కులు



మైలారంలో ఎంపీ బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు



మల్లన్నను దర్శించుకుంటున్న వినోద్‌కుమార్, రసమయి బాలకిషన్

మండలంలోని మైలారం మల్లికార్జునస్వామి జాతరలో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, పెద్ద పట్నాలు నిర్వహించారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఖాసీంపేట మానసాదేవి ఆలయాన్ని ఎంపీ బండి సంజయ్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు వరాల పర్శరాములు, ఏలేటి చంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, సర్పంచ్ దుడ్డు రేణుక, జెడ్పీటీసీ మాదుగుల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – గన్నేరువరం

క్లుప్తంగా

దేశభక్తి పెంపునకు ఎన్‌సీసీ దోహదం



ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్ష రాస్తున్న కెడెట్లు

కొత్తపల్లి(కరీంనగర్): యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో ఆదివారం ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక దశ నుంచే క్రమశిక్షణ, విధుల పట్ల నిబద్ధత కలిగేందుకు విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కల్నల్ డానియల్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణలో భాగంగా సర్టిఫికెట్లు అందించేందుకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసాపత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హకీం సింగ్, దుర్గ గోవింద్, పీపీ రావు, త్రివేణి, ప్రకాష్, ప్రశాంత్, రాజేశ్, పలు పాఠశాలల కేర్ టేకర్లు పాల్గొన్నారు.

బావిలో పడి మాజీ సర్పంచ్ మృతి



ఎల్లారెడ్డి (ఫైల్)

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం మాజీ సర్పంచ్ ఏనుగు ఎల్లారెడ్డి (54) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఏఎస్సై గజేంద్ర కథనం ప్రకారం.. ఎల్లారెడ్డి ఆదివారం ఉదయం 5 గంటలకు తన పొలానికి నీరు పెట్టేందుకు బావి వద్దకు వెళ్లాడు. మోటార్ పెడుతున్న క్రమంలో కాలు జారి బావిలో పడిపోయాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు మహేందర్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లి చూడగా ఎల్లారెడ్డి బావిలో శవమై కనిపించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. ఎల్లారెడ్డికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఓదార్చారు.

గుండెపోటుతో యువకుడి మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఇల్లందకుంట: లక్ష్మాజిపల్లి గ్రామంలో గుండెపోటుతో యువకుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన చెప్యాల శ్రీనివాస్‌రెడ్డి(27) హనుమకొండలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం గుండెపోటుకు గురి కాగా.. వెంటనే అతడిని జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించే లోపే మృతిచెందాడు. చేతికందివచ్చిన కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కారు, బైక్ ఢీ

- ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేటకు చెందిన భూక్య వినయ్, నల్లూరి రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో సిరిసిల్లకు తరలించారు. కారు డ్రైవర్ కారుతోపాటు పరారయ్యారు.

ఫుడ్ కోసమే కేయూలో చేరిన..

- 'కాకతీయ' లోనే ఖాకీపై మమకారం
- నక్సలైట్ల ప్రాంతంలో పనిచేయడం గర్వంగా ఉంది
- వందల జీతం వచ్చిన రోజు హ్యాపీగా ఉన్నా..
- ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ బాధ్యతను పెంచింది
- పనితనంతోనే గుర్తింపు
- 'సాక్షి'తో సిరిసిల్ల అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

సిరిసిల్లక్రైం: పోలీస్ కొలువుకు కావాలనుకుని రాలేదు. ఫుడ్ కోసమే కాకతీయ యూనివర్సిటీలో చేరిన. అక్కడ చదువుతుండగానే పోలీస్ నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాసి ఎంపికయ్యాను. పోలీస్‌గా చాలా గర్వంగా పనిచేసిన. ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో నక్సలైట్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పనిచేయడం సంతృప్తినిచ్చింది. నన్ను చంపేందుకు నక్సలైట్లు మూడుసార్లు అటాక్ చేశారు. ప్రతీసారి మాదే పైచేయి అయ్యింది. నిత్యం శాంతిస్థాపన కోసం పనిచేశాం. నక్సలైట్ల కంటే రౌడీల ఆగడాలు విపరీతంగా ఉన్నాయని తెలిసి వారిపై ఉక్కుపిడికిలి బిగించాను. విధుల్లో నేను చూపిన తెగువ.. ఇన్నాళ్ల నా పనితనమే ఈ గుర్తింపును తెచ్చింది.. అని అంటున్నారు ఇటీవల ప్రెసిడెంట్ అవార్డుకు ఎంపికైన రాజన్నసిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య. అవార్డుకు ఎంపికైన సందర్భంగా సాక్షి పలకరించింది. ఈ సందర్భంగా సాక్షితో పంచుకున్న పలు విషయాలు ఆయన మాటల్లోనే..



పెద్ద కుటుంబం కావడంతో పోషణభారంగా..

అమ్మనాన్న రాజయ్య–మల్లమ్మ. మాది గన్నేరువరం. నాన్న రైల్వేలో చిరుద్యోగి. నాకు నలుగురు అన్నలు, నలుగురు అక్కలు. నేనే చిన్నవాడిని. అన్న ఆర్మీలో పనిచేయగా, ఇద్దరు గల్ఫ్ వెళ్లి వచ్చారు. మరొకరు వ్యవసాయం చేస్తున్నారు. ఉద్యోగరీత్యా నాన్న మహారాష్ట్రలో ఉండగా అక్కడే రెండో తరగతి వరకు చదువుకున్నాను. అక్కడి నుంచి మా సొంతూరిలోని ఓ పంతులు వద్ద నన్ను చేర్పి నెలకు రూ.100 ఇచ్చేవారు. ఐదో తరగతిలో పరీక్ష రాస్తే తెలుగు ఫెయిల్ అయ్యాను. తర్వాత ప్రతీ తరగతిలో మెరిట్ రావడంతో ఏడాదికి రూ.100 స్కాలర్‌షిప్ వచ్చింది. గన్నేరువరం జెడ్పీహెచ్ఎస్‌లో 64 మంది పదోతరగతి పరీక్ష రాస్తే ఒక్కడినే పాసయ్యాను. అనంతరం కరీంనగర్ బిషప్ సాలమన్ కళాశాలలో ఇంటర్ చదివాను. వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో బీఎస్సీ ఫిషరీస్ కోర్సు చదివాను. ఈ సమయంలో నేను అద్దెకు ఉండే కాలనీలో నక్సలైట్ల కోసం పోలీసులు తరచూ తనిఖీలు చేస్తుండడంతో భయంగా ఉండేది. దీనికితోడు మాది పెద్ద కుటుంబం కావడంతో చదివించడం ఇబ్బందిగా మారింది. నాన్న పడుతున్న కష్టాలను గమనించి కాకతీయ యూనివర్సిటీలో చేరాలని ప్రవేశ పరీక్ష రాయడంతో సీటు వచ్చింది. రెండేళ్లలో పీజీ పూర్తి చేశాను. కానీ జాబ్ రాలేదు. టీచింగ్ వైపు వెళ్లాలని ఇంగ్లిష్ కోర్సులో చేరాను. ఇలా భోజనానికి ఇబ్బంది ఉండదని యూనివర్సిటీలోనే ఉంటూ చదువుకున్నాను. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగానే పరీక్ష రాసి 1991లో ఆర్ఎస్సైగా విధుల్లో చేరాను. నాకు ఆ సమయంలో రూ.1,280 జీతం వచ్చేది. అప్పుడు ఆ జీతంతోనే హ్యాపీగా ఉన్నాం.

రౌడీలపై ఉక్కుపాదం.. సామాజిక సేవతో ముందుకు..

నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పనిచేసిన అనుభవంతో రౌడీలను అణచివేసేందుకు ఉపయోగపడింది. నక్సలైట్ల కంటే రౌడీల ఆక్రమణలు, ఆరాచకాలు పెరిగినట్లు తెలిసింది. వారిని అదుపులోకి తెచ్చేందుకు మహిళా సంఘాలు లాఠీ కొనిచ్చిన సందర్భాలు ఉన్నాయి. నన్ను చంపేస్తామని గోడలపై హెచ్చరికలు రాసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. హన్మకొండలో ఓ రౌడీ అక్కడ ఉండేందుకే భయపడేలా పరిస్థితులు సృష్టించిన. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పని చేస్తున్న సమయంలోనే తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది. ఆ ప్రాంతంలో అల్లర్లు జరుగకుండా పని చేసిన. కొత్తగూడెంలో ఎస్సైగా పనిచేసిన రోజుల్లో రోడ్డు వేయడం, అక్కడ ఉన్న చిరువ్యాపారులకు పది గజాల స్థలాన్ని ఇప్పించడం వంటి సామాజిక సేవలో పాల్గొనడం సంతోషంగా ఉంది.

పైరవీలకు దూరం..

కొలువులో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ కూడా పైరవీలు చేయలేదు. నా పనితనాన్ని గుర్తించే పదోన్నతులు లభించాయి. నేను విధుల్లో చేరిన తొలి రోజుల్లో రాజకీయ నాయకులకు పోలీస్ బందోబస్తు లేదు. శాంతిస్థాపన కోసం ప్రజలతో కలిసి పనిచేసేవాళ్లం. మేము నాయకుల వద్దకు పోతే ఎక్కడ నక్సలైట్లు చంపుతారోనని వారు భయపడేవాళ్లు. ఇప్పుడు దర్పం కోసం పోలీస్ బందోబస్తు పెట్టుకుంటున్నారు.

శాంతి నెలకొల్పడమే ప్రాథమిక విధి

నేను పోస్టింగ్‌లో చేరినప్పటి నుంచి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందే వరకు ప్రజలకు అన్యాయం చేసే విధానాలు, నక్సలైట్ల చర్యలను అడ్డుకునేందుకు పనిచేసిన. నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేందుకు యువ ఆఫీసర్లు కావాలని అడిగితే 1992లో 18 మందితో ఎస్ఎస్ఎఫ్(స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్) ఏర్పాటు చేశారు. అందులో 1998 వరకు ప నిచేశాం. శ్రీకాకుళం, ఆదిలాబాద్, చిత్తూరు, విశాఖరూరల్, ఏటూరునాగారం ఏరియాల్లో గుట్టల్లో తిరుగుతూ నక్సలైట్ ఉనికిని అడ్డుకునేవారిమి. గుట్టలు, గుహల్లో తిరుగుతూ చెలిమల్లో పురుగులు ఉన్న నీటి తాగినం. ఏటూరునాగారంలో పీపుల్స్‌వార్ నక్సలైట్లు అనేకసార్లు నన్ను చంపేందుకు అటాచ్ చేసి, విఫలమయ్యారు. 1992 సివిల్ ఎస్సైగా కన్వర్షన్ కాగా వరంగల్, కొత్తగూడంలో పోస్టింగ్ వచ్చింది. కాలంలో ఫోన్ సౌకర్యం లేదు. అలాంటి పరిస్థితుల్లో జనశక్తి, ప్రజాప్రతిఘటన, పీపుల్స్‌వార్, ప్రతిఘటన వంటి విప్లవ సంఘాలు పనిచేసేవి. ఎటూ వెళ్లిన కాల్పులు జరిగేవి. మూడు సార్లు నన్ను చంపేందుకు ఆటాక్ జరిగింది. స్కూల్‌కు సెలవులు ఉన్నాయని స్టేషన్ క్వాటర్స్‌లో ఉన్న నా దగ్గరి భార్యపిల్లలు వచ్చారు. అదే రోజు నాపై నక్సలైట్లు దాడి చేశారు. నా భార్యపిల్లలు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని బతికారు. నా పిల్లలు ఇప్పుడు ఒకరు డాక్టర్, ఇంకొకరు అమెరికాలో సైంటిస్ట్‌గా స్థిరపడ్డారు. 2007 సీఐగా, 2017లో డీఎస్పీగా, 2021లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందాను. సిరిసిల్లలో 2022, జనవరిలో అడిషనల్ ఎస్పీగా విధుల్లో చేరాను.

ఆశయం కోసం పనిచేయాలి

పోలీసు అంటే విపత్కర పరిస్థితుల్లో నిస్సహాయులకు అండగా ఉండడమే. దాన్ని గుర్తుంచుకుని యు వ ఆఫీసర్లు పనిచేయాలి. ఏదో ఆశించి పనిచేస్తే అభాసుపాలవుతామనే విషయాన్ని గుర్తుంచుకో వాలి. పైరవీలతో పోస్టింగ్ వస్తే అదే స్థాయిలో వక్రమార్గంలో అధికారులు పనిచేస్తారని ప్రభుత్వం, పా లకులు గమనించాలి. పనితనాన్ని గుర్తించి పోస్టింగ్ ఇస్తే సమాజం కోసం పనిచేసే ఆఫీసర్స్ వస్తారు. వారిని ప్రభుత్వాలు, అధికారులు ప్రోత్సహించాలి.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్నేహ



స్నేహ

కరీంనగర్‌స్పోర్ట్స్: బిహార్‌లో ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన స్నేహ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. బెజ్జంకికి చెందిన స్నేహ ఈనెల 15 నుంచి 17 వరకు ఆదిలాబాద్‌లో జరిగిన జూనియర్స్ హ్యాండ్‌బాల్ స్టేట్ లెవెల్ చాంపియన్‌షిప్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి తెలంగాణ జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా స్నేహను తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్యామల పవన్‌కుమార్, డీవైఎస్‌వో రాజావీరు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ వేల్పుల సురేందర్, సిరిసిల్ల జిల్లా కన్వీనర్ కృష్ణహరి, జగిత్యాల జిల్లా కన్వీనర్ పెద్దబోయిన శ్రీనివాస్, ప్రేమ్, విద్యాసాగర్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

కొండచిలువ ప్రత్యక్షం



ప్రత్యక్షమైన కొండచిలువ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణశివారు పెద్దమ్మనగర్ (17వవార్డు) లో ఆదివారం కొండచిలువ ప్రత్యక్షమైంది. కాలనీవాసులు దానిని గుర్తించి స్థానికులకు సమాచారమందించారు. యువకులు కర్రల సాయంతో కొండచిలువను పట్టి దూరప్రాంతంలో వదిలేసి వచ్చారు.

సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో ముసలం

- చైర్‌పర్సన్‌పై వ్యతిరేక గళం
- అవిశ్వాసానికి పట్టుబడుతున్న వైనం
- కేటీఆర్ ఇలాఖాలో వ్యతిరేక పవనాలు
- క్యాంపునకు వెళ్లిన ఎనిమిది మంది కౌన్సిలర్లు
- స్థానికంగా చక్రం తిప్పుతున్న మరో ఎనిమిది మంది..
- కేటీఆర్ వచ్చిన రోజే క్యాంపు రాజకీయానికి తెర



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్‌లో ముసలం మొదలైంది. కొన్ని నెలలుగా నిగురుకప్పి ఉన్న అవిశ్వాసం చర్చకు మొదటి అడుగుపడింది. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త తీరుపై పెల్లుబుకిన వ్యతిరేక గళం అవిశ్వాసం వరకు తీసుకెళ్లింది. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జిల్లా కేంద్రానికి వచ్చిన రోజే ఎనిమిది మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇలాఖాలో అవిశ్వాస ముసలం పుట్టడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

క్యాంపు రాజకీయానికి తెర

సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, అతని అనుచరులు ఐదుగురి వ్యవహారంపై కౌన్సిలర్లలో వ్యతిరేకత నెలకొంది. కాంట్రాక్టు పనులు, బిల్లుల చెల్లింపుల విషయాల్లో చైర్‌పర్సన్ భర్తపై మెజార్టీ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. గతంలోనూ కొందరు కౌన్సిలర్లు కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. కొద్ది నెలల క్రితం పట్టణంలో అభివృద్ధి పనుల నిమిత్తం అప్పటి మంత్రి కేటీఆర్ రూ.40కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులను స్థానిక కాంట్రాక్టర్లకు రానీయకుండా హైదరాబాద్‌లోని ఏ–1 క్లాస్ కాంట్రాక్టర్‌కు మూడు ప్యాకేజీలుగా చేపట్టడానికి చైర్‌పర్సన్ భర్త అప్పజెప్పడాన్ని కౌన్సిలర్లు తప్పుబట్టారు. ఎన్నికల కోడ్‌తో సదరు కాంట్రాక్టు పనులు మొదలు పెట్టలేదు. చైర్‌పర్సన్ భర్త ఒక్కడి స్వార్థమే తమకు పర్సంటేజీలు రాకుండా అడ్డుకుందని పలువురు కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది.

మరో పది మంది కోసం క్యాంపు

చైర్‌పర్సన్ భర్త తనకు సన్నిహితంగా ఉండే ఐదారుగురు కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు రూ.40 కోట్ల పనులు మొదలు పెట్టకుండానే రద్దవడంపై చాలా రోజులుగా కౌన్సిలర్లు విభేదిస్తున్నారు. వార్డుల్లో పనులు, కమీషన్లు, ఏక చత్రాధిపత్యం తదితర అంశాలపై బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు రాష్ట్రస్థాయి నాయకుడితో మొరపెట్టుకున్నారు. దీనిపై జనవరి 25 వరకు ఓపిక పట్టాలని సూచించిన సదరు రాష్ట్రస్థాయి నాయకుడు జనవరి 26న సిరిసిల్లకు వచ్చి కౌన్సిలర్లకు సమాధానం చెప్పకుండా వెళ్లడంతో రెండు రోజుల క్రితం క్యాంపు రాజకీయానికి బీజం పడింది. ఆదివారం సిరిసిల్లకు ఎమ్మెల్యే కేటీఆర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి వస్తున్నారని తెలిసి ఎనిమిది మంది కౌన్సిలర్లు యాదాద్రి, హైదరాబాద్ ప్రాంతాలకు క్యాంపునకు వెళ్లినట్లు ప్రచారంలో ఉంది. అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇవ్వడానికి 26 మంది కౌన్సిలర్ల అవసరం ఉందని, ప్రస్తుతం క్యాంపులో ఎనిమిది మంది ఉన్నారని, మరో ఎనిమిది మంది స్థానికంగా ఉంటూ చక్రం తిప్పుతున్నారని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. మరో పదిమందిని పోగేసి అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇవ్వడానికి సన్నాహాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా బీఆర్ఎస్‌కు చెందిన ప్రముఖుడు, రాష్ట్రస్థాయి నాయకుడు కూడా పార్టీ వీడుతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఇటీవల ఎన్నికల నేపథ్యంలో కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు ఇప్పించినట్లు సమాచారం. ఈక్రమంలో సదరు నాయకుడిపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం మరో విశేషం.

అవిశ్వాసానికి అరకోటి ఆఫర్లు

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి తప్పించి తమకు కట్టబెడితే కౌన్సిల్‌కు అరకోటి రూపాయలకు తగ్గకుండా ఇస్తామని ఆశావహులు ఆఫర్లు ప్రకటిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఇన్నాళ్లు మంత్రిగా ఉన్నప్పుడు కే.తారకరామారావు కనుసన్నల్లో నడిచిన రాజకీయం ఇప్పుడు మార్పు చెందడం సిరిసిల్లలో హాట్‌టాపిక్‌గా మారింది. చైర్‌పర్సన్, పార్టీ పట్టణ అధ్యక్షుడి పదవుల మార్పును కోరుతూ పలువురు కౌన్సిలర్లు క్యాంపు రాజకీయానికి తెరలేపడం విశేషం. చైర్‌పర్సన్ పదవికి ప్రధానంగా ముగ్గురు పేర్లు చర్చకు వస్తున్నాయి. అందులో ఒకరు తమను చైర్‌పర్సన్ చేస్తే రూ.50లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. మరో కౌన్సిలర్ ఒక్కొక్కరికి రూ.లక్షతోపాటు నార్త్ ఇండియా టూర్, మరో కౌన్సిలర్ తమకు ఓటేస్తే 20 మంది కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి రూ.3లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ స్థానంలో ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీలోనే అభ్యర్థిని ఎన్నుకోవడానికి పలువురు ముఖ్య కౌన్సిలర్లు పావులు కదుపుతుండటం విశేషం. ఇదిలా ఉంచితే మరోవైపు చైర్‌పర్సన్‌పై వ్యతిరేకత ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరే సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు కాంగ్రెస్‌లో చేరేందుకు వెళ్లారా.. పార్టీకి ఝలక్ ఇచ్చేందుకు క్యాంపు రాజకీయానికి తెరలేపారా.. అనే విషయం త్వరలోనే తేలనుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

సామాజిక చైతన్యంలో కవులపాత్ర కీలకం



మాట్లాడుతున్న విజయేందర్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయ సాహితి ఆవిర్భావ దినోత్సవం, రాష్ట్రస్థాయి కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సామాజిక చైతన్యంలో కవులపాత్ర కీలకమని అన్నారు. కవులు తమ స్పందనలతో ప్రకటించే భావాలు సమాజానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఉదయసాహితి సాహితీ రంగంలో కవులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఎర్రం రాజారెడ్డి అధ్యక్షతన ఏర్పడిన కొత్త కమిటీని అభినందించారు. అతిథులుగా హాజరైన శ్రీదాస్యం లక్ష్మయ్య, దాస్యం సేనాధిపతి, నంది శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రం రాజారెడ్డి, రేళ్ళ సంజీవ్ మాట్లాడారు. కార్యక్రమంలో గుండు రమణయ్య, వెగ్గలం ఉషశ్రీ, నాగవేణి, విజయలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరానికి పరిశోధన దిక్సూచి



శ్రీనివాస్‌రెడ్డికి డైరీ అందిస్తున్న రజని, మీనాక్షి

కరీంనగర్: భవిష్యత్ తరానికి పరిశోధన దిక్సూచి వలే పనిచేస్తుందని డాక్టర్ అట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సెంటర్‌లో రిసెర్చ్ స్కాలర్ శ్రీనివాస్‌రెడ్డికి సెంటర్ ఫర్ అకడమిక్ రిసెర్చ్ డైరీ, క్యాలండర్‌ను సెంటర్ ఇన్‌చార్జి మీనాక్షి, మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రజనీ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో పరిశోధన, ఆవిష్కరణలు కీలకపాత్ర పోషిస్తాయని, చిన్నచిన్న పరిశోధనలే గొప్ప ఆవిష్కరణలకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఆవిష్కరణలకు నిలయంగా అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం పని చేస్తుందని మీనాక్షి తెలిపారు. రానున్న రోజుల్లో దేశం ఎదుర్కోనున్న సవాళ్లను అధిగమించడానికి పరిశోధన, ఆవిష్కరణ వ్యవస్థలను బ లోపేతం చేసేందుకు కృషి చేయాలని శ్రీనివాస్‌రెడ్డికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రజనీ సూచించారు. కార్యక్రమంలో బాబా సేవకులు పాల్గొన్నారు.

గాయపడిన మైనింగ్ సర్దార్ మృతి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–2ఏ గనిలో ఈనెల 22న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డి ఆదివారం మృతి చెందారు. గనిలో మొదటి షిఫ్టులో 2వ సీమ్‌లోని 9వ లెవల్ ఎండ్‌లెస్ వద్ద టబ్బుల లింక్ ఊడిపోయి వేగంగా వచ్చి సమ్మిరెడ్డిని ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది. గనిలోని ఆరవ రేస్ హాలర్ వద్ద లోడింగ్ టబ్బులు జాయింట్ ఊడిపోయి వేగంగా కిందకు వచ్చి అక్కడ ఉన్న మైనింగ్ సర్దార్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. సమ్మిరెడ్డిని వెంటనే గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించినా.. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రికి రెఫరల్ చేశారు. వారం రోజులపాటు అక్కడ చికిత్స పొందిన సమ్మిరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. మృతుడినికి భార్య, పిల్లలు ఉన్నారు.

అవిశ్వాసం అనేది అబద్ధం

- గిట్టని వాళ్ల ప్రచారం
- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి



మాట్లాడుతున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపాలిటీలో అవిశ్వాసం అనేది అబద్ధపు ప్రచారమని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇలాఖాలో అవిశ్వాసమని గిట్టని వాళ్ల ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో 32 మంది కౌన్సిలర్లు ఉండగా.. ఆదివారం జరిగిన సమావేశానికి 24 మంది హాజరయ్యారని, మిగతా వాళ్లు అనారోగ్యం, వ్యక్తిగత కారణాలతోనే రాలేకపోయారన్నారు. ఇది కేవలం కేటీఆర్ ఇమేజ్‌కు నష్టం చేయడానికి బీఆర్ఎస్ వ్యతిరేక శక్తుల ప్రయత్నాన్ని ఖండిస్తున్నామన్నారు. కౌన్సిలర్లు ఆకుల కృష్ణ, గెంట్యాల శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, పార్టీ ప్రముఖులు మ్యాన రవి, దార్ల సందీప్, ఎండీ సత్తార్, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను



సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

జమ్మికుంట: కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలీ భవనంలో పార్టీ హుజూరాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు వాసాల రామస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల గొంతుకను వినిపించాలన్నారు. అనంతరం పార్టీ గెలుపు కోసం ఎన్నికల్లో పని చేస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పరిధి ఇన్‌చార్జి దాసరి ఉష, రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, మహిళా రాష్ట్ర కన్వీనర్ శిరీష, జోనల్ కన్వీనర్ జన్ను స్వరూప, జిల్లా కన్వీనర్ మిడిదొడ్డి స్వప్న, జిల్లా ఇన్‌చార్జి మంద బాలన్న, జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజన్నకు సమ్మక్క భక్తుల జాతర





వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో వేములవాడ రాజన్న దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం రాజన్నను 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఆది, సోమవారాలు నిరంతర దర్శనాలకు అనుమతించారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న స్వామిజీ తదితరులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పంచముఖ హనుమాన్ ఆలయ 11వ వార్షిక బ్రహ్మోత్స వాల కరపత్రాన్ని ఆదివారం పీఠాధిపతి బ్రహ్మనందగిరిస్వామి ఆవిష్కరించారు. ఫిబ్ర వరి 12,13వ తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తా మని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమం లో కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్, శ్రీనివాస్, తోట రాజేందర్, పిట్ల స్వామి, దేవిశెట్టి హనుమాండ్లు తదితరులు పాల్గొన్నారు.

'అనగనగా.. మా బడిపిల్లల కథలు' ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: తెలుగు ఉపాధ్యాయుడు మాడుగుల రాములు ప్రధాన సంపాదకుడిగా చొప్పదండి జెడ్పీహెచ్ఎస్ బాలికల హైస్కూల్ విద్యార్థులచే రాయించిన 'అనగనగా.. మా బడి పిల్లల కథలు' సంకలనాన్ని ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, కటుంబ సభ్యులు, స్నేహితు లు చెప్పగా విన్న నీతి కథలను 84 మంది చిన్నారులు తమ సొంత మాటల్లో రాశారు. అతిథులుగా డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు, తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తం గిరాల చక్రవర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవులు, రచయితలు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన కుంగ్‌ఫూ, కరాటే పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఏసీపీ ప్రతాప్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని డ్రాగన్ షాట్ కుంగ్‌ఫూ అకడమీ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన 3వ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, తెలంగాణ రాష్ట్ర బేస్ బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ పోటీలకు తెలంగాణవ్యాప్తంగా 300మంది క్రీడాకారులు హాజరైనట్లు సంఘం ప్రధాన కార్యదర్శి రాజేందర్ తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



మాట్లాడుతున్న రవిశంకర్

గంగాధర: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆ ర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలం కలిసికట్టుగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. మధురానగర్‌లో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వ హించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చేనెల 3న నిర్వహిస్తున్న సన్నాహక సమావే శానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవు తారన్నారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి నయా పైసా తేలేదని అన్నారు. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.10వేల కోట్లు తీసుకొచ్చారన్నారు. వినో ద్‌కుమార్‌ని రాబోయే ఎన్నికల్లో భారీ మెజారి టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు.

ఆర్థిక సాయం

వీణవంక: శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చదువుకున్న 2006–07 పదోతరగతి విద్యా ర్థులు ఆనాటి ఉపాధ్యాయుడు, ప్రస్తుతం పా త్రికేయ వృత్తిలో పని చేస్తున్న పత్తి కొండాల్‌రె డ్డికి చేయూతనందించారు. ఇటీవల అనారో గ్యానికి గురి కాగా.. ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మ్యాకల అశోక్, నీల శ్రీనివాస్, పోతరవేన రాజ్‌కుమార్, కూన శ్రీనివాస్, పం జాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థలం రమేశ్

- వృత్తి విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్.. ప్రవృత్తి నాటక రంగం
- నటుడు.. దర్శకుడిగా రాణింపు
- వరించిన అవార్డులు, సత్కారాలు, ప్రశంసలు

కరీంనగర్‌కల్చరల్: ఆయన దర్శకత్వం వహించిన నాటకాలు మద్యపాన నిషేధం ఆవశ్యకతను తెలియజేస్తాయి.. చదువు గొప్పతాన్ని చాటి చెబుతాయి.. కార్మికుల కష్టాన్ని కళ్లకు కడతాయి.. సమాజంలోని వివిధ అంశాలను తీసుకొని దర్శకుడి గా, నటుడిగా రాణిస్తున్నారు మంచాల రమేశ్. 1970 ఆగస్టు 22న రామచంద్రం–కనకలక్ష్మి దంప తులకు వంగరలో జన్మించారు. 1980లో 'బడి పం తులు' నాటకం ద్వారా బాలనటుడిగా రంగస్థల నట ప్రస్థానం ప్రారంభించారు. కరీంనగర్‌లోని విద్యుత్‌శాఖ సర్కిల్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తూ, ప్రవృతిగా నాటకరంగాన్ని ఎం చుకొని తెలుగు రాష్ట్రాల్లో వివిధ వేదికలపై నాటిక లను ప్రదర్శిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటు న్నారు. చైతన్య కళాభారతి నాటక సమాజం కార్యద ర్శిగా కొనసాగుతూ ప్రస్తుతం కరీంనగర్‌లోని శివాజీనగర్‌లో నివసిస్తున్నారు.

ప్రదర్శించిన నాటకాలు

బడిపంతులు, సంసారంలో సరాగాలు, ప్రేమగోల, చదవరా నాటిక ద్వారా ప్రభుత్వం నిర్వహించిన అక్షర ఉజ్వల కార్యక్రమంలో జిల్లా అంతటా 250 ప్రదర్శనలు ఇచ్చారు. డీఆర్‌డీఏ తరుపున బంగారు గుడ్లు నాటికను జిల్లా వ్యాప్తంగా 32 సార్లు ప్రదర్శిం చారు. సారయ్య కాపురం ద్వారా ప్రభుత్వం నిర్వ హించిన సారా నిషేధం కార్యక్రమంలో తనవంతు పాత్ర పోషించారు. గృహనిర్మాణ సంస్థ తరుపున 'నాకు ఇల్లొచ్చింది' నాటికను 24 చోట్ల ప్రదర్శిం చారు. మనిషి, దేవతరూపం, ఈతరం మారాలి, పామరులు, నిరసన, ఆకలివేట, కాలచక్రం, విధాత, ప్రేమ పిచ్చోళ్లు, ఇతిహాసం, క్షతగాత్రుడు, ఆశాపాశం, మార్గదర్శి, ఎవరో ఒకరు నాటకాలలో నటించారు. తన సొంత ఖర్చులతో క్లిక్, లాలలీల, ప్రేమ ఈక్వల్ టూ, చెల్లనిపైసలు, దొంగలు, ఈ లెక్క ఇంతే, ఖరీదైన జైళ్లు, చీకటిపువ్వు, స్వప్నం రాల్చిన అమృతం నాటికలకు దర్శకత్వం వహించి నటించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వంద లాది ప్రదర్శనలతో ఎన్నో బహుమతులు అందుకు న్నారు. ఉత్తమ నటుడిగా, ఉత్తమ సహాయ నటుడి గా, హాస్య నటుడిగా, విలన్‌గా తన విలక్షణ నటన తో అందిరి ఆకట్టుకుంటున్నాడు.



ఖరీదైన జైళ్లు నాటికకు ఉత్తమ బహుమతి అందుకుంటున్న రమేశ్ (ఫైల్)

నటుడు, దర్శకుడిగా..

- 2002లో హైదరాబాద్‌లో రాజేంద్రప్రసాద్ దర్శ త్వం వహించిన సన్మతి నాటకంలో నటుడిగా పాల్గొన్నారు.
- 2006లో నిజామాబాద్‌లో 'ప్రేమ ఈక్వల్ టూ' నాటికకు దర్శకత్వం వహించారు.
- 2010లో నంద్యాలలో జరిగిన నాటకోత్సవాల్లో స్వీయ దర్శకత్వంలో 'చెల్లని పైసలు' నాటకానికి కరీంనగర్ జిల్లా చరిత్రలో మొదటి ఉత్తమ కాంస్య నంది అవార్డు వరించింది.
- 2015లో కర్నూలులో 'ఈ లెక్క ఇంతే', 2016లో రాజమండ్రిలో 'మా ప్రేమకు న్యాయం కావాలి', 2023లో గుంటూరులో 'చీకటి పువ్వు' నాటకానికి ఉత్తమ కాంస్య నంది అవార్డు అం దుకున్నారు.

సన్మానాలు.. సత్కారాలు

- 1996లో ఫోక్ ఆర్ట్స్ అకాడమి కరీంనగర్ వారిచే గ్రామీణ కళాజ్యోతి అవార్డు.
- 1999లో తుమ్మల రంగస్థల పురస్కారం, రస రమ్య కళారంజని, నల్గొండ వారిచే సన్మానం.
- 2011లో కళాజగతి నాటకరంగ పత్రికవారిచే సత్కారం.



చీకటిపువ్వు నాటికలోని సన్నివేశం

- 2014లో విశాఖపట్టణంలో కళాశ్రేష్ఠ బిరుదు ప్రదానం. మానవత కల్చరల్ అకాడమీ వారిచే సత్కారం.
- 2017లో వల్లం నాగేశ్వర్‌రావు రంగస్థల పుర స్కారం.
- 2023లో వైకే నాగేశ్వరరావు రంగస్థల పుర స్కారం. పాలకుర్తిలో సోమనాథ రంగస్థల పుర స్కారం అందకున్నారు.
- విద్యుత్‌శాఖ కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న పోటీల్లో ఇప్పటివరకు వరుసగా పదిసార్లు బహుమతులు వరించాయి.

గురువులకు రుణపడి ఉంటా

ఇన్నేళ్లు నా నట జీవితంలో ఎన్నో అవార్డులు, సన్మానాలు, సత్కారాలు, ప్రశంసలు, పేరు ప్రఖ్యాతలు రావడానికి కారకులు నా గురువు లు. శ్రీరాముల సత్యనారాయణ, బండారి దేవ రాజ్‌లకు ఎప్పటికీ రుణపడి ఉంటా.

– మంచాల రమేశ్, దర్శకుడు, రంగస్థల నటుడు

కల్యాణం.. కమనీయం



కరీంనగర్‌కల్చరల్: నగర శివారులోని వేదభవనంలో ఆదివారం త్రిదండి అహోబిల రామానుజ జీయరుస్వామి పర్యవేక్షణలో, వికాసతరంగిణి ఆధ్వర్యంలో గోదారంగ నాథస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనం తరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. వేదభ వనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వరప్రసాదాచార్యులు, వికాసత రంగిణి జిల్లా అధ్యక్షుడు. కె.గౌతమరావు, డాక్టర్ జగన్నాథ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

కరీంనగర్: దేశంలోని మహిళలకు రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గరల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభు త్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు రక్షణ కల్పిం చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పట్టించు కోవడం లేదని, విద్యార్థులను పట్టించుకోకుంటే ప్రభుత్వాలు కూలిపోతాయని పేర్కొన్నారు. దీనికి నిదర్శనం ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించి విద్యార్థులు సత్తా చూపించారని అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పూజ

అనంతరం నూతనంగా 15 మందితో జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా గరల్స్ కన్వీనర్‌గా తిప్పారపు శ్రీజ, కో కన్వీనర్లుగా నాగుల శ్రీజ, వైష్ణవి ఎన్నిక య్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్ ,శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షు లు తిప్పారపు రోహిత్, సుష్మిత, నందిని, లావణ్య, అరుణ, పూజిత, నవ్య, నాయకులు రాకేశ్, బోగేశ్, సన్నిత్ తదితరులు పాల్గొన్నారు.

'బిర్లా'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఇం టర్నేషనల్ స్కూల్‌లో శనివారం రాత్రి గ్రాడ్యుయే షన్ డే వేడుకలు ఆకట్టుకున్నాయి. కిండర్ గార్డెన్ పూర్తి చేసుకుని పాఠశాల విద్యలోకి అడుగుపెడు తున్న సందర్భంగా ది మాగ్నిఫిసెంట్ సెవెన్ వం డర్స్ అక్రాస్ టైం పేరుతో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం ఎస్సెస్సీ విద్యార్థు లకు వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబిత విశ్వ నాథన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పారమిత' లో వార్షిక క్రీడోత్సవాలు

కరీంనగర్: స్థానిక మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో విక్టరీ కార్నివల్ పేరు తో వార్షిక క్రీడోత్సవాలు నిర్వహించారు. ఉత్స వాలను పారమిత పాఠశాలల అధినేత డా.ఇనుగం టి ప్రసాదరావు ప్రారంభించారు. అనంతరం తల్లిదండ్రులు, అమ్మమ్మలు, నానమ్మలు, తాత య్యల మనోల్లాసానికి ప్రత్యేకంగా ఆటలు రూపొం దించి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కరాటే విన్యాసాలు, బాస్కెట్‌బాల్, పారాషూట్ ప్రదర్శనలు, వివిధ క్రీడా విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్లు ప్రసూన, రస్మిత, రాకేశ్, అనుకర్‌రావు, వినోదరావు, హను మంతరావు, వీయూఎం ప్రసాద్, ప్రధానోపాధ్యా యులు కవిత ప్రసాద్, బాలాజీ, ప్రశాంత్, సమన్వ యకర్తలు నాజిష్, కీర్తన, వ్యాయామ ఉపాధ్యాయు రాలు రజిత, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సెయింట్ జాన్స్‌లో స్పోర్ట్స్ డే వేడుకలు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని సెయింట్‌జాన్స్ పాఠ శాలలో 61వ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హైదరాబాద్ ప్రా విజనల్ సుప్రీరియర్ సీఎస్‌పి కె.మార్గరేట్, కరీంన గర్ మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో పాటు కష్టపడి చదవాలని సూచిం చారు. పర్యావరణ పరిరక్షణకు ఇంటా, బయట ప్లాస్టిక్ వాడకం మానివేయాలని పేర్కొన్నారు. పిల్ల లను ఫోన్‌కు దూరంగా ఉంచాలని, రోజూ సాయం త్రం వారికి కొంత సమయం కేటాయించాలని తల్లిదండ్రులు సూచించారు. కాగా అథ్లెటిక్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌ను అందించి అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థుల నృ త్య సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనాచారి, సెయింట్‌జాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తెహ్మి నాఖాన్, ఆర్.థామస్ పారిష్ ప్రీస్ట్, ఒంటెల సత్య నారాయణరెడ్డి, జి.జోసెఫ్, పి.ఇన్నాలు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎండుతున్న పొలాలు

- చివరి ఆయకట్టుకు అందని ఎస్సారెస్పీ నీళ్లు
- ఆందోళనలో అన్నదాతలు



'పొలంలో దీనంగా కూర్చున్న ఈ రైతు కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన అక్కెపల్లి శ్రీనివాస్.12 ఎకరాలు కౌలుకు తీసుకుని వరిపంట సాగుచేయగా ఎస్సా రెస్పీ కాలువ నీళ్లు అందక 4 ఎకరాల వరకు పూర్తిగా ఎండిపోయింది. బావిలో నీళ్లు పెట్టుకుందామంటే ఐదారుగంటలకే అడుగంటిపోతున్నాయి. మరో వారం పదిరోజుల్లో అటు ఎస్సారెస్పీ కాలువ నీళ్లందక ఇటు వ్యవసాయ బావిలో నీళ్లు లేక ఉన్న పొలమంతా ఎండిపోయే ప్రమా దముందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పరిస్థితి ఒక్క శ్రీనివాస్‌ది మాత్రమే కాదు.. కరీంనగర్ మండలంలోని ఆయకట్టు చివరి రైతులందరిది'.



ఇరుకుల్ల శివారులోని కాలువలో తక్కువగా వస్తున్న నీరు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నీటిపై ఆశతో వరిపంటను సాగుచేసిన రైతులకు నిరాశే మిగిలింది. ఆయకట్టు చివరి గ్రామాలకు నీళ్లందక పోవడంతో పొలాలన్నీ ఎండిపోతు న్నాయి. కరీంనగర్‌రూరల్ డివిజన్ పరిధిలో డి–87 నుంచి డి–94 ప్రధాన కాలువల ద్వారా మొత్తం 27వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. రైతు లందరూ ఎక్కువగా ఎస్సారెస్పీ నీటిపైనే ఆధార పడి వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు సాగు చేశారు. ఈ నెల 25 నుంచి మూడో తడి విడు దల చేసినా ఆయకట్టు చివరి గ్రామాలైన గోపాల్ పూర్, దుర్శేడ్, చేగుర్తి, మొగ్దుంపూర్, ఇరుకుల్ల, చెర్ల భూత్కూర్, సాంబయ్యపల్లి, గొల్లపల్లి గ్రామాలకు నీళ్లందక పంటలు ఎండిపోతున్నాయి. రెండేళ్ల నుం చి కాలువల్లో పూడిక తొలగించకపోవడంతోపాటు డ్రాపులు, లైనింగ్ శిథిలావస్థకు చేరి కూలిపోవడం తో నీళ్లు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నేటి నుంచి 500 క్యూసెక్కుల నీళ్లు..

ఎస్సారెస్పీ నుంచి ఇప్పటివరకు రెండు తడులకు కేవలం 300 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేశారు. ఒకట్రెండు తడులు ఆయకట్టు మొదటి రైతులకే సరిపోవడంతో కిందకు పోలేని పరిస్థితి ఏర్పడింది. అయితే చివరి ఆయకట్టుకు నీళ్లందడం లేదని రైతులు చేసిన విజ్ఞప్తి మేరకు సోమవారం నుంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేం దుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో చివరి ఆయకట్టు భూములకు నీళ్లందే అవకాశముందని పేర్కొంటున్నారు.

రెండు విడతలుగా నీటి సరఫరా

ఉమ్మడి కరీంనగర్ మండలంలోని గ్రామాలకు ఒకే సారి నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు చివ రికి నీళ్లందడంలేదు. మొదటి మూడు రోజులు డి–91 నుంచి డి–94 వరకున్న గ్రామాలకు, రెండో విడతలో నాలుగు రోజులు డి–87నుంచి డి–90 వరకు నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. సోమవారం నుంచి డి–87 కాలువకు నీటిని విడుదల చేయడం జరుగుతోంది.

– మౌనిక ఏఈ, ఎస్సారెస్పీ

టీపీటీఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: ఖమ్మంలో ఫిబ్రవరి 11,12వ తేదీల్లో జరి గే టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చే యాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జి.తిరు పతిరెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మైషా శ్రీ నివాసులు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు డి.భూపాల్‌రె డ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కా రానికి నిరంతరం కృషి చేస్తున్న ఏకైక సంఘం టీపీటీ ఎఫ్ అని పేర్కొన్నారు. టీపీటీఎఫ్ బాధ్యులు రమ ణాచారి, పర్శరాములు, పోచయ్య, శ్రీనివాస్, శశిధ ర్, రాజయ్య, సంధ్యారాణి, బాలయ్య, తిరుపతి, రాంనారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జమ్మికుంట: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసి కోల్లాసం పెంపొందుతుందని 57 ఉప కులాల హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు తూర్పటి లిం గయ్య అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో హుజూరాబాద్ డివిజన్ స్థాయి జేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ లో హుజూరాబాద్, చెల్పూర్ జట్లు పోటీ పడగా.. హుజూరాబాద్ జట్టు గెలుపొం దింది. విజేత జట్టుకు రూ.20వేలు నగదు, రన్న ర్‌కు రూ.10వేల నగదుతో అందజేశారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

గన్నేరువరం: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలని మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆది వారం గన్నేరువరంలోని పార్టీ కార్యాలయంలో విలే కర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 2నెలలు కావస్తున్నా కేవలం రెండు హామీలను మాత్రమే అమలు చేశారని, రైతు భరోసా సాయం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. గతంలో అభివృద్ధే జరగలేదన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనే ప్రారంభించారని ఎద్దేవా చేశారు. కవ్వంపల్లి బెదిరింపులకు భయపడే వ్యక్తులు బీఆర్ ఎస్ నాయకులు కాదని, తెలంగాణ ఉద్యమంలో పోరాటంలో అనేక సవాళ్లు ఎదుర్కొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని తెలిపారు. రాజన్నసిరిసిల్ల జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, జెడ్పీ టీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, సర్పంచ్, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, తీగల మోహన్‌రెడ్డి, సర్పంచ్ అటికం శారద, నాయ కులు లక్ష్మణ్, కోటేశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.



నగునూరులో సమావేశమైన పూర్వ విద్యార్థులు



బొమ్మకల్‌లో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ గంజ్ హైస్కూల్‌లో చదివిన 1983–84 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆది వారం బొమ్మకల్‌లో జరిగింది. 40 ఏళ్ల తర్వాత కలుసుకు న్న విద్యార్థులందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకు న్నారు. చదువుచెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఎంపీటీసీ వెంగల్‌దాసు శ్రీనివాస్, కరు ణాసాగర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగునూరు జెడ్పీ పాఠశాలలో 1998–99 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. డి.నరహరిరావు, ప్రభాక ర్, ఉదయ్‌భాస్కర్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందుత్వను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మోదీ సక్సెస్

- డిజిటల్, సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకున్నారు
- దేశభక్తి వేరు, జాతీయత వేరు
- పుస్తకాలు బాగా చదివితేనే ఉత్తమ రచనలు చేయవచ్చు
- హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో అజయ్ గాంధీ స్మారక ప్రసంగం చేసిన శశిథరూర్



కార్యక్రమంలో శశిథరూర్, సునీతారెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 'హిందుత్వ'ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ విజయవంతమయ్యారని పార్లమెంట్ సభ్యుడు, ప్రముఖ రచయిత శశిథరూర్ అన్నారు. సామాజిక మాధ్యమాలను, డిజిటల్ సాంకేతిక వ్యవస్థలను ఆయన సమర్థవంతంగా వినియోగించుకున్నారని చెప్పారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హైటెక్‌సిటీ సత్వ నాలెడ్జ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్, దివంగత అజయ్ గాంధీ స్మారకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎల్‌ఎఫ్ వ్యాఖ్యాత సునీతా రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. శశిథరూర్ మాట్లాడుతూ, 2018లో తాను రాసిన 'ది పారాడాక్సికల్ ప్రైమ్ మినిస్టర్'గ్రంథానికి పెద్దగా ఆదరణ లభించలేదని, కానీ ప్రధాని మోదీ పదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఆ పుస్తకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని పేర్కొన్నారు. సాంకేతిక వ్యవస్థలను వినియోగించుకోవడం ద్వారా హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో మోదీ ఆలోచనా విధానాన్ని మాత్రమే తాను ప్రస్తావిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాతీయత, దేశభక్తి భావాల పట్ల మీ అభిప్రాయం ఏమిటి? అని సునీతారెడ్డి ప్రశ్నించగా, అవి రెండూ వేర్వేరని చెప్పారు. దేశభక్తి అంటే తల్లి పట్ల బిడ్డలకు ఉండే భావోద్వేగభరితమైన ప్రేమ వంటిదని, దేశభక్తులు తమ దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించేందుకు సిద్ధంగా ఉంటారని చెప్పారు. కానీ జాతీయత రాజకీయ నిర్మాణంలో భాగమని పేర్కొన్నారు. జాతీయతావాదం కంటే దేశభక్తే గొప్పదన్నారు. దేశానికి కావలసింది దేశభక్తులని చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్యసంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రాముఖ్యతను కోల్పోయాయని ఇటీవల శ్యామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపైన ఆయన స్పందించారు. అంతర్జాతీయ సంస్థల ఏర్పాటులోనే చాలా ఆలస్యం జరిగిందని అన్నారు. ఇప్పుడు వాటిని పక్కన పెట్టడం ముఖ్యం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలను కాపాడుకోవాలని, వాటిని మరింత బలోపేతం చేసుకోవలసిన అవసరముందని చెప్పారు. ఇందుకోసం భారత్ ప్రధాన బాధ్యత తీసుకోవాలని సూచించారు.

విస్తృత అధ్యయనం వల్లనే ఉత్తమ రచనలు

అన్ని రకాల పుస్తకాలను విస్తృతంగా, లోతుగా అధ్యయనం చేసినప్పుడే ఉత్తమ రచనలు చేయడం సాధ్యమవుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా శశిథరూర్ చెప్పారు. పుస్తకాల అధ్యయనంలోనూ వైవిధ్యం ఉండాలని సూచించారు. అలాగే పదసంపదను కూడా బాగా పెంచుకోవాలని, అప్పుడు మాత్రమే స్పష్టంగా రాయలగుతారని పేర్కొన్నారు. తాను రాసిన 'ఎ వరల్డ్ ఇన్ 100 ఎస్సేస్'పుస్తకం త్వరలో వెలువడనుందని చెప్పారు. ఈ పుస్తకాన్ని చదవడం వల్ల పదజాలాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎల్‌ఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. మరో సెషన్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను కాంగ్రెస్ పార్టీలాగానే ఉంచాలని, మరే ఇతర పార్టీల మాదిరిగా మార్చరాదని పేర్కొన్నారు.

రూ. 5 లక్షలిస్తే 'విద్యానిధి' మీదే!

▶ మొదటి పేజీ తరువాయి

మోసం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

అత్యంత గోప్యంగా ఎంపిక ప్రక్రియ

పరిమిత కోటాతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు ఏటా గరిష్టంగా 2 వందల మందికి, బీసీ, ఈబీసీలకు 300 మందికి సాయం అందిస్తోంది. బీసీ, ఈబీసీ కేటగిరీలో ఈ ఏడాది ఏకంగా 3వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పోటీ తీవ్రంగా ఉండటంతో దరఖాస్తు, సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో మధ్యవర్తులు తల్లిదండ్రులను బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అడుగుతూ ఈ పథకం కింద తప్పకుండా మీకు ఆర్థిక సాయం అందేలా చూస్తామని నమ్మబలుకుతున్నారు. విద్యానిధి పథకం కింద దరఖాస్తులు, సర్టిఫికెట్ల పరిశీలన, అర్హుల ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ ఉంటుంది. సంబంధిత సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి/కార్యదర్శితో పాటు సంక్షేమ శాఖ కమిషనర్/డైరెక్టర్, అదనపు సంచాలకులు, సంయుక్త సంచాలకులు, ఉప సంచాలకులు ఇందులో ఉంటారు. ఈ ప్రక్రియ ఆద్యంతం గోప్యంగా సాగుతుంది. ఎంపికైన తర్వాత జాబితా వెలువడినప్పుడు మాత్రమే అర్హుల పేర్లు బయటకు వస్తాయి. ఈ అంశాన్ని మధ్యవర్తులు అవకాశంగా మలుచుకుంటున్నారు. కొందరు జాబితా వెలువడిన వెంటనే లబ్ధిదారులకు ఫోన్లు చేసి తమ ప్రయత్నం వల్లే ఆర్థిక సాయం అందుతోందంటూ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి వసూళ్లకు తెగబడుతున్నారు.

అధికార యంత్రాంగం నజర్

వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థి తండ్రి ఇటీవల ఫిర్యాదు చేయడంతో విద్యానిధి పథకంలో జరుగుతున్న అక్రమ వ్యవహారంపై అధికారులు దృష్టి పెట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులను పిలిపించి మధ్యవర్తుల అంశంపై ఆరా తీస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. దీనిపై ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యానిధి అర్హతలు, ఎంపిక ఇలా...

విదేశీ విద్యా నిధి పథకంలో గ్రాడ్యుయేషన్ మార్కులు కీలకం. నిర్దేశించిన దేశాల్లో ఎంఎస్ చదువుకునే విద్యార్థులు ఈ పథకం కింద ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించాలి. విద్యార్థి డిగ్రీ మార్కులకు 60 శాతం స్కోర్, జీఆర్‌ఈ/జీమ్యాట్ స్కోర్‌కు 20 శాతం, ఐఈఎల్‌టీఎస్/టోఫెల్‌కు మరో 20 శాతం మార్కులుంటాయి. దరఖాస్తులను అధికారులు వడపోసి నిబంధనల ప్రకారం అత్యధిక మార్కులున్న వారిని రిజర్వేషన్ల వారీగా ఎంపిక చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో అత్యధిక మార్కులున్న వారి జాబితాను రూపొందించి పరిమితికి లోబడి అర్హుల ఎంపిక చేపడతారు. బీసీల్లో మాత్రం సబ్ కేటగిరీలు, ఈబీసీ కేటగిరీ వారీగా వడపోత చేపట్టి ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థికి మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయ్యాక సగం, చివరి రెండు సెమిస్టర్లు పూర్తయ్యాక మిగతా సాయాన్ని ప్రభుత్వం విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. విద్యార్థి చదువుకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తేనే నిధులు విడుదలవుతాయి.

బాబు ప్రసంగానికి కుర్చీలే అతిథులు!

- నెల్లూరు, పత్తికొండలో 'రా.. కదలిరా' సభలు అట్టర్ ఫ్లాప్
- లక్ష మంది హాజరవుతారని టీడీపీ నాయకుల అంచనా
- నిండా ఏడెనిమిది వేల మంది కూడా హాజరు కాని పరిస్థితి
- సభ ఆలస్యం.. బాబు మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన ప్రజలు

నెల్లూరులో నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలోనే జనం లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



కర్నూలు(సెంట్రల్)/నెల్లూరు, సాక్షి ప్రతినిధి/నెల్లూరు సిటీ : నెల్లూరు నగరంలో, కర్నూలు జిల్లా పత్తికొండలో టీడీపీ ఆదివారం నిర్వహించిన 'రా.. కదలి రా' సభలు జనం లేక వెలవెలబోయాయి. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఖాళీ కుర్చీలను చూస్తూ ప్రసంగించాల్సి వచ్చింది. ఒక్కో సభకు లక్ష మంది చొప్పున రప్పించాలనుకున్న వారి వ్యూహం బెడిసికొట్టింది. కనీసం ఏడెనిమిది వేల మంది చొప్పున కూడా జనం హాజరు కాలేదు. వచ్చిన వారు కూడా బాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయారు. దీంతో స్థానిక నేతలపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. నెల్లూరు, పత్తికొండలో భారీ జన సమీకరణకు ఆ పార్టీ నేతలు యత్నించినా ఫలితం లేకపోయింది. చాలాచోట్ల డబ్బులిస్తామన్నా.. 'మేము రాము బాబో.. మీ సభలకు' అంటూ ప్రజలు ముఖంమీదే తేల్చి చెప్పడంతో స్థానిక టీడీపీ నేతలు చేతులెత్తేశారు. రెండు జిల్లాల్లోనూ సభలు జనం లేక వెలవెలబోవడంతో పార్టీ అధిష్టానంతోపాటు క్యాడర్ నైరాశ్యంలోకి వెళ్లిపోయింది.

డబ్బులు, మద్యం ఎర చూపినా..

నెల్లూరులో డబ్బులు, మద్యం ఎర చూపినా ప్రజలు చంద్రబాబు సభ వైపు రాలేదు. కేవలం రెండు వేల మంది మాత్రం ఎస్‌వీజీఎస్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో హడావుడి చేశారు. వారూ వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్ద నాయకులకు టెంట్, కూలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో మండుటెండలో వారు విలవిలలాడారు. ఉదయం 11.30 గంటలకు రావాల్సిన చంద్రబాబు మధ్యాహ్నం 12.45 గంటలకు ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకోవడం కార్యకర్తల సహనానికి పరీక్ష పెట్టింది. సభకు వచ్చిన కార్యకర్తలకు రూ.250, క్వార్టర్ మద్యం బాటిల్ పంపిణీ చేయడం కనిపించింది. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఆద్యంతం కుర్చీలు ఖాళీగా కనిపించడంతో స్థానిక నాయకులపై బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

తాను మాట్లాడే సమయానికి ప్రజలను నిలబెట్టలేకపోయారా అని నెల్లూరు నగర రూరల్ ఇన్‌చార్జిపై మండిపడ్డారు. పత్తికొండలోని ఆదోని రోడ్డులో జరిగిన సభకు కచ్చితంగా లక్ష మంది వస్తారని శనివారం సాయంత్రం స్థానిక నేతలు చంద్రబాబుకు సమాచారం ఇచ్చారు. తీరా ఆదివారం ప్రజలెవరూ రాకపోవడంతో సభాస్థలిలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కాగా, పత్తికొండ, నెల్లూరులో సభల్లో చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'ఆయన అభిమన్యుడు కాదు.. అర్జునుడూ కాదూ.. భస్మాసురుడు' అని విమర్శించారు.

పేదరికంపై గెలుపు

- ఏపీలో మెరుగుపడ్డ జీవన ప్రమాణాలు
- పేదల ఆదాయాలు పెరగటంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం
- పౌష్టికాహారం, గృహవసతి, తాగునీరు... అన్నింటా మెరుగుదల
- జీవన నాణ్యత పెరిగి.. పేదరికం తగ్గిందని తేల్చిన నీతి ఆయోగ్
- 2019–21లో 6.06 శాతం... 2022–23 నాటికి 4.19 శాతానికి
- రాష్ట్రంలో నాలుగేళ్ల కాలంలో 1.87 శాతం తగ్గిన పేదరికం
- ఇదే కాలంలో దేశ సగటు 14.96 శాతం నుంచి 11.28 శాతానికి తగ్గుదల
- నవరత్నాలతో వేగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన
- డీబీటీ, నాన్ డీబీటీతో ఇప్పటి వరకు రూ.4.21 లక్షల కోట్లు పేదలకు
- భారత దేశంలో, రాష్ట్రంలో పేదరికంపై నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పాపం తెలుగు దేశం పార్టీ

- గెలుపునకు కనీసం దరిదాపుల్లో కూడా బాబు లేడు
- ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులో నిర్వహించిన 'రా కదలిరా' చంద్రబాబు సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని, జనాలు లేక ఖాళీ కుర్చీలకు బాబు ప్రసంగం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ సమర శంఖారావం సభ ఈ ప్రాంతంలోనే నిర్వహించామని, అప్పుడు వేల మంది జనాలు వచ్చారని గుర్తు చేశారు. కానీ 'రా కదలిరా' అంటూ చంద్రబాబు పిలుపునిచ్చినా కుర్చీలు కూడా నిండలేదన్నారు. 4 వేల కుర్చీల కన్నా తక్కువ వేసి, కనీసం 3 వేల మందిని కూడా తీసుకురాలేని పరిస్థితిలో తెలుగుదేశం నాయకులు ఉన్నా రని పేర్కొన్నారు. చంద్రబాబుకు డబ్బాలు కొట్టే సొంత మీడియా కూడా ముందు ఉన్న వంద మందిని తప్ప సభను చూపించలేకపోయిందంటే పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఏ విధంగా గెలిచామో.. 2024 ఎన్నికల్లో కూడా అదే సీన్ రిపీట్ అవుతుందని జోస్యం చెప్పారు. జిల్లాలో టీడీపీ గెలుపునకు దరిదాపుల్లో కూడా లేదన్నారు. చంద్రబాబు ప్రసంగం మొత్తం ఊకదంపుడు తప్ప, ఆయన హయాంలో ఏం చేశారో కనీసం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

'మెస్రం' తిరుగు పయనం


- కలమడుగు వద్ద గోదావరి జలాల సేకరణ
- ముందుగా పుణ్యస్నానాలు, గంగమ్మకు పూజలు
- భోజనం అనంతరం మళ్లీ యాత్ర..


కలశాన్ని వెదురు కర్రకు కడుతున్న మెస్రం వంశ పెద్దలు

జన్నారం: ఆదివాసీ ఆరాధ్య దైవం నాగోబా జాతర కోసం గోదావరి జలాలను తీసుకువెళ్లేందుకు ఈ నెల 21న కేస్లాపూర్ నుంచి పాదయాత్రగా బయల్దేరిన మెస్రం వంశీయులు ఆదివారం ఉదయం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు వద్దకు చేరుకున్నారు. 7గంటలకు గోదావరి వద్దకు చేరుకున్న వారు పుణ్యస్నానాలు ఆచరించారు. పవిత్ర జలాలను తీసుకెళ్లేందుకు తెచ్చిన కలశాలు(మర చెంబులను) శుభ్రం చేశారు. అనంతరం అక్కడే దంపుడి బియ్యం, ఇంటింటి నుంచి తీసుకువచ్చిన బియ్యం, పప్పుతో వంట చేసుకున్నారు. భోజనం చేశారు. తర్వాత కలశాల్లో గోదావరి జలాలను తీసుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా జన్నారం రెండో ఎస్సై మృత్యుంజయ సర్కార్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు బొంతల మల్లేశ్ గోదావరికి చేరుకుని కలశాలకు పూజలు చేశారు. అనంతరం మెస్రం పెద్దలను సన్మానించారు. తర్వాత సేకరించిన నీటి కలశాలను వెదురు కర్రకు కట్టుకుని కేస్లాపూర్‌కు పాదయాత్రగా తిరిగి బయల్దేరారు. ఆదివారం రాత్రి ఉట్నూర్‌లో బస చేయనున్నట్లు ప్రధాన్ మెస్రం దాదారావు, కటోడాలు మెస్రం కోసు, కేసేరావు, పెద్దలు మనోహర్ తెలిపారు. 30న ఇంద్రవెల్లి మండలం దొడంద గ్రామానికి చేరుకుని బస చేస్తామన్నారు. 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు అక్కడే ఉండి 5న ఇంద్రవెల్లి మండలం ఇంద్రాదేవి ఆలయానికి వెళ్లి పూజలు చేయనున్నట్లు వివరించారు.


కలశం జాడిలో నీటిని నింపుతున్న మెస్రం పెద్దలు


కలశానికి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు


కలశానికి మొక్కుతున్న ఎస్సై

అవగాహన లేదు.. ప్రచారం చేయరు

- లక్ష్యం చేరని 'ఈ శ్రమ్'లో పేర్ల నమోదు
- పట్టించుకోని కార్మిక సంఘాలు
- మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం
- మూడేళ్లు గడుస్తున్నా 55శాతమే నమోదు



ఈ–శ్రమ్ యాప్

కరీంనగర్: అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక, సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు 'ఈ శ్రమ్' పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే, కార్మికులు, వలస కూలీల సమగ్ర సమాచారం సర్కారు వద్ద లేదు. ఇదికూడా అర్హులకు ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. ఇలాంటి వారికి లబ్ధి కలిగించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మూడేళ్ల క్రితం 'ఈశ్రమ్' పోర్టల్ ప్రారంభించింది. ఇందులో పేర్లు నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందుతాయి. కానీ, దీనిపై అవగాహన లేక చాలామంది తమ పేర్లు నమోదు చేసుకోవడం లేదు.

అవగాహన లేకనే..

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రానైట్, ఇటుక, సిమెంట్, రైస్‌మిల్లులు, భవన నిర్మాణ రంగాల్లో పనిచేసే వారు అధిక సంఖ్యలో ఉన్నారు.
- వీరికి అవగాహన లేక ఈ శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవడంలేదు.
- దీనిపై అధికారులు కూడా ప్రచారం చేయడం లేదు.
- దీంతో అర్హులైన వారు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు.
- కార్మిక సంఘాలు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

- ఉమ్మడి జిల్లాలో అసంఘటిత రంగం కార్మికులు 8లక్షల మందికి పైచిలుకు ఉన్నట్లు అధికారిక సమాచారం.
- అయితే, మూడేళ్లో గడుస్తున్నా ఉమ్మడి జిల్లాలో కేవలం 4,51,557 మంది కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకోవడం విస్మయం కలిగిస్తోంది.

వీరే అర్హులు..

ఆదాయపు పన్నుచెల్లించని 18–59ఏళ్ల మధ్య వయస్సు ఉన్న కార్మికులతో పాటు వ్యవసాయం, నిర్మాణ, ఇతర రంగాలు, ఆటోమొబైల్, ట్రాన్స్‌పోర్టు, వస్త్ర దుకాణాలు, హెల్త్‌కేర్, ఎలక్ట్రానిక్స్, ప్రైవేట్ కార్యాలయాలు, తోలు, గూడ్స్ తయారీ, ఆహార పరిశ్రమలు, ప్రైవేట్ సెక్యూరిటీ, హ్యాండీ క్రాఫ్ట్స్, సేవా రంగం, స్వర్ణకార వృత్తి, రిటైల్ వ్యాపారం, బీఎఫ్ఎస్ఐ, సామిల్లు, కార్పెంటర్లు, ఇతరులు, సంగీత వాయిద్యకారులు, టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్స్, గ్లాస్ సెరామిక్స్, పొగాకు పరిశ్రమ కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో పేర్ల నమోదుకు అర్హులు.

ఇలా నమోదు చేసుకోవాలి..

- ఆధార్‌తో అనుసంధామైన ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలను ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి.

ఈ శ్రమ్ ఉమ్మడి జిల్లా సమాచారం

జిల్లా	నమోదైనవారు
కరీంనగర్	1,47,934
పెద్దపల్లి	1,13,974
జగిత్యాల	1,28,977
రాజన్న సిరిసిల్ల	60,672
మొత్తం	4,51,557

- ఇందులో పేరు, ఊరు, చిరునామా, ఏ రంగంలో పనిచేస్తున్నారు, వయసు, ఫోన్ నంబరు పొందుపర్చాలి.
- దీనిద్వారా ఏఏ రంగాల్లో ఎంతమంది కార్మికులు ఉన్నారో లెక్క తేలనుంది.
- వీధి వ్యాపారుల వివరాలను విభాగాల వారీగా విభజించడం ద్వారా సంక్షేమ ఫలాలు అందే అవకాశం ఉంటుంది.

ఇవీ ప్రయోజనాలు..

- యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబర్(యూఏఎన్) ద్వారా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు వర్తింపజేస్తారు.
- ఏడాదిపాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వర్తిస్తుంది.
- అసంఘటిత రంగ కార్మికులకు అమలు చేసే పథకాలకు ఈ డేటా బేస్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు.
- వలస కార్మికులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు యత్నిస్తారు.
- ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షలు, అంగవైకల్యం చెందితే రూ.లక్ష బీమా చెల్లిస్తారు.

కుటుంబానికీ సమయం ఇవ్వాలి


సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఐజీపీ, ట్రైనీ బ్యాచ్ కానిస్టేబుళ్లు


మాట్లాడుతున్న రిటైర్డ్ ఐజీపీ ఎంకే.సింగ్

- రిటైర్డ్ ఐజీ ఎంకే.సింగ్
- జన్నారంలో 1998 బ్యాచ్ కానిస్టేబుళ్ల సిల్వర్ జూబ్లీ వేడుక
- హాజరైన మంచిర్యాల డీసీపీ, ఏసీపీలు

జన్నారం: పోలీసులు విధులకు ప్రాధాన్యం ఇస్తూనే కుటుంబాలకు కూడా సమయం కేటాయించాలని రిటైర్డ్ ఐజీ ఎంకే.సింగ్ అన్నారు. 1998 పోలీస్ కానిస్టేబుళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలను మంచిర్యాల జిల్లా జన్నారంలోని హరిత రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించారు. రిటైర్డ్ ఐజీతోపాటు మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకాన్, ఏసీపీ తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఎంకే.సింగ్ మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం కానిస్టేబుల్‌గా శిక్షణ ఇచ్చిన తనను మరవకుండా ఈ వేడుకకు ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. కానిస్టేబుల్‌గా శిక్షణ పొంది ఎస్సైలుగా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. ఉద్యోగ బాధ్యత నిర్వర్తిస్తూనే భార్య, పిల్లలు, తల్లిదండ్రులను విస్మరించొద్దని సూచించారు. అనంతరం ఎంకే.సింగ్‌తోపాటు డీసీపీ, ఏసీపీలను పలువురు సన్మానించారు.

నిర్మల్‌కు హంపి పీఠాధిపతి రాక

నిర్మల్‌టౌన్: హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి ఆదివారం నిర్మల్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక దత్తాత్రేయనగర్ కాలనీకి చెందిన శివ, స్వప్న దంపతులు తమ నివాసంలో స్వామీజీకి పాదపూజ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించాలని పలు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు.


పూజలో హంపి పీఠాధిపతి

అధికారం లేకుంటే బతకలేని స్థితిలో బీఆర్‌ఎస్


- ప్రభుత్వాన్ని కూల్చుతామని అనడం సరికాదు
- పీవీ జిల్లా ఏర్పాటు చేస్తే దేశానికే గర్వకారణం
- టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం


హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

హుజూరాబాద్: అధికారం లేకుంటే జీవించలేని స్థితి బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారని, తాము తప్పా ఎవరూ పాలన చేయొద్దంటే ప్రజలు సహించరని టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని సిటీసెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ×ప్రజాస్వామిక పాలన–ఉద్యమకారుల పాత్ర¥ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సును ఉద్దేశించి కోదండరాం మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా ప్రజాస్వామిక పాలనచేయడం ముఖ్యమన్నారు. ప్రజల అభిష్టానికి అనుగుణంగా జిల్లాల విభజనకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కమిషన్ వేయాలని నిర్ణయించిందన్నారు. మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు ఈ ప్రాంతానికి తొలిసారిగా డీజిల్ ఇంజిన్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. 80ఏళ్ల వయసులో తెలుగులో టైపు చేయడం నేర్చుకుని, తన పుస్తకాలను తానే టైపు చేసుకున్న గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. ఇలాంటి నేత పేరుతో జిల్లాను ఏర్పాటు చేస్తే రాష్ట్రానికేకాదు దేశానికే గర్వకారణం అన్నారు. ప్రజలందరి సహకారంతో వచ్చిన ఎమ్మెల్సీ పదవితో తన బాధ్యత పెరిగిందని అన్నారు. అనంతరం పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన సమితి బాధ్యులు ఆయనను సన్మానించారు. ఉద్యోగ, కార్మిక, టీచర్ల సంఘాల నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రాలు అందించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్, ముక్కెర రాజు, జేఏసీ చైర్మన్ ఆవునూరి సమ్మయ్య, సైదాపూర్ మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకటరాజం, పలకల ఈశ్వర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
సోమవారం ॥ 29-1-2024

సన్నిధి



మంచిమాట

అకృత్యం, దుష్కృత్యం అనే రెండు పదాలని సమానార్థకాలుగా ఉపయోగిస్తూ ఉంటారు సాధారణంగా. నిఘంటువు ననుసరించి రెండింటి మధ్య తేడా ఉన్నా, వ్యవహారంలో మాత్రం సమానార్థకాలే. నిజానికి రెండు చేయకూడని పనులే. కాని రెండింటికీ మధ్య అతిసన్నని గీత వంటి తేడా ఉంది.

అకృత్యం - దుష్కృత్యం

కృత్యం అంటే చేయబడినది, పని అని అర్థం. అకృత్యం అనగానే వ్యతిరేకార్థం కనుక చేయబడనిది అని అర్థం చెప్పేస్తారు వ్యవహారజ్ఞానం తక్కువైన పండితులు. వ్యాకరణ రీత్యా ఆ విధంగా పదాన్ని సాధించవచ్చు. కాని దాని అర్థం మాత్రం చేయకూడని పని అని. చేయబడనిది అనే అర్థంలో అకృత్యం అనవలసి ఉంటుంది. దుష్కృత్యం అంటే చెడ్డ పని. అకృత్యం అంటే చేయకూడని పని చేయటం వల్ల ఆ వ్యక్తికి నష్టం కలగవచ్చు, కలగక పోవచ్చు. అది ఆ వ్యక్తి స్వభావాన్ని సూచిస్తుంది. కాని, దుష్కృత్యం అంటే చెడ్డపని వల్ల వ్యక్తికి ఇతరులకి, సమాజానికి కూడా హాని కలుగుతుంది.

మానవుడు ఏ పని చేయకుండా కొద్దిసేపైనా ఉండలేడు. ఏమీ చేయటం లేదు అన్న వ్యక్తి కూడా ఆ క్షణం చేయటం లేదు అనే మాటని పలికాడు కదా! అది పనేగా! గాలి పీల్చటం, మానలేదుగా. ఆహారం తినటం, నీళ్ళు తాగటం ఆపలేదే. ఇవన్నీ ప్రయత్న పూర్వకంగా చేయటం లేదు. అసంకల్పిత చర్యలుగా సాగుతుంటాయి. కనక, నేను ఏమీ చేయటం లేదు అనటానికి వీలు లేదు. చేయటం తప్పనప్పుడు ఉపయోగ పడేది ఏదైనా చేయవచ్చు కదా! చేయాలని ఉండి, ఏం చేయాలో సరిగా తెలియక అనవసరమైన పనికిరాని పని చేయటం జరుగుతుంది. ఉద్దేశపూర్వకంగా చేయక పోయినా, సాధారణంగా చేయకూడని పని వల్ల ఏదో ఒక హాని ఉంటుంది. అందుకే దానిని చెడ్డపనితో సమానంగా భావించటం జరుగుతుంది. కాని, దుష్కృత్యం అంటే, ఉద్దేశపూర్వకంగా, కావాలని ఇతరులకి హాని కలగాలని చేసే పని.

దుష్కృత్యం వెనుక దురుద్దేశం ఉంటుంది. కావాలని బాధించటానికి చేసే పని. క్రూరత్వం కాఠిన్యం ఉంటాయి. అది ఒకరకమైన మానసిక స్థితి. నలుగురు ఆనందం గా ఉంటే చూడలేక పోవటం, ఏడుస్తూ ఉంటే ఆనందించటం, ఏదైనా వ్యవస్థ సవ్యంగా నడుస్తూ ఉంటే చూడలేక పోవటం మొదలైన దుర్బుద్ధులు ఉన్నవారు చేసేవి ఈ పనులు.

నలుగురు కలిసి ఏదో వేడుక జరుపుకుంటూ ఆనందంగా ఉన్నప్పుడు ఆ ఆనందాన్ని చూసి ఓర్వ లేక చెడగొట్టటానికి విధ్వంసకచర్యలు చేయటం దుష్కృత్యం కాదా! అదే సామర్థ్యాన్ని, తెలివితేటలని పదిమంది సంతోషానికి ఉపయోగించవచ్చు కదా! ఒక దేశం కాని జాతి గాని పురోగమిస్తున్నప్పుడు ప్రగతి నిరోధక వ్యవహారాలు, మాటలు, ప్రచారాలు దుష్కృత్యాలే. పరాయి దేశాలపై దండయాత్రలు, దోపిడీలు, దోచుకోటాలు చేయతగిన పనులా?

ఒకరకంగా చూస్తే ఇవి మానసిక జాడ్యాలు అని చెప్పవచ్చు. పైశాచిక, రాక్షసానందాలు. మందులతో తగ్గకపోతే శస్త్రచికిత్స తప్పదు. సామదాన భేద దండోపాయాల్లో ఏదో ఒక దానితో అదుపు చేయవలసి ఉంటుంది.

> వ్యక్తిగతమైన కక్షలు, అసూయా ద్వేషాలతో చేసే హానికారకమైన పనుల నుండి, జాతి, మత విద్వేషాలతో చేసే దురాగతాల వరకు ఇటువంటివి మనకు ఎన్నో కనపడుతూ ఉంటాయి. సంఘవిద్రోహకచర్యలు, హత్యలు, అత్యాచారాలు మొదలైననవి అన్నీ దుష్కృత్యాలే. ఒక్కమాటలో చెప్పాలంటే పాపకృత్యాలు అని చెప్పవచ్చు. పాపం అన్న దానికి కూడా చక్కని నిర్వచనం ఇచ్చారు పెద్దలు. "..పాపాయ పరపీడనం.." అని. ఇతరులని బాధించటమే పాపం. అందులోనూ కావాలని బాధించటం. అనుకోకుండా తాము చేసిన పని వల్ల ఇతరులకి బాధ కలిగితే అది పొరపాటు అవుతుంది కాని, దుష్కృత్యం అవదు. దానిని సరి చేసుకునే అవకాశం ఉంటుంది.

– డా. ఎన్. అనంత లక్ష్మి

వాగ్గేయకార వైభవం

పుంభావ కామాక్షి

‘‘మనసులో ధన, దార, దాయాది, పుత్ర, పౌత్రాదులతో అనుబంధాలు పెంచుకుని పొద్దై పోతున్నావ్... ఇవన్నీ నీ ఊపిరితో ముడిపడిపోయి ఉన్నాయి. ఊపిరి ఆగిపోగానే ... అప్పటివరకు నాన్నగారూ! నాన్నగారూ! అని పిలిస్తే పరవశించిపోయినవాడు... ఇప్పుడు పలకడు. అన్నయ్యా! అంటే పలకడు, తమ్ముడూ! అని పిలిస్తే పలకడు. మామయ్యగారూ! అనిపిలిస్తే ..పలకడు. ఊపిరి ఆగిపోతే అన్ని బంధాలు తెగిపోతాయి. ఇంకో శరీరంలోకి వెళ్ళి ఊపిరి తీసుకుంటే అక్కడ బంధాలు మళ్ళీ అక్కడ ప్రారంభం... నిజానికి ఏ జన్మలోనయినా ఉండే అనుబంధం -ఒక్క భగవంతుడితోటే. ... అని మంచి మాటలతో బోధచేసే వాడు గురువు. ఆయన మహానుభావుడు. కరదీపిక, దీప స్తంభం. నేను వెళ్ళవలసిన మార్గం చూపించిన మహనీయుడు... అని కీర్తించారు త్యాగరాజ స్వామి.

శ్యామశాస్త్రిగారికి కూడా గురువుగారంటే తిరుగులేని విశ్వాసం. ఆయనది మరో రకమైన విచిత్రమైన జీవితం. ఆయనను పుంభావ కామాక్షి అనేవారు. వారి వంశంలో స్వర్ణ కామాక్షిని ఎంతో కాలంగా ఆరాధన చేయగా చేయగా.. ఆమె అనుగ్రహించి పురుషరూపంలో శ్యామశాస్త్రిగారిగా పుట్టిందంటారు. ఆయన మంచి పొడగరి. అందంగా ఉండేవారు. సంగీతంతో పూజ గంటలతరబడి చేసేవారు. అది కమనీయంగా ఉండేది.





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అటువంటి శాస్త్రిగారికి ఒక అలవాటు ఉండేది. ఆయన ఎప్పుడూ తాంబూల చర్వణం చేసేవారు. నిజానికి గురువుల సమక్షంలో అది చేయకూడదు. కానీ ఆయన దానిని ఆపేవారు కాదు, ఎప్పుడూ నములుతూనే ఉండేవారు. పచ్చిమిరియం అప్పయ్యగారని తంజావూరులో మహా విద్వాంసుడు. ఆయన దగ్గర సంగీతం నేర్చుకోవడానికి వెళ్లారు. గురువుగారు కూర్చుని పాఠం చెబుతుండేవారు. శ్యామశాస్త్రిగారు తాంబూలాన్ని సేవిస్తూనే అభ్యాసం చేస్తుండేవారు. గురువుగారు కూడా ఏమనేవారు కాదు. ఒకరోజు గురువుగారితో సంభాషిస్తున్న సమయంలో శిష్యుడైన శ్యామశాస్త్రి గారి నోటినుండి తాంబూల పిడచ కొద్దిగా చటుక్కున జారి గురువుగారి ఉత్తరీయం మీద పడింది. అయ్యో... అపరాధం జరిగిందని శ్యామశాస్త్రిగారు గబగబా వెళ్లి కలశంతో నీళ్ల పట్టుకువచ్చారు అది కడగడానికి. అప్పయ్యగారు తన ఉత్తరీయం వెంటనే వెనక్కి తీసుకుంటూ...‘‘ఎప్పుడెప్పుడు నీనోటినుండి అది నా మీద పడుతుందా అని ఎదురు చూసి పాఠం చెప్పాను కామాక్షీ!’ అని అన్నారు. ‘కామాక్షీ!’ అని సంబోధించారు.

అంటే నేర్చుకోవడం కోసం వచ్చినవాడు శిష్యుని రూపంలో వచ్చినా.. నిజానికి సంగీతంలో రహస్యాలను ఆ పరదేవత.. సాక్షాత్తూ కామాక్షే... సరస్వతీ దేవే ... తనకు నేర్పడానికి వచ్చినట్లుగా భావించారు ఆయన. ‘‘విమల పటీ కమలకుటీ పుస్తక రుద్రాక్ష శస్త హస్త పుటీ/ కామాక్షీ పక్ష్మలాక్షీ కలిత విపంచి విభాసి వైరించి...’’ అని సరస్వతీ దేవిని పూజిస్తాం. తెల్లటి వస్త్రంతో వీణపట్టుకుని సరస్వతీ స్వరూపంగా ప్రకాశిస్తుంటుంది ఆ కామాక్షి... అమ్మ ఎంగిలి పిడచ పడడం అంటే ఆమె అనుగ్రహించిందని గురువుగారు పొంగిపోయారు. అసలు అప్పటి గురు శిష్య సంబంధాలు చదువుతుంటే, వింటూంటే ఆశ్చర్యమేస్తుంది. గురువులంటే ఎంత ప్రగాఢమైన నమ్మకం, శిష్యులంటే ఎంత అవ్యాజమైన ప్రీతి... అందుకే గురువుల వైభవాన్ని ప్రకటిస్తూ శంకరాచార్యుల వారు ఒక అష్టకం చేసారు.

అమృత బిందువులు

ఒకరి విజయాన్ని చూసి అసూయ చెందితే అది బలహీనతగా మారుతుంది. ప్రేరణ పొందితే అది ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.


మాటలు పదునైనవి... జాగ్రత్తగా వాడాలి. మాటలు బలమైనవి...సున్నితంగా వాడాలి. మాటలు ఖరీదైనవి... పొదుపుగా వాడాలి.

వ్యక్తి ఉన్నతమైన స్థితిలో ఉన్నాడంటే అతడెన్నో కఠిన పరీక్షల్ని ఎదుర్కొని నిలిచాడని అర్థం.

తాత్త్వికత

అందుకే ఆయన మహాత్ముడు

అవి గాంధీ మహాత్ముడు మొట్టమొదటిసారిగా ప్రజా జీవితంలో అడుగు పెట్టినప్పటి రోజులు. ఓరోజు గాంధీజీ తన మిత్రుడితో కలిసి అతని కారులో ప్రయాణం చేస్తున్నారు. గాంధీజీ అలా ప్రయాణం చేయడం నచ్చని కొందరు వ్యతిరేకులు ఆయనకు అడ్డంకులు కల్పించడానికిగాను ఓ చెట్టు చాటు నుంచి కారుపై రాళ్లు రువ్వారు. రాళ్ళు కారుమీద పడగానే గాంధీజీ మిత్రుడితో కారును ఓ పక్కగా ఆపమన్నారు. అనంతరం ఆయన నెమ్మదిగా కారులోంచి కిందకు దిగారు. చుట్టూ చూశారు. కనుచూపుమేరలో ఓ చెట్టు దగ్గర నిల్చున్న కొందరిని గాంధీజీ చూశారు. వారు తప్ప మరెవ్వరూ కనిపించలేదు. దాంతో తిన్నగా వారి దగ్గరకు వెళ్లారు. కారు మీద రాళ్ళు విసిరిన వారు వారే అయి ఉండొచ్చని అనుకున్నారు. వారిని సమీపించి ‘‘మీకు నా మీద కోపం ఉండొచ్చు. కాదనను. ఆ కోపం మీ వరకూ సబబే కూడా అయి ఉండొచ్చు. అది కూడా నేను కాదనను. అయితే, మీ కోపాన్ని చూపాలనుకుంటే రాళ్ళు నామీద విసరాలే తప్ప పాపం ఈ కారు ఏం చేసింది? అంతేకాదు, ఆ కారు కూడా నాది కాదు. నా మిత్రుడిది. ఇప్పుడు కూడా చెప్తున్నాను. మీరు మీ కోపాన్నినా మీద చూపండి. ఇదిగో మీముందే నిల్చున్నాను. మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి, నేను మీ ముందు ఒంటరిగా నిల్చున్నాను. నన్ను మీరేమైనా చేసుకోవచ్చు. అందుకు నేనేమీ అనుకోను. కారు మీద రాళ్ళు విసరడం మాత్రం తప్పు. ఎందుకంటే అది మిమ్మల్నేమీ చెయ్యలేదు. చెయ్యదు కూడా. అయినా మీరు రాళ్లు విసరడం వల్ల అది నాశనమవుతుంది. అప్పుడు నా మిత్రుడు బాధపడతాడు. నష్టం అతనికి తప్ప నాకు కాదుగా...’’ అని గాంధీజీ చెప్పడంతో ఆయనను ఆట పట్టించాలనుకున్న వాళ్ళు గాంధీజీ మాటలకు సిగ్గుపడి తల దించుకున్నారు. కాస్సేపు అక్కడ మౌనం తాండవించింది. అనంతరం ఆ అల్లరిమూక గాంధీజీ కాళ్ళపై పడి తమను క్షమించాలని అడిగారు. గాంధీజీ చిరునవ్వు నవ్వుతూ ప్రేమగా వారితో కరచాలనం చేశారు.



క్షమ లేకనే మనం మామూలు వాళ్లలా ఉన్నాము. క్షమా గుణం వల్లనే గాంధీజీ మహాత్ముడయ్యాడు. అందుకే క్షమ కలవాడు అందరికన్నా బలమైన వాడని సామెత.

– డి.వి.ఆర్.

సినిమా



● ‘అల్లరి’ నరేశ్, ఆషిక, శ్రీనివాసా చిట్టూరి, నాగార్జున, కీరవాణి, విజయ్ బిన్నీ, చంద్రబోస్

అభిమానుల నవ్వులే నా ధైర్యం
– నాగార్జున

‘‘సెప్టెంబరు 20న నాన్నగారి(అక్కినేని నాగేశ్వరరావు) బర్త్‌ డే. ఆ రోజు విగ్రహావిష్కరణ పూర్తికాగానే ‘నా సామిరంగ’ షూటింగ్‌కు బయలుదేరాను. ‘ఎందుకంత తొందర.. ఇంకాస్త సేపు ఉండొచ్చుగా’ అని అమల నాతో అన్నారు. సంక్రాంతికి రిలీజ్‌ చేయాలని నేను చెప్పగానే పిల్లలతో సహా అందరూ ఆశ్చర్యపోయారు. నేను సంక్రాంతికి సినిమాను రిలీజ్‌ చేస్తానన్న నమ్మకాలు బయట ఎవరికీ లేవు. నా టీమ్‌ ముఖాల్లో మాత్రం ఆ నమ్మకం ఉంది. సినిమాను రిలీజ్‌ చేశాం. కీరవాణిగారు బాగా సపోర్ట్‌ చేశారు. మా టీమ్‌ అందర్నీ చాలా మిస్‌ అవుతున్నాను’’ అని నాగార్జున అన్నారు. ఆయన హీరోగా, ‘అల్లరి’ నరేశ్, రాజ్‌ తరుణ్, ఆషికా రంగనాథ్, మిర్నామీనన్, రుక్సార్‌ ధిల్లాన్, షబ్బీర్‌ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘నా సామిరంగ’. కొరియోగ్రాఫర్‌ విజయ్‌ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోందని చిత్రయూనిట్‌ చెబుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఈ సినిమా సక్సెస్‌ సెలబ్రేషన్స్‌లో నాగార్జున మాట్లాడుతూ– ‘‘మాపై అపరిమితమైన ప్రేమను చూపిస్తున్న అక్కినేని ఫ్యాన్స్‌కు ముందుగా థ్యాంక్స్‌. సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా ఎప్పుడూ ఒకేలా ఉంటారు. నేను కనపడగానే నవ్వుతూనే ఉంటారు. ఆ నవ్వే నాకు చాలా ధైర్యం. అలాగే తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్‌. సంక్రాంతికి రిలీజ్‌ చేస్తున్నామని, కాస్త ఆలస్యంగా మేం చెప్పినప్పటికీ సహకరించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు థ్యాంక్స్‌. నెక్ట్స్‌ సంక్రాంతికి కలుద్దాం’’ అన్నారు. ‘‘నాగార్జునగారితో సినిమా చేయడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాను. కీరవాణి, చంద్ర బోస్‌గార్లు ఇలానే కలిసి ఉంటూ ఇంకా మంచి మ్యూజిక్‌ ఇవ్వాలి’’ అన్నారు ‘అల్లరి’ నరేశ్‌. ‘‘ఓ సినిమా విడుదలై, సక్సెస్‌ సాధించి, సెలబ్రేషన్స్‌ షీల్డ్స్‌ అందుకోవడం అనేది చాలా అరుదుగా జరుగుతుంటుంది. ఇలా నా తొలి సినిమాకే జరగడం నా అదృష్టం’’ అన్నారు విజయ్‌ బిన్నీ. ‘‘నవరస భరితమైన సినిమాగా ‘నా సామిరంగ’ నిలిచింది’’ అన్నారు సంగీత దర్శకుడు కీరవాణి. ఈ సక్సెస్‌మీట్‌లో పాటల రచయిత చంద్రబోస్‌ మాట్లాడారు. ఈ కార్య క్రమంలో నాగార్జున, కీరవాణి చేతుల మీదుగా డిస్ట్రిబ్యూటర్స్, చిత్రబృందం షీల్డ్స్‌ అందుకున్నారు.



● రష్మిక మందన్నా

పృథ్వీరాజ్‌తో జోడీ?



● కాజోల్



● పృథ్వీరాజ్ సుకుమారన్

మలయాళ నటుడు పృథ్వీరాజ్‌ సుకుమారన్‌కి జోడీగా బాలీవుడ్‌ నటి కాజోల్‌ నటిస్తున్నారని బాలీవుడ్‌ టాక్‌. ఈ సినిమాకు నటుడు బొమన్‌ ఇరానీ తనయుడు కయోజీ ఇరానీ దర్శకత్వం వహిస్తున్నారని భోగట్టా. కరణ్‌ జోహార్‌ నిర్మిస్తున్న ఈ మూవీలో పృథ్వీరాజ్‌ సుకుమారన్, కాజోల్, నటుడు సైఫ్‌ అలీఖాన్‌ తనయుడు ఇబ్రహీం అలీఖాన్‌ ప్రధాన పాత్రధారులు. ఇంకా టైటిల్‌ ఖరారు చేయని ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. షూటింగ్‌ కూడా దాదాపు చివరి దశకు చేరుకుందని సమాచారం. అతి త్వరలో ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. ఈ సినిమాను ఉద్దేశిస్తూ కొన్ని హింట్స్‌తో కరణ్‌ జోహార్‌ ఓ నోట్‌ను షేర్‌ చేశారు. దీంతో ఈ మూవీపై బాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. కాగా ఈ చిత్రానికి ‘సర్జమీన్‌’ అనే టైటిల్‌ అనుకుంటున్నారని టాక్‌.

కిస్మత్‌లో భాగమవడం గౌరవంగా ఉంది
– అవసరాల శ్రీనివాస్



● అభినవ్, శ్రీనాథ్, అవసరాల శ్రీనివాస్, విశ్వదేవ్

‘‘డైరెక్టర్‌ శ్రీనాథ్‌గారు ‘కిస్మత్‌’ మూవీని అద్భుతంగా తీశారు. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నాను. నిర్మాత రాజుగారు రాజీపడకుండా తీశారు. ఈ చిత్రం విజయం సాధించి, యూనిట్‌కి మంచి పేరు తీసుకురావాలి’’ అని నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్‌ అన్నారు. నరేష్‌ అగస్త్య, అభినవ్‌ గోమఠం, విశ్వదేవ్, అవసరాల శ్రీనివాస్‌ ముఖ్య తారలుగా శ్రీనాథ్‌ బాదినేని దర్శకత్వం వహించిన చిత్రం ‘కిస్మత్‌’. కామ్రేడ్‌ ఫిల్మ్‌ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్‌పై రాజు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్‌ వేడుకలో శ్రీనాథ్‌ బాదినేని మాట్లాడుతూ–‘‘మా సినిమా ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్‌ చేస్తుంది. థియేటర్స్‌లో చాలా ఎంజాయ్‌ చేస్తారు’’ అన్నారు. ‘‘ఇదొక క్రైమ్‌ కామెడీ సినిమా.. ప్రేక్షకులను అలరిస్తుంది’’ అన్నారు అభినవ్‌ గోమఠం, విశ్వదేవ్‌. ఈ వేడుకలో సంగీత దర్శకుడు మార్క్‌ కె.రాబిన్, నటులు తాగుబోతు రమేష్, రచ్చ రవి, పాటల రచయిత కాసర్ల శ్యామ్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: సీహెచ్‌ భానుప్రసాద్‌ రెడ్డి.



● శ్రద్ధాదాస్

నేను అలాంటి పనులు చేయను!

‘అల్లరి’ నరేశ్‌ హీరోగా నటించిన ‘సిద్ధు ఫ్రమ్‌ సీకాకుళం’(2008) సినిమాతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు శ్రద్ధాదాస్‌. ఆ తర్వాత హిందీ, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో పలు సినిమాల్లో నటించి గ్లామర్‌ బ్యూటీగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారామె. ఆ మధ్య హీరోయిన్‌ మన్నారా చోప్రా గురించి శ్రద్ధాదాస్‌ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు తెరలేపాయి. ‘‘జిద్‌ (2014) అనే హిందీ సినిమాలో మన్నారా చోప్రాతో కలిసి నటించాను. ఈ సినిమా చిత్రీకరణలో కొన్ని సన్నివేశాల్లో మన్నారా చోప్రా కావాలనే నన్ను నిజంగానే కొట్టింది.. బలవంతంగా మెట్లపైకి తోసేసింది.. ఆమె వల్ల గాయాలపాలయ్యాను’’ అంటూ గతంలో మాట్లాడారు శ్రద్ధాదాస్‌. ఆ మాటలపై తీవ్ర దుమారం రేగినా, ఆ తర్వాత సద్దుమణిగింది. అయితే మన్నారా చోప్రాతో ఉన్న విభేదాలపై శ్రద్ధాదాస్‌ మరోసారి స్పందించినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై తన సోషల్‌ మీడియా వేదికగా స్పందించారు శ్రద్ధాదాస్‌. ‘‘మన్నారా చోప్రాపై కానీ, ఆమె ఫ్యామిలీ గురించి నేను ఏ మీడియాకి అధికారిక ప్రకటన ఇవ్వలేదు. కనీసం నా వ్యక్తిగత పీఆర్వో సిబ్బంది కూడా లేరు. నేను కావాలనుకుంటే ‘ఎక్స్‌’ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో రిలీజ్‌ చేసి పబ్లిసిటీ పొందుతాను. కానీ, నేను అలాంటి పనులు చేయను. ఆమె విషయంలో గతంలో నేను బాధపడ్డాను. కానీ, ఇప్పుడు వీటన్నింటికీ దూరంగా ఉండాలనుకుంటున్నాను’’ అంటూ శ్రద్ధాదాస్‌ పెట్టిన పోస్ట్‌ నెట్టింట వైరల్‌గా మారింది.

బిజీ బిజీ

హీరోయిన్‌ రష్మిక మందన్నా ఇటు తెలుగు, తమిళ చిత్రాలతో పాటు అటు బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు. తాజాగా ఆమె నటిస్తున్న హిందీ చిత్రం ‘ఛావ’. విక్కీ కౌశల్‌ హీరోగా ‘మిమి’ ఫేమ్‌ లక్ష్మణ్‌ ఉటేకర్‌ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్‌ యాక్షన్‌ ఫిల్మ్‌ ఇది. ఈ మూవీలో ఛత్రపతి శివాజీ మహారాజ్‌ పెద్ద కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ పాత్రలో విక్కీకౌశల్‌ నటిస్తున్నారు. శంభాజీ మహారాజ్‌ సతీమణి ఏసుబాయి పాత్రలో రష్మిక మందన్నా నటించారు. ఈ సినిమాలో తన పాత్ర చిత్రీకరణ పూర్తి చేశారు రష్మిక మందన్న. ‘‘ఛావ’ సినిమాలో నా వంతు షూటింగ్‌ పూర్తయింది. ఈ సినిమా నటీనటులు, కాస్ట్యూమ్, డిజైన్, విజువల్స్, సెట్స్‌... ఇలా వీటన్నింటి నుంచి బయటకురావడానికి నాకు రెండు రోజుల సమయం పట్టింది. నా కెరీర్‌లో 22వ సినిమా ఇది. ఏసుబాయి పాత్ర ఇచ్చిన లక్ష్మణ్‌ ఉటేకర్‌కి ధన్యవాదాలు’’ అని పేర్కొన్నారు రష్మిక. కాగా ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది. ఈ సినిమా కాకుండా అల్లు అర్జున్‌ ‘పుష్ప: ది రూల్‌’, ధనుష్‌ ‘డీఎన్‌ఎస్‌’ చిత్రాల్లో రష్మిక నటిస్తున్నారు. అలాగే ‘రెయిన్‌ బో’, ‘ది గాళ్‌ఫ్రెండ్‌’ వంటి లేడీ ఓరియంటెడ్‌ సినిమాలు చేస్తున్నారామె.



● దిలీప్ ప్రకాష్, ఎల్‌బీ శ్రీరామ్, బ్రహ్మానందం, ఏఎం రత్నం

చివరి వరకూ మిగిలిపోయేది కళే
– బ్రహ్మానందం

‘‘నటులు, నట జీవితం అంటే నాకు ఒక భావోద్వేగమైన అనుబంధం. జీవితమన్నది చిన్నది. కానీ, కళ చాలా పెద్దది. చివరి వరకూ మిగిలిపోయేది కళ మాత్రమే. కళకు ఆయువుపట్టు నాటక రంగం. ఆ నేపథ్యంలో రూపొందిన ‘ఉత్సవం’ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని నటుడు బ్రహ్మానందం అన్నారు. దిలీప్‌ ప్రకాష్, రెజీనా ప్రధాన పాత్రల్లో, ప్రకాష్‌ రాజ్, బ్రహ్మానందం, నాజర్, రాజేంద్ర ప్రసాద్, ఎల్‌బీ శ్రీరామ్, అలీ, ఆమని కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘ఉత్సవం’. అర్జున్‌ సాయి దర్శకత్వంలో హార్న్‌బిల్‌ పిక్చర్స్‌ సమర్పణలో సురేష్‌ పాటిల్‌ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని బ్రహ్మానందం, నిర్మాత ఏఎం రత్నం విడుదల చేశారు. ఏఎం రత్నం మాట్లాడుతూ–‘‘సినిమాకి మూలం నాటకరంగం. ‘ఉత్సవం’ వంటి మంచి కళాత్మక చిత్రం విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘దర్శకుడిగా ‘ఉత్సవం’ నా తొలి చిత్రం’’ అన్నారు అర్జున్‌ సాయి. ‘‘ఉత్సవం’ వంటి కథా బలం ఉన్న సినిమాతో హీరోగా పరిచయం కావడం గర్వంగా, గౌరవంగా ఉంది’’ అన్నారు దిలీప్‌. ఈ టీజర్‌ లాంచ్‌లో సంగీత దర్శకుడు అనూప్‌ రూబెన్స్, పాటల రచయిత అనంత శ్రీరామ్, కథా రచయిత లక్ష్మీ భూపాల పాల్గొన్నారు.

అఘోరా శంకర్



● విశ్వక్ సేన్

‘గామి’ సినిమా కోసం అఘోరాగా మారిపోయారు హీరో విశ్వక్‌ సేన్‌. ఆయన హీరోగా విద్యాధర కాగిత దర్శకత్వంలో రూపొందుతున్న అడ్వెంచరస్‌ డ్రామా ‘గామి’. ఈ చిత్రంలో చాందినీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎంజి అభినయ, హారిక, మహ్మద్‌ సమద్‌ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వి.సెల్యులాయిడ్‌ సమర్పణలో కార్తీక్‌ శబరీష్‌ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌ కామిక్‌ కాన్‌లో ఆదివారం ‘గామి’ సినిమా ఫస్ట్‌లుక్‌ పోస్టర్‌ను విడుదల చేశారు. ‘‘గామి’ చిత్రంలో శంకర్‌ అనే ఓ అఘోరా పాత్రలో కనిపిస్తారు విశ్వక్‌ సేన్‌. అతనికి మానవ స్పర్శ తెలియదు. భావోద్వేగాలతో కూడిన సంఘర్షణ అతని పాత్రలో కనిపిస్తుంది. ఈ చిత్రంలో అఘోరా అంశమే కాకుండా, మరికొన్ని ఆసక్తికర విషయాలు ఉన్నాయి. వీటి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం’’ అని చిత్రయూనిట్‌ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: నరేష్‌ కుమారన్‌.



అర్షిన్ సెంచరీ: అజేయంగా భారత్

దక్షిణాఫ్రికాలో జరుగుతున్న అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో అమెరికాతో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 201 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశను అజేయంగా ముగించింది. ముందుగా భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్షిన్ కులకర్ణి (108; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. అనంతరం అమెరికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 125 పరుగులు చేసి ఓడిపోయింది. మంగళవారం జరిగే 'సూపర్ సిక్స్' తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ ఆడతుంది.

ప్రపంచ రికార్డుతో పసిడి పతకం

భారత షూటర్ దివ్యాంశ్ సింగ్ పన్వర్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్స్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. కైరోలో జరుగుతున్న ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో ఆదివారం జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల దివ్యాంశ్ 253.7 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకం నెగ్గాడు. గత ఏడాది ఆసియా క్రీడల్లో చైనా షూటర్ షెంగ్ లిహేయో 253.3 పాయింట్లతో నెలకొల్పిన ప్రపంచ రికార్డును దివ్యాంశ్ బద్దలు కొట్టాడు.



విన్నర్ సినెర్...


- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన ఇటలీ ప్లేయర్
- ఐదు సెట్‌ల పోరులో మెద్వెదెవ్‌పై విజయం



మెల్‌బోర్న్: సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, 10 సార్లు చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా)పై తాను సాధించిన విజయం గాలివాటమేమీ ఇటలీ యువతార యానిక్ సినెర్ నిరూపించాడు. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగో సీడ్ సినెర్ చాంపియన్‌గా అవతరించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ సినెర్ 3–6, 3–6, 6–4, 6–4, 6–3తో ప్రపంచ మూడో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై చిరస్మరణీయ విజయం సాధించాడు. తద్వారా 1976 తర్వాత పురుషుల సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన ఇటలీ ప్లేయర్‌గా, ఆస్ట్రేలియన్ ఓపెన్ సాధించిన తొలి ఇటలీ క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. 3 గంటల 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో 22 ఏళ్ల సినెర్ తొలి రెండు సెట్‌లు కోల్పోయినా ఆందోళన చెందలేదు. మూడో సెట్ నుంచి సినెర్ నెమ్మదిగా లయలోకి వచ్చాడు. కెరీర్‌లో ఆరోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న మెద్వెదెవ్‌పై ఒత్తిడి తెచ్చాడు. మూడో సెట్ పదో గేమ్‌లో, నాలుగో సెట్ పదో గేమ్‌లో మెద్వెదెవ్ సర్వీస్‌లను బ్రేక్ చేసిన సినెర్ రెండు సెట్‌లు గెలిచి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక ఐదో సెట్‌లో ఆరో గేమ్‌లో మెద్వెదెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినెర్ ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని సెట్‌తోపాటు మ్యాచ్‌ను దక్కించుకున్నాడు. విజేత సినెర్‌కు 31 లక్షల 50 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 17 కోట్ల 22 లక్షలు), రన్నరప్ మెద్వెదెవ్‌కు 17 లక్షల 25 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

విండీస్ సంచలనం

1997 తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్టులో విజయం



బ్రిస్బేన్: వెస్టిండీస్ యువ పేసర్ షామర్ జోసెఫ్ (7/68) నిప్పులు చెరిగే బంతులతో ఆస్ట్రేలియా బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. 1997 తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై వెస్టిండీస్‌కు తొలిసారి టెస్టులో విజయం అందించాడు. ఇప్పటి వరకు ఆడిన 11 డే/నైట్ టెస్టుల్లోనూ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు షామర్ దెబ్బకు 12వ డే/నైట్ టెస్టులో తొలిసారి పరాజయం రుచి చూసింది. డే/నైట్‌గా జరిగిన రెండో టెస్టులో ఆట నాలుగో రోజు 216 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు ఆస్ట్రేలియా ఓవర్‌నైట్ స్కోరు 60/2తో బరిలోకి దిగింది. ఒకదశలో ఆసీస్ 113/2తో విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించింది. అయితే క్రీజులో నిలదొక్కుకున్న కామెరాన్ గ్రీన్ (42; 4 ఫోర్లు)ను, ట్రావిస్ హెడ్ (0)ను షామర్ జోసెఫ్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. ఒకవైపు ఓపెనర్ స్టీవ్ స్మిత్ (91 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేస్తుండగా.. మరోవైపు ఇతర ఆసీస్ బ్యాటర్లను షామర్ పెవిలియన్‌కు పంపించాడు. చివరకు ఆస్ట్రేలియా 50.5 ఓవర్లలో 206 పరుగులవద్ద ఆలౌట్ కావడంతో వెస్టిండీస్ 8 పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయం అందుకుంది. రెండు టెస్టుల సిరీస్‌ను 1–1తో 'డ్రా' చేసుకుంది. షామర్ జోసెఫ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. షామర్ ఈ సిరీస్‌లో 13 వికెట్లు తీయడంతోపాటు 57 పరుగులు చేశాడు.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 311; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 289/9 డిక్లేర్డ్; వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 193; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 206 ఆలౌట్ (50.5 ఓవర్లలో) (స్టీవ్ స్మిత్ 91 నాటౌట్, గ్రీన్ 42, స్టార్క్ 21, షామర్ జోసెఫ్ 7/68).

ఇంట్లోనే తలవంచారు

తొలి టెస్టులో భారత్ ఓటమి | **28 పరుగులతో ఇంగ్లండ్ విజయం** | **రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 202 ఆలౌట్** | **టామ్ హార్ట్లీకి 7 వికెట్లు** | **2 నుంచి వైజాగ్‌లో రెండో టెస్టు**

సొంతగడ్డపై మ్యాచ్... తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగుల భారీ ఆధిక్యం... ప్రత్యర్థి జట్టులో పెద్దగా గుర్తింపు లేని స్పిన్నర్లు... 231 పరుగుల స్వల్ప లక్ష్యం... అయినా సరే... భారత జట్టు అనూహ్య రీతిలో ఓటమిని ఆహ్వానించింది... ఇంగ్లండ్ బౌలర్లకు తలవంచుతూ పేలవ బ్యాటింగ్‌తో కుప్పకూలింది. నాలుగో రోజు పిచ్‌పై స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు తడబడుతూ మన బ్యాటర్లు డిఫెన్స్ ఆడటం గతంలో ఎన్నడూ చూడనిది. కానీ తొలి టెస్టులో అలాంటి దృశ్యమే కనిపించింది. చివరకు హైదరాబాద్‌లో పరాజయం పలకరించింది.

రెండో ఇన్నింగ్స్ ఆడుతూ తొలి ఇన్నింగ్స్ లోటును పూడ్చుకునే లోపే ఐదుగురు బ్యాటర్లు పెవిలియన్‌కు... ఎదురుగా ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలింగ్ బలగం... వీటన్నింటిని దాటి సాగిన ఒలీ పోప్ అత్యద్భుత ఇన్నింగ్స్ ఇంగ్లండ్‌కు ఆశలు రేపింది. ఆపై భారత్‌ను నిలువరించగలమా అనే సందేహాల మధ్య టామ్ హార్ట్లీ నేనున్నానంటూ వచ్చాడు. తొలి బంతికి సిక్సర్ ఇచ్చి కెరీర్ మొదలు పెట్టిన అతను చివరి వికెట్ సహా 7 వికెట్లు తీసి సూపర్ అనిపించాడు. టెస్టులో రెండు రోజుల పాటు వెనుకబడి కూడా ఆఖరికి అసలైన ఆటతో ఇంగ్లండ్ జట్టు విదేశీ గడ్డపై చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది.

సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత్‌కు ఊహించని విధంగా గట్టి దెబ్బ తగిలింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో నాలుగో రోజే ముగిసిన తొలి టెస్టులో టీమిండియాకు ఓటమి ఎదురైంది. పలు మలుపులతో సాగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 28 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. 231 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 69.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ శర్మ (58 బంతుల్లో 39; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలి టెస్టు ఆడిన ఎడంచేతి వాటం స్పిన్నర్ టామ్ హార్ట్లీ 62 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టడం విశేషం. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 316/6తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 420 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఒలీ పోప్ (278 బంతుల్లో 196; 21 ఫోర్లు) త్రుటిలో డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. తాజా ఫలితంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ 1–0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టు ఫిబ్రవరి 2 నుంచి విశాఖపట్నంలో జరుగుతుంది.

చేజారిన డబుల్ సెంచరీ...

నాలుగో రోజు ఆటలో ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసేందుకు భారత్‌కు ఎక్కువ సమయమే పట్టింది. రేహాన్ అహ్మద్ (53 బంతుల్లో 28; 3 ఫోర్లు)ను బుమ్రా వెనక్కి పంపినా... పోప్ జోరు తగ్గలేదు. అతనికి టామ్ హార్ట్లీ (52 బంతుల్లో 34; 4 ఫోర్లు) అండగా నిలవడంతో కీలక భాగస్వామ్యం నమోదైంది. ఈ దశలోనే వీరిద్దరిని నిలువరించడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. పోప్, హార్ట్లీ ఎనిమిదో వికెట్‌కు 80 పరుగులు జోడించడం విశేషం. ఎట్టకేలకు ఒకే స్కోరు వద్ద హార్ట్లీ, వుడ్ (0)లను భారత్ అవుట్ చేయగా... బుమ్రా బౌలింగ్‌లో ర్యాంప్‌షాట్‌కు ప్రయత్నించి పోప్ డబుల్ సెంచరీని చేజార్చుకోవడంతో ఇన్నింగ్స్ ముగిసింది. ఆదివారం ఇంగ్లండ్ 25.1 ఓవర్లు ఆడి 104 పరుగులు చేసింది.





పేలవ బ్యాటింగ్‌తో...

ఛేదనను కెప్టెన్ రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ (15) మెరుగ్గానే ఆరంభించారు. అయితే ఒకే ఓవర్లో యశస్వి, శుబ్‌మన్ గిల్ (0)లను అవుట్ చేసి భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్లీ... కొద్దిసేపటికే రోహిత్‌ను కూడా వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో భారత్ కష్టాల్లో పడింది. టీ విరామం తర్వాత ఇంగ్లండ్ బౌలర్లు మరింతగా పట్టు బిగించి టీమిండియా బ్యాటర్లను పూర్తిగా కట్టిపడేశారు. ఫలితంగా 12 పరుగుల వ్యవధిలో అక్షర్ పటేల్ (17), కేఎల్ రాహుల్ (22) వెనుదిరగ్గా, ఒకే స్కోరు వద్ద రవీంద్ర జడేజా (2), శ్రేయస్ అయ్యర్ (13) అవుటయ్యారు. అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించిన జడేజాను అద్భుతమైన త్రోతో స్టోక్స్ రనౌట్ చేయగా... శ్రేయస్ మళ్లీ చెత్త షాట్‌తో నిష్క్రమించాడు. ఈ దశలోనే భారత్ ఓటమి ఖాయమైనట్లుగా అనిపించింది. అయితే కోన శ్రీకర్ భరత్ (59 బంతుల్లో 28; 3 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (84 బంతుల్లో 28; 2 ఫోర్లు) పట్టుదలగా పోరాడి విజయంపై ఆశలు రేపారు.

చివర్లో ఉత్కంఠ...

భరత్, అశ్విన్ జత కలిసే సమయానికి భారత్ స్కోరు 119/7... విజయానికి మరో 112 పరుగులు కావాలి. ఈ సమయంలో వీరిద్దరు గట్టిగా నిలబడ్డారు. ఆరంభంలో జాగ్రత్తగా ఆడినా ఆ తర్వాత ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొంటూ స్వేచ్ఛగా పరుగులు చేశారు. ఒత్తిడి పెరగడంతో ఇంగ్లండ్ బౌలర్లు, ఫీల్డర్లలో తడబాటు కనిపించింది. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 57 పరుగులు జత చేశారు. మరో 55 పరుగులు అవసరం. ఈ స్థితిలో హార్ట్లీ చక్కటి బంతితో భరత్‌ను బౌల్డ్ చేసి భాగస్వామ్యాన్ని విడదీయగా... తప్పనిసరి పరిస్థితుల్లో భారీ షాట్‌కు ప్రయత్నించి అశ్విన్ వెనుదిరిగాడు. ఈ వికెట్ పడిన తర్వాత ఫలితం కోసం నిబంధనల ప్రకారం అంపైర్లు అరగంట ఆటను పొడిగించారు. చివరి వికెట్‌కు కొన్ని షాట్లతో సిరాజ్ (12), బుమ్రా (6 నాటౌట్) కూడా 25 పరుగులు జోడించడంతో మరో 29 పరుగులే మిగిలాయి. ఆదివారం మరో ఓవర్ మిగిలి ఉండగా... దీనిని ఆడుకుంటే ఆట చివరి రోజుకు వెళ్లేది. కానీ రెండో బంతికి సిరాజ్ స్టంపౌట్ కావడంతో భారత్ కథ ముగిసింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 436 ఆలౌట్; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 420 ఆలౌట్; భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) హార్ట్లీ 39; యశస్వి (సి) పోప్ (బి) హార్ట్లీ 15; గిల్ (సి) పోప్ (బి) హార్ట్లీ 0; రాహుల్ (ఎల్బీ) (బి) రూట్ 22; అక్షర్ (సి అండ్ బి) హార్ట్లీ 17; శ్రేయస్ (సి) రూట్ (బి) లీచ్ 13; జడేజా (రనౌట్) 2; భరత్ (బి) హార్ట్లీ 28; అశ్విన్ (స్టంప్డ్) ఫోక్స్ (బి) హార్ట్లీ 28; బుమ్రా (నాటౌట్) 6; సిరాజ్ (స్టంప్డ్) ఫోక్స్ (బి) హార్ట్లీ 12; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (69.2 ఓవర్లలో ఆలౌట్)** 202. **వికెట్ల పతనం:** 1–42, 2–42, 3–63, 4–95, 5–107, 6–119, 7–119, 8–176, 9–177, 10–202. **బౌలింగ్:** రూట్ 19–3–41–1, వుడ్ 8–1–15–0 హార్ట్లీ 26.2–5–62–7 లీచ్ 10–1–33–1, రేహాన్ 6–0–33–0.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆంధ్రప్రదేశ్‌లో 240 డిగ్రీ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 240
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** బోటనీ–19, కెమిస్ట్రీ–26, కామర్స్–35, కంప్యూటర్ అప్లికేషన్స్–26, కంప్యూటర్ సైన్స్–31, ఎకనామిక్స్–16, హిస్టరీ–19, మ్యాథమేటిక్స్–17, ఫిజిక్స్–11, పొలిటికల్ సైన్స్–21, జువాలజీ–19.
» **జోన్‌ల వారీగా ఖాళీలు:** జోన్1–68, జోన్2–95, జోన్3–50, జోన్4–77.
» **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** రూ.57,700 నుంచి రూ.1,82,400.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువ పత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పేపర్–1లో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ(డిగ్రీ స్టాండర్డ్) నుంచి 150 ప్రశ్నలు(150 మార్కులు), సంబంధిత సబ్జెక్టు(పీజీ స్టాండర్డ్) నుంచి 150 ప్రశ్నలు(300 మార్కులు) అడుగుతారు. ప్రతి పేపర్‌కు 150 నిమిషాల వ్యవధి ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.01.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.02.2024.
» **రాతపరీక్ష తేది:** ఏప్రిల్/మే 2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఇస్రో ఎన్ఆర్ఎస్‌సీలో 41 సైంటిస్ట్ ఇంజనీర్ పోస్టులు

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ).. సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 41
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ'(అగ్రికల్చర్)–02, సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ' (ఫారెస్ట్రీ ఎకానమీ)–04, సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ'(జియో ఇన్ఫర్మేటిక్స్)–07, సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ'(జియాలజీ)–04, సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ' (జియో ఫిజిక్స్)–04, సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ'(సాయిల్ సైన్స్)–04, సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ' (అర్బన్ స్టడీస్)–08, సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ' (వాటర్ రిసోర్సెస్)–07, మెడికల్ ఆఫీసర్ 'ఎస్సీ'–01, నర్స్ బీ–02, లైబ్రరీ అసిస్టెంట్'ఏ'–03.
» **అర్హత:** సంబంధిత పోస్టును అనుసరించి తదితర విభాగాల్లో ఎస్ఎస్ఎల్‌సీ /ఎస్ఎస్‌సీ, డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంటెక్, ఎంఈ ఉత్తీర్ణులవ్వాలి. –వయసు: 18 నుంచి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్సీ', మెడికల్ ఆఫీసర్ 'ఎస్సీ' పోస్టుకు నెలకు రూ.81,906. నర్స్ 'బీ', లైబ్రరీ అసిస్టెంట్ 'ఏ' పోస్టుకు రూ.65,554.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.02.2024.
» **వెబ్‌సైట్:** www.nrsc.gov.in

తెలంగాణ మైనారిటీ గురుకులాల్లో 5, 6, 7, 8 తరగతి, ఇంటర్ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్).. రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సీవోఈ (సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్) కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చు.

ప్రవేశాల వివరాలు

» **ఐదో తరగతి:** మైనారిటీలకైతే ముందొచ్చిన వారికి సీట్లు ఇస్తారు. ఇతరులకు లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయిస్తారు.
» **6, 7, 8 తరగతులు(ఖాళీలుంటేనే):** మొదట దరఖాస్తు చేసుకున్న వారికి సీట్లు కేటాయిస్తారు.
» **ఇంటర్ ఫస్టియర్(జనరల్, ఒకేషనల్):** పదో తరగతిలో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
» **సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఇంటర్:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా సీట్లు కేటాయిస్తారు.
» **అర్హత:** తరగతిని అనుసరించి 4, 5, 6, 7,10 వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.2 లక్షలకు మించకూడదు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.02.2024.

అభ్యర్థుల ఎంపిక, ధ్రువపత్రాల పరిశీలన

» **ఐదు నుంచి ఎనిమిదో తరగతులకు:** 24.04.2024 నుంచి 30.04.2024 వరకు.
» **ఇంటర్మీడియట్‌కు:** 01.05.2024 నుంచి 10.05.2024 వరకు
» **ప్రవేశ పరీక్ష తేది:** 25.02.2024.
» **వెబ్‌సైట్:** https://cet.cgg.gov.in

మేటి ఇంజనీరింగ్‌కు మార్గం.. బిట్‌శాట్

» బిట్‌శాట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» బిట్స్ క్యాంపస్‌ల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులు
» బిట్‌శాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు
» రెండు విడతల్లో బిట్‌శాట్ పరీక్ష నిర్వహణ

బిట్స్ అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా బిట్‌శాట్! దేశంలో.. ఇంజనీరింగ్, సైన్స్ కోర్సులను అందించడంలో పేరున్న సంస్థ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్). ఈ సంస్థ క్యాంపస్‌ల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షే.. బిట్‌శాట్!! తాజాగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బిట్‌శాట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. బిట్స్ క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..



బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో.. ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సులుగా పేర్కొనే బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి బిట్‌శాట్‌ను ప్రతి ఏటా జాతీయ స్థాయిలో నిర్వహిస్తారు. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ అభ్యర్థులు సైతం పోటీ పడే పరీక్ష ఇది. దీంతో పోటీ అధికంగా ఉంటుంది.

క్యాంపస్‌లు.. బ్రాంచ్‌లు

- **పిలానీ క్యాంపస్:** కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటితోపాటు బీఫార్మ్, ఎమ్మెస్సీ (బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్), ఎమ్మెస్సీ జనరల్ స్టడీస్ కోర్సులను అందిస్తున్నారు.
- **గోవా క్యాంపస్:** కెమికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటితో పాటు ఎమ్మెస్సీ బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ కోర్సులను అందిస్తున్నారు.
- **హైదరాబాద్ క్యాంపస్:** కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయి.
- వీటితోపాటు బీఫార్మ్, ఎమ్మెస్సీ బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ కోర్సులు అందిస్తున్నారు.

అర్హతలు

10+2/ఇంటర్మీడియెట్ ఎంపీసీ/బైపీసీ (బి.ఫార్మ్ కోర్సుల్లో అడ్మిషన్ కోసం)లో కనీసం 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. గ్రూప్ సబ్జెక్ట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ)లలో.. ప్రతి సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా కనీసం 60 శాతం మార్కులు పొంది ఉండాలి. 10+2/ఇంటర్మీడియెట్ 2023లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు, 2024లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

130 ప్రశ్నలకు బిట్‌శాట్

- బిట్‌శాట్ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. నాలుగు విభాగాల్లో 3 గంటల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది. **పార్ట్–1:** ఫిజిక్స్ 30ప్రశ్నలు; **పార్ట్–2:** కెమిస్ట్రీ 30 ప్రశ్నలు; **పార్ట్–3:** ఎ) ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ 10 ప్రశ్నలు, బి) లాజికల్ రీజనింగ్ 20 ప్రశ్నలు; పార్ట్–4: మ్యాథమెటిక్స్/బయాలజీ 40 ప్రశ్నలు ఉంటాయి.
- పార్ట్–4కు సంబంధించి బీ.ఫార్మ్ విద్యార్థులు బయాలజీ సబ్జెక్టును; బీఈ కోర్సుల అభ్యర్థులు మ్యాథమెటిక్స్ సబ్జెక్టుతో పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు చొప్పున మొత్తం 130 ప్రశ్నలు–390 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు.

అదనపు ప్రశ్నల అవకాశం

మూడు గంటల్లోపు అన్ని ప్రశ్నలను పూర్తిచేసిన అభ్యర్థులకు.. అదనంగా మరో 12 ప్రశ్నలకు సమాధానం ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ లేదా బయాలజీ, లాజికల్ రీజనింగ్ నుంచి మూడు ప్రశ్నలు చొప్పున ఇస్తారు.

రెండు సెషన్లు.. బెస్ట్ స్కోర్‌తో ప్రవేశం

బిట్‌శాట్‌ను రెండు సెషన్లలో నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు సెషన్లకు లేదా ఏదో ఒక సెషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు సెషన్లకు హాజరైతే.. బెస్ట్ స్కోర్ వచ్చిన సెషన్‌నే మెరిట్ జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు. సీట్ల కేటాయింపులో అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న క్యాంపస్ ప్రాథమ్యాలను, ఇంజనీరింగ్ బ్రాంచ్ ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుంటారు. దానికి అనుగుణంగా సీట్ల కేటాయింపు చేస్తారు.

టాపర్స్‌కు డైరెక్ట్ అడ్మిషన్

రాష్ట్రాల స్థాయిలోని ఇంటర్మీడియెట్, తత్సమాన బోర్డ్ పరీక్షల్లో ఫస్ట్ ర్యాంకు పొందిన వారికి బిట్‌శాట్ నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ బోర్డ్ టాపర్స్ నేరుగా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంది.

మరెన్నో ఇన్‌స్టిట్యూట్స్‌లోనూ

బిట్‌శాట్ స్కోర్ ద్వారా బిట్స్ క్యాంపస్‌లతో పాటు మరెన్నో ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందే వీలుంది. దాదాపు వంద వరకు ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లు బిట్‌శాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 11, 2024
- **దరఖాస్తు సవరణకు అవకాశం:** ఏప్రిల్ 15 నుంచి 19 వరకు
- **టెస్ట్ సెంటర్ కేటాయింపు:** మే 1, 2024
- **సెషన్–1 హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** మే 15 నుంచి
- **సెషన్–1 ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు:** మే 21 నుంచి మే 26 వరకు
- **బిట్‌శాట్ సెషన్–2 దరఖాస్తు తేదీలు:** మే 22 నుంచి జూన్ 10 వరకు
- **సెషన్–2 దరఖాస్తు సవరణ అవకాశం:** జూన్ 11, 12
- **సెషన్–2 హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** జూన్ 19 నుంచి
- **సెషన్–2 ఆన్‌లైన్ టెస్ట్ తేదీలు:** జూన్ 22 నుంచి జూన్ 26 వరకు
- **అడ్మిషన్ జాబితా ప్రకటన:** జూలై 3, 2024
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** బిట్స్ పిలానీ -హైదరాబాద్ క్యాంపస్, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** www.bitsadmission.com

బెస్ట్ స్కోర్‌కు మార్గాలు

జాతీయ స్థాయిలో వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పడే బిట్‌శాట్‌లో బెస్ట్ స్కోర్ సాధించేందుకు అభ్యర్థులు పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.

కాన్సెప్ట్‌లే కొండంత అండ

- బిట్‌శాట్ క్లిష్టత జేఈఈ మెయిన్ స్థాయిలో ఉంటోంది. ప్రశ్నలన్నీ దాదాపుగా అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో సమాధానం ఇవ్వాల్సిన విధంగా ఉంటున్నాయి. కాబట్టి విద్యార్థులు ఆయా కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ బేసిక్స్‌పై పట్టు సాధించాలి. జేఈఈ ప్రిపరేషన్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవడం వల్ల ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందొచ్చు.
- ప్రతి సబ్జెక్ట్‌లోనూ ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లకు షార్ట్‌కట్ మెథడ్స్‌తో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఎంతో అనుకూలంగా ఉంటుంది.
- మ్యాథమెటిక్స్‌లో.. హైపర్‌బోలా, పారాబోలా, రెక్టాంగులర్ పారాబోలా, ట్రిగ్నోమెట్రీ, వెక్టార్స్, 3-డి, ఇంటెగ్రల్ కాలిక్యులస్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఫిజిక్స్‌లో.. వర్క్ అండ్ ఎనర్జీ, న్యూటన్స్ లా, కరెంట్ ఎలక్ట్రిసిటీ, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మ్యాగ్నటిజం అండ్ మ్యాగ్నటిక్ ఎఫెక్ట్ ఆఫ్ కరెంట్, ఎలక్ట్రిక్ కరెంట్ యూనిట్లలో ముఖ్య అంశాలతో నోట్స్ రూపొందించుకోవాలి.
- కెమిస్ట్రీలో.. ఆర్గానిక్ కెమిస్ట్రీలో కెమికల్ రియాక్షన్స్‌ను ఒక జాబితాగా రూపొందించుకోవాలి.

పార్ట్-3కి ప్రత్యేకంగా

బిట్‌శాట్‌లో మరో ప్రత్యేకత.. పార్ట్-3. ఈ విభాగంలో ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థుల్లోని సబ్జెక్ట్ నైపుణ్యాలతోపాటు లాంగ్వేజ్, తులనాత్మక పరిశీలన సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఈ విభాగాన్ని పొందుపర్చారు. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్,వొకాబ్యులరీపై పట్టు సాధిస్తే.. ఈ విభాగంలో మంచి స్కోర్ సాధించొచ్చు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్ ▽	360	70,701
నిఫ్టీ ▽	101	21,353

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్డాక్	15,447	▽	64
డోజోన్స్	38,101	△	52
ఎఫ్టీఎస్ఈ 100	7,635	△	105
డాక్స్	16,961	△	54
హాంగ్‌సెంగ్	2,910	△	4
నికాయ్	35,751	▽	485

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.63	107.21
€	యూరో	ఎస్‌బీఐ	89.49	91.85
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	56.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.47	12.54

పన్ను ఆదా.. చేద్దాం ఇలా!



ఆదాయపన్ను చట్టంలో పన్ను ఆదాకు ఎన్నో మార్గాలున్నాయి. వీటిని పూర్తిగా విని యోగించుకుంటే ఎంతో ఆదా చేసుకోవచ్చు. అందుకు గతం నుంచి ఉన్న పాత విధానంలోనే కొనసాగాల్సి ఉంటుంది. ఎన్నో సాధనాల్లో పెట్టుబడులు పెట్టాలి. అప్పుడే పన్ను ఆదా ప్రయోజనాలను గరిష్ఠ పరిమితి మేరకు పొందగలరు. అందరికీ అన్ని సాధనాలు అనుకూలమని చెప్పలేం. వీటిల్లో పెట్టుబడులకు నిర్ణీత కాలం పాటు లాకిన్ ఉంటుంది. కొన్నింటితోపాటు రిస్క్‌ను కూడా ఆహ్వానించాల్సి వస్తుంది. తమ లక్ష్యాలు, రాబడి ఆకాంక్షలకు అనుగుణంగా వీటిని ఎంపిక చేసుకోవాలి.

- మెరుగైన సాధనం ఎన్‌పీఎస్
- దీంతో విశ్రాంత జీవనానికి కావాల్సిన నిధి
- ఈఎల్ఎస్ఎస్‌లోనూ మెరుగైన రాబడులు
- బీమాతో కూడిన యులిప్‌లు దీర్ఘకాలానికే..
- తగినంత కవరేజీ ఉండేలా చూసుకోవాలి
- రిస్క్ వద్దనుకునే వారికి పీపీఎఫ్
- కుమార్తెల కోసం సుకన్య సమృద్ధి యోజన





జీవిత బీమా పాలసీలు

జీవిత బీమా పాలసీలు పన్ను ఆదా కోసం తీసుకునేవి కావు. జీవితంలో అన్ని ఆర్థిక లక్ష్యాలకు రక్షణ కల్పించే సాధనం జీవిత బీమా. ఆరోగ్య బీమాని సైతం ఆరోగ్య విపత్తుల నుంచి రక్షించే సాధనంగానే చూడాలి. ఆర్జించే వ్యక్తి దురదృష్ట వశాత్తూ మరణిస్తే, బీమా పరిహారం రూపంలో వచ్చే మొత్తం సదరు కుటుంబాన్ని ఆదుకునే విధంగా ఉండాలి. కనుక బీమా పాలసీలను ఎప్పుడూ రక్షణ కోణంలోనే చూసి తీసుకోవాలి. పొదుపుతో సంబంధం లేని, టర్మ్ ప్లాన్లు మెరుగైనవి. టర్మ్ ప్లాన్‌కు చెల్లించే ప్రీమియాన్ని సెక్షన్ 80సీ కింద చూపించుకుని పన్ను ఆదా చేసుకోవచ్చు. ఆరోగ్య బీమాకు చెల్లించే ప్రీమియం 60 ఏళ్లలోపు వారు అయితే సెక్షన్ 80డీ కింద గరిష్ఠంగా రూ.25,000 మొత్తంపై పన్ను మినహాయింపును పొందొచ్చు. 60 ఏళ్లు నిండిన వారికి అయితే ఈ పరిమితి రూ.50,000గా ఉంది. 30 ఏళ్ల వ్యక్తి రూ.కోటి బీమాతో టర్మ్ ప్లాన్ తీసుకుంటే ఏటా రూ.12,000–14,000 ప్రీమియం కింద చెల్లించాలి. అదే వ్యక్తి రూ.50 లక్షల ఎండోమెంట్ ప్లాన్ తీసుకుంటే ఏటా రూ.5 లక్షలు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. జీవిత బీమా పాలసీలలో మరణించిన సందర్భాల్లో వచ్చే పరిహారం, కాలవ్యవధి ముగిసే వరకు జీవించి ఉంటే వచ్చే మెచ్యూరిటీ బెనిఫిట్‌పై పూర్తిగా పన్ను మినహాయింపు ఉంటుంది. కాకపోతే పన్ను మినహాయింపు కోరుకునే వారు ఎండోమెంట్ ప్లాన్లకు చెల్లించే వార్షిక ప్రీమియం రూ.2.5 లక్షలకు మించకూడదు. యులిప్ ప్లాన్లలో అయితే వార్షిక ప్రీమియానికి కవరేజీ కనీసం 10 రెట్లు అయినా ఉండాలి.

- రాబడులు 5–6 శాతం
- లాకిన్ పీరియడ్: ఐదేళ్లు

ఎన్ఎస్సీ, ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీలు

వీటిల్లో పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం ఉంది. కానీ, రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. ఇన్వెస్టర్ తన ఆదాయంలో చూపించి, ఏ శ్లాబులో ఉంటే ఆ ప్రకారం రేటు చెల్లించాలి. 30 శాతం పన్ను పరిధిలో ఉన్న వారికి పన్ను పోను నికర రాబడి 5 శాతం కంటే తక్కువే. కాకపోతే వేగంగా, సులభంగా ఇన్వెస్ట్ చేసుకోగల సౌలభ్యం ఇందులో ఉంది. ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీ, ఎన్ఎస్సీలో పెట్టుబడిని ఐదేళ్లకు ముందే ఉపసంహరించుకోవడం కుదరదు. ఇన్వెస్టర్ మరణించిన సందర్భాల్లోనే దీనికి మినహాయింపు ఉంటుంది. బ్యాంక్ ఎఫ్‌డీ కంటే ఎన్ఎస్సీలోనే కాస్తంత మెరుగ్గా వడ్డీ రేటు 7.7 శాతం ఉంది.

- రాబడులు 7–8 % మధ్య
- లాకిన్ పీరియడ్: ఐదేళ్లు

పెన్షన్ ప్లాన్లు

బీమా కంపెనీలు ఆఫర్ చేసే పెన్షన్ ప్లాన్లు కూడా ఉన్నాయి. కాకపోతే చార్జీలు, సౌలభ్యం, పన్ను ప్రయోజనాల కోణంలో ఎన్‌పీఎస్ కంటే ఇవి మెరుగైనవి కావు. జీవిత బీమా కంపెనీల పెన్షన్ ప్లాన్లు సాధారణంగా యులిప్‌ల మాదిరి పని చేస్తాయి. కానీ, ఎన్‌పీఎస్, యులిప్‌లలో ఉండే పన్ను ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే, పెన్షన్ ప్లాన్లు అంత ఆకర్షణీయం కాదని చెప్పుకోవచ్చు. పెన్షన్ ప్లాన్లకు సెక్షన్ 80సీసీడీ కింద పన్ను ప్రయోజనం కల్పించాలని బీమా పరిశ్రమ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా, అది సాకారం కావడం లేదు. ప్రస్తుతం ఎన్‌పీఎస్‌కు ఈ సెక్షన్ కింద అదనపు పన్ను మినహాయింపు ప్రయోజనం కల్పిస్తున్నారు. ఎన్‌పీఎస్‌లో ఫండ్ మేనేజర్ పనితీరు నచ్చకపోతే, మరో ఫండ్ మేనేజర్ కిందకు పెట్టుబడులను మార్చుకోవచ్చు. కానీ బీమా కంపెనీల పెన్షన్ ప్లాన్లలో చివరి వరకు అదే కంపెనీతో కొనసాగాల్సి వస్తుంది. యాన్యుటీలపై పన్ను ఎత్తివేస్తే అప్పుడు ఈ ఉత్పత్తి ఆకర్షణీయంగా మారుతుందన్నది నిపుణుల అంచనా.

- ఐదేళ్లలో వార్షిక రాబడి 7–14 శాతం
- లాకిన్ పీరియడ్: రిటైర్మెంట్ వరకు

రిటైర్మెంట్ మ్యూచువల్

ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ పెట్టుబడులను పూర్తిగా ఈక్విటీల్లోనే పెట్టేస్తాయి. కానీ, రిటైర్మెంట్ ఫండ్స్ అలా కాదు. ఈక్విటీతోపాటు డెట్ సాధనాల్లోనూ కొంత పెట్టుబడులు పెడతాయి. దీంతో డెట్ పెట్టుబడులు పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వాన్ని ఇస్తాయి. ఈక్విటీ భాగం అధిక రాబడులకు వీలు కల్పిస్తుంది. సెక్షన్ 80సీ కింద వీటిల్లో పెట్టుబడులపై ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. ఈ విభాగంలో యూటీఐ రిటైర్మెంట్ ఫండ్ మెరుగైన పనితీరు చూపించే వాటిల్లో ఒకటి. తక్కువ రిస్క్‌తో, మెరుగైన రాబడులను ఇస్తోంది. మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీలకు కేటాయింపులు 40 శాతంలోపే ఉన్నాయి. తక్కువ రిస్క్ కోరుకుంటూ, విశ్రాంత నిధిని ఏర్పాటు చేసుకోవాలని భావించే వారు వీటిని ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే ఈ పథకాల్లో పెట్టుబడులపై లాకిన్ ఐదేళ్లుగా ఉంటుంది. ఫ్రాంక్లిన్ పెన్షన్ ఫండ్ అయితే 58 ఏళ్లు నిండడానికి ముందే పెట్టుబడులను ఉపసంహరించుకుంటే ఎగ్జిట్ లోడ్ చార్జీలు విధిస్తోంది.

- రాబడులు: గత ఐదేళ్లలో 7–9 %
- లాకిన్ పీరియడ్: ఐదేళ్లు

సుకన్య సమృద్ధి యోజన

ఇటీవలే ఈ పథకంలో వడ్డీ రేటును 8.2 శాతానికి పెంచారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ మాదిరే వడ్డీ రేటు, కేంద్ర సర్కారు గ్యారంటీతో కూడిన రిస్క్ లేని సాధనం ఇది. తల్లిదండ్రులు గరిష్ఠంగా ఇద్దరు కుమార్తెల పేరిట ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోగలరు. ఇద్దరి పేరిట గరిష్ఠంగా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చు. ఈ మొత్తంపై సెక్షన్ 80సీ కింద మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందులో రాబడిపై పూర్తి పన్ను మినహాయింపు ఉంది. పథకాన్ని ప్రారంభించాలంటే కుమార్తెల వయసు 10 లోపు ఉండాలన్నది నిబంధన. పోస్టాఫీసులు, బ్యాంక్‌ల్లో ఈ స్కీమ్ కింద ఖాతాను ప్రారంభించొచ్చు. ఆర్‌బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయ భాగంలో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత చేపడుతుందని అంచనా. ప్రతి త్రైమాసికం ఆరంభంలో చిన్న మొత్తాల పొదుపు పథకాల రేట్లను కేంద్ర సర్కారు సవరిస్తుంటుంది. కనుక సుకన్య సమృద్ధి యోజనలో ప్రస్తుత రేటు 8.2 శాతం ఎక్కువ కాలం కొనసాగుతుందని ఆశించరాదు. కాకపోతే ఇందులో రాబడిపై ఎలాంటి పన్ను లేనందున, కుమార్తెల భవిష్యత్ అవసరాలకు సంబంధించిన పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని రిస్క్‌లేని ఈ పథకానికి కేటాయించుకోవచ్చు.

- ఇందులో రాబడి ప్రస్తుతం 8.2 శాతం
- లాకిన్ పీరియడ్: కుమార్తెకు 18 ఏళ్లు వచ్చే వరకు

పీపీఎఫ్

ఇది రిస్క్‌లేని డెట్ సాధనం. ఇందులో రాబడిపై ఎలాంటి పన్ను లేకపోవడం అదనపు ఆకర్షణ. పీపీఎఫ్ పథకం కాల వ్యవధి 15 ఏళ్లు. ఈ పథకంలో ప్రస్తుత రేటు 7.1 శాతంగా ఉంది. సెక్షన్ 80సీ కింద ఈ సాధనంలో రూ.1.5 లక్షల పెట్టుబడిపై పన్ను మినహాయింపు పొందొచ్చు. ఒకవేళ సెక్షన్ 80సీ కింద పూర్తి పరిమితి (రూ.1.5 లక్షలు) మేరకు ఇతర సాధనాల్లో ఇన్వెస్ట్ చేసిన వారు, రాబడిపైనా పన్ను మినహాయింపు ప్రయోజనం కోసం పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పిల్లల ఉన్నత విద్యకు దీన్ని పరిశీలించొచ్చు. ఇందులో పాక్షిక ఉపసంహరణలకే అనుమతి ఉంటుంది. ప్రారంభించి ఐదేళ్లు నిండిన తర్వాత ఇందుకు అనుమతిస్తారు. ప్రముఖ బ్యాంక్‌లు, పోస్టాఫీసుల్లో దీన్ని ప్రారంభించొచ్చు

- ప్రస్తుత రాబడి 7.1%
- లాకిన్: 15 ఏళ్లు

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్

60 ఏళ్లు నిండిన వృద్ధులకు రిస్క్‌లేని రాబడి సాధనం ఇది. కేంద్ర ప్రభుత్వ హామీతో కూడిన పథకం. ప్రస్తుతం ఇందులో రాబడి 8.2 శాతంగా ఉంది. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే రాబడి ఎక్కువ. పెట్టుబడి కాల వ్యవధి ఐదేళ్లు. ఆ తర్వాత నుంచి ప్రతి మూడేళ్లకు ఒకసారి చొప్పున కాల వ్యవధి పెంచుకుంటూ వెళ్లొచ్చు. పొడిగించుకునే సమయంలో ఉన్న రేటు తదుపరి కాలానికి వర్తిస్తుంది. ఇందులో పెట్టుబడిపై ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లింపులు లభిస్తాయి. ఒక వ్యక్తి ఇందులో గరిష్ఠంగా రూ.30 లక్షలు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల పెట్టుబడిపై పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంది. పెట్టుబడిపై వచ్చే రాబడి పన్ను పరిధిలోకే వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50,000 వరకు వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపు ప్రయోజనం ఆదాయపన్ను చట్టం కింద వృద్ధులకు ఉంది. అంటే రూ.6.25 లక్షల వరకు పెట్టుబడిపై వచ్చే రాబడి పన్ను మినహాయింపు అయిన రూ.50 వేలలోపే ఉంటుంది. 60 ఏళ్లు నిండిన వారు, ముందస్తు పదవీ విరమణ పొందిన వారు 58 ఏళ్ల తర్వాత ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రక్షణ సిబ్బందికి వయో పరిమితి లేదు.

- ప్రస్తుత వడ్డీ రేటు 8.2 శాతం
- లాకిన్ పీరియడ్: ఐదేళ్లు

యులిప్‌లు

యూనిట్ లింక్ ఇన్సూరెన్స్ ప్లాన్లలో (యులిప్‌లు) పెట్టుబడులపైనా పన్ను ప్రయోజనాలు ఉన్నాయి. కాకపోతే ఈఎల్ఎస్ఎస్ మాదిరిగా పెట్టుబడులకు అంత సౌకర్యవంగా ఉండవు. పోర్ట్‌ఫోలియో వివరాలు తెలుసుకోవడం కూడా సౌకర్యంగా కష్టమే. కాకపోతే యులిప్‌ల నుంచి దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని ఆశించొచ్చు. పైగా పన్ను ఆదాకు అవకాశం ఉంటుంది. బీమా రక్షణ కూడా కొంత లభిస్తుంది. ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌లో పెట్టుబడిపై పన్ను మినహాయింపు ఉంటుందే కానీ, లాభాల ఉపసంహరణ పన్ను పరిధిలోకి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.లక్షకు మించితే 10 శాతం పన్ను చెల్లించాలి. కానీ, యులిప్‌లలో రాబడి ఎంత వచ్చినా కానీ, గడువు తీరిన తర్వాత ఉపసంహరించుకునే మొత్తంపై పన్ను ఉండదు. ఈ ప్రయోజనం కోసం చెల్లించే ప్రీమియానికి బీమా రక్షణ కనీసం 10 రెట్లు అధికంగా ఉండాలని సెక్షన్ 10(10డి) చెబుతోంది. యులిప్ పాలసీలోనూ ఈక్విటీ, డెట్ విభాగాల మధ్య ఇన్వెస్టర్ తన స్వేచ్ఛ ప్రకారం పెట్టుబడుల ప్రాధాన్యతలను మార్చుకోవచ్చు. అలా మార్చుకున్నప్పటికీ పన్ను బాధ్యత ఉండదు. యులిప్ ప్లాన్లలో ఐదేళ్ల తర్వాత నుంచి పాక్షిక ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. యులిప్ ప్లాన్లలో బీమా రక్షణ పరిమితంగానే ఉండడం ప్రతికూలం. వార్షిక ప్రీమియానికి 10–12 రెట్ల వరకే రక్షణ ఎంపిక చేసుకోగలరు. అంటే ఏడాదికి రూ.1–1.20 లక్షలు చెల్లించినా, లభించే రక్షణ రూ.10–12 లక్షలకు మించదు. కనుక తగినంత జీవిత బీమా కోసం టర్మ్ ప్లాన్ కూడా తీసుకోవాల్సి రావచ్చు. యులిప్‌ను రిటైర్మెంట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేసుకోవాలి. దీర్ఘకాలం పాటు కొనసాగాల్సి ఉంటుంది.

- గడిచిన ఐదేళ్ల కాలంలో కనిష్ఠ వార్షిక రాబడి 8.15 శాతం
- లాకిన్ పీరియడ్: ఐదేళ్లు

ఎన్‌పీఎస్

పన్ను ఆదాకు మెరుగైన సాధనాల్లో ఇదీ ఒకటి. ఒకవైపు విశ్రాంత జీవనం కోసం నిధిని సమకూర్చుకూర్చుకుంటూ, మరోవైపు పన్ను ఆదా చేసుకునే ప్రయోజనంతో వస్తుంది. గరిష్ఠంగా ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల పెట్టుబడిపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ(1) కింద రూ.1.5 లక్షలు, 80సీసీడీ(1బి)కింద రూ.50వేలపై పన్ను మినహాయింపు ఉంది. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల గరిష్ఠ పరిమితి పరిధిలోకే సెక్షన్ 80సీసీడీ (1) కూడా వస్తుంది. దీనికి అదనంగా మరో రూ.50వేలను ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసి సెక్షన్ 80సీసీడీ (1బి) కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (2) కింద కంపెనీ యాజమాన్యం ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతాకు జమ చేస్తే.. ఉద్యోగి వేతనంలో 10 శాతాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో యాక్టివ్ ఆప్షన్ కింద ఈక్విటీలకు గరిష్ఠంగా 75 శాతం కేటాయింపులు చేసుకోవచ్చు. అంతేకాదు ఏడాదిలో పెట్టుబడుల కేటాయింపులను (ఈక్విటీ, డెట్, ఏఐఎఫ్) నాలుగు పర్యాయాలు సవరించుకోవచ్చు. పెన్షన్ ఫండ్ మేనేజర్లనూ మార్చుకోవచ్చు. సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ఆప్షన్ (ఎస్‌డబ్ల్యూపీ/క్రమానుగతంగా ఉపసంహరణ)ను కూడా పీఎఫ్ఆర్‌డీఏ ప్రవేశపెట్టింది. దీనివల్ల గడువు తీరిన తర్వాత ఒకే విడత కాకుండా, నెలవారీగా కావాల్సినంత వెనక్కి తీసుకోవచ్చు. గడిచిన ఏడాది కాలంలో ఎన్‌పీఎస్ ఫండ్స్ మంచి పనితీరు చూపించాయి. ఇక ముందూ ఇదే పనితీరు ఉంటుందని అంచనా. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ ఫండ్స్ అధిక శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీలకు కేటాయిస్తాయి. కనుక రిస్క్ దాదాపు చాలా తక్కువ.

- గడిచిన ఐదేళ్లలో కనిష్ఠ రాబడి: 8.16%
- పెట్టుబడులకు లాకిన్: 60 ఏళ్లు వరకు


ఈఎల్ఎస్ఎస్

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్స్ కూడా దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులను అందిస్తున్నాయి. ఇవి ప్రధానంగా లార్జ్‌క్యాప్‌లో ఎక్కువ పెట్టుబడులు పెడతాయి. కనుక సమీప కాలంలో వీటిల్లో రాబడులు మెరుగ్గానే ఉంటాయని అంచనా. రాబడులు, భద్రత, లాకిన్ పీరియడ్ తదితర అంశాల పరంగా చూస్తే ఎన్‌పీఎస్ తర్వాత, ఎన్‌పీఎస్‌తో సమానంగా ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ కూడా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఈఎల్ఎస్ఎస్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో చాలా తక్కువగా ఉంటుంది. పైగా పారదర్శకత ఎక్కువ. పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. పెట్టుబడికి లాకిన్ కేవలం మూడేళ్లుగానే ఉంటుంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ఈఎల్ఎస్ఎస్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం వల్ల రిస్క్‌ను సమర్థవంతంగా అధిగమించొచ్చు. సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు ఈఎల్ఎస్ఎస్‌లో ఇన్వెస్ట్ చేసి పన్ను మినహాయింపు పొందొచ్చు. ఈఎల్ఎస్ఎస్ విభాగంలో సగటు రాబడులు ఏడాది కాలంలో 19 శాతం, మూడేళ్లలో 18.50 శాతం, ఐదేళ్లలో 17 శాతం, ఏడేళ్లలో 15.46 శాతం, పదేళ్లలో ఏటా 16.60 శాతం చొప్పున ఉన్నాయి.

- గడిచిన ఐదేళ్ల కాలంలో ఏటా సగటు రాబడి 17 శాతం
- లాకిన్ పీరియడ్: మూడేళ్లు

ఎన్‌పీఎస్ నుంచి వైదొలిగేది ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను 2019లో పన్ను ఆదా కోసం ఎన్‌పీఎస్ సాధనంలో రూ.50,000 ఇన్వెస్ట్ చేశాను. ఇప్పుడు ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకుందామని అనుకుంటున్నాను. ఎలా ఉపసంహరించుకోవాలి?

– కల్పేష్ వర్మ

ఎన్‌పీఎస్ టైర్-1 పెట్టుబడులకు 60 ఏళ్లు వచ్చే వరకు లాకిన్ ఉంటుంది. ఈ లోపే ఎన్‌పీఎస్ నుంచి బ్యాలన్స్‌ను ఉపసంహరించుకోవాలంటే, అందుకు కొన్ని షరతులు వర్తిస్తాయి. ఉన్నత విద్య, వివాహం, ఇంటి కొనుగోలు వంటి అవసరాలకు ఎన్‌పీఎస్ నిధి నుంచి కేవలం 25 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. అది కూడా ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించి మూడేళ్లు పూర్తి కావాలి. మీరు 2019లో ఇన్వెస్ట్ చేశారంటున్నారు. మూడేళ్ల కాలం పూర్తయింది. కనుక సమకూరిన నిధి నుంచి 25 శాతాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఎన్‌పీఎస్ ఖాతాను శాశ్వతంగా మూసివేయదలిస్తే, ఆరంభించి పదేళ్లు ముగిసిన తర్వాతే అది సాధ్యపడుతుంది. పదేళ్లలో ఏర్పడిన నిధి నుంచి 20 శాతాన్నే వెనక్కి తీసుకోగలరు. మిగిలిన 80 శాతంతో నెలవారీ పెన్షన్ ఇచ్చే యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కాకపోతే ఎన్‌పీఎస్ ఖాతాలో పదేళ్ల తర్వాత కూడా మొత్తం నిధి రూ.5 లక్షల్లోపే ఉంటే, అప్పుడు నూరు శాతం మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఎన్‌పీఎస్ నుంచి వైదొలిగేందుకు సీఆర్ఏ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఉపసంహరణకు కారణాన్ని పేర్కొనాలి. బ్యాంక్ అకౌంట్, కాంటాక్ట్ వివరాలను ధ్రువీకరించాలి. మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేయాలి. అప్పటి నుంచి ఐదు పని దినాల్లో మీ ఉపసంహరణ దరఖాస్తు ప్రాసెస్ అవుతుంది. మరే ఇతర మార్గాలు లేకపోతే తప్ప, ముందస్తు ఉపసంహరణను ఎంపిక చేసుకోవద్దన్నదే మా సలహా. విశ్రాంత జీవనం కోసం ఉద్దేశించిన నిధిని ఉపసంహరించుకోకుండా నిరాశ పరచడమే ఈ పథకంలోని షరతుల ఉద్దేశ్యం. ఎన్‌పీఎస్ పెట్టుబడుల్లో గరిష్ఠంగా 75 శాతం వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడానికి అవకాశం ఉంది. రిటైర్మెంట్ కోసం ఈక్విటీలకు ఈ మాత్రం కేటాయింపులు సహేతుకమేనని చెప్పుకోవాలి.

పీజీఐఎం లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్



పీజీఐఎం ఇండియా మ్యూచువల్ ఫండ్ కొత్తగా లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో మూలధన వృద్ధిని సాధించడం ఈ పథకం లక్ష్యం. ప్రధానంగా లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్‌ల్లో ఈ పథకం కింద ఇన్వెస్ట్ చేస్తారు. ఫిబ్రవరి 7తో ఈ ఫండ్ ముగుస్తుంది. దీనికి నిఫ్టీ లార్జ్, మిడ్‌క్యాప్ 250 ఇండెక్స్ టీఆర్ఐ (టోటల్ రిటర్న్స్ ఇండెక్స్) ప్రామాణికంగా ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-1-2024	
విశాఖ	565–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530–00
విజయవాడ	530–00
28-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00

స్టాక్ వ్యూ

ఎన్‌టీపీసీ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 315 టార్గెట్: రూ. 345

ఎందుకంటే: ప్రభుత్వ రంగ విద్యుత్ దిగ్గజం ఎన్‌టీపీసీ దేశీయంగా విద్యుదుత్పాదనలో అతిపెద్ద కంపెనీగా నిలుస్తోంది. దేశీ స్థాపిత సామర్థ్యంలో 17 శాతం వాటాను కలిగి ఉంది. గతేడాది(2022–23) మొత్తం విద్యుదుత్పాదనలో 25 శాతం వాటాను ఆక్రమించింది. విస్తారిత ఆర్థిక రికవరీ, మౌలిక సదుపాయాల పురోగతి గరిష్ఠస్థాయిలో విద్యుత్‌కు డిమాండును పెంచుతున్నాయి. వెరసి ఈ ఆర్థిక సంవత్సరం (2023–24)లో కొత్త రికార్డుకు కారణమయ్యాయి. సంప్రదాయ పద్ధతుల విద్యుదుత్పాదనలో కంపెనీ బలమైన పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. ఉత్పత్తి వ్యయాలకు అనుగుణమైన ధరల నిర్ణయ విధానాల కారణంగా గరిష్ఠ విద్యుదుత్పత్తి, డిమాండ్ సీజన్‌లో కంపెనీకి లబ్ధి చేకూరనుంది. ఇలాంటి వ్యవస్థాగత నిర్మాణం నేపథ్యంలో నిలకడైన నగదురాకకు దారి ఏర్పడనుంది. పునరుత్పాదక ఇంధన విభాగం ద్వారా వృద్ధికీ వీలుంది. కేంద్ర విద్యుత్ అధీకృత సంస్థ(సీఈఏ) అంచనాల ప్రకారం 2032కల్లా మొత్తం బొగ్గు ఆధారిత(థర్మల్) విద్యుదుత్పత్తి 47 గిగావాట్లకు చేరనుంది. దీనిలో విస్తరణ ప్రాజెక్టుల ద్వారా ఎన్‌టీపీసీ ప్రధాన వాటాను ఆక్రమించనుంది. ప్రస్తుతం 10 గిగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యం నిర్మాణంలో ఉంది. 2025–26కల్లా ఇవి ప్రారంభమయ్యే అవకాశముంది.



అదానీ పోర్ట్స్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,151 టార్గెట్: రూ. 1,410

ఎందుకంటే: ప్రయివేట్ రంగ మౌలిక సదుపాయాల దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ఠ పనితీరు చూపింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో సరుకుల హ్యాండ్లింగ్ పరిమాణంలో 42 శాతం వృద్ధి సాధించింది. దీంతో ఈ ఏడాది తొలి 9 నెలల(ఏప్రిల్–డిసెంబర్)లో 311 ఎంఎంటీ పరిమాణాన్ని అందుకుంది. వార్షిక ప్రాతిపదికన ఇది 23 శాతం అధికంకాగా.. నెలవారీ పరిమాణం 35 ఎంఎంటీ రన్‌రేట్‌ను సాధించింది. వెరసి పూర్తి ఏడాదికి కంపెనీ యాజమాన్యం 400 ఎంఎంటీ వాల్యూమ్‌ను అంచనా వేస్తోంది. ఇంతక్రితం 370–390 ఎంఎంటీని అంచనా వేసింది. అయితే సవరించిన 400 ఎంఎంటీ పరిమాణాన్ని సైతం కంపెనీ అధిగమించవచ్చని భావిస్తున్నాం. కాగా.. అదానీ పోర్ట్స్ యాజమాన్యం వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25)లో పోర్ట్ ట్రాఫిక్‌లో 25 శాతం వృద్ధిని ఆశిస్తోంది. దీంతో 500 ఎంఎంటీని సాధించే దిశగా దృష్టి పెట్టింది. గతేడాది (2022–23)లో ఇది 339 ఎంఎంటీని నమోదు చేసింది. పోర్ట్ ట్రాఫిక్ పరి మాణం వృద్ధి బాటలోనే సాగుతుందని కంపెనీ యాజమాన్యం బలంగా విశ్వసిస్తోంది. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) రేటుకంటే 1.5 రెట్లు అధికంగా ట్రాఫిక్‌లో పురోగతిని సాధించగలమని అభిప్రాయపడుతోంది. గతేడాది సరుకుల(కార్గో) వార్షిక పరిమాణంలో టాప్-10గా నిలిచిన పోర్టులలో రెండు పోర్టులు అదానీ సెజ్‌కు చెందినవే కావడం గమనార్హం!



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.



ప్రారంభ ధర
₹10 99 900~





క్వాడ్ బీమ్ LED హెడ్‌ల్యాంప్స్, హారిజన్ LED పొజిషనింగ్ ల్యాంప్ మరియు DRLలు



సరౌండ్ వ్యూ మానిటర్ (SVM) & బ్లైండ్-స్పాట్ వ్యూ మానిటర్ (BVM)




Hyundai స్మార్ట్ సెన్స్ - లెవెల్ 2 ADAS [19 ఫీచర్స్]



వాయిస్ సహాయం గల స్మార్ట్ పనోరమిక్ సన్‌రూఫ్



డ్యూయల్ జోన్ ఆటోమేటిక్ టెంపరేచర్ కంట్రోల్ (DATC)



పవర్‌ట్రైన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం 1.5l PL, 1.5l DSL, 1.5l PL టర్బో MT, AT, DCT & IVT

స్కాన్ చేయండి

36 స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్ మరియు 70+ అడ్వాన్స్‌డ్ సేఫ్టీ ఫీచర్స్*

HYUNDAI

To know more, WhatsApp us on 8447228019 | my Hyundai app | Hyundai Click to Buy | 3 Year Unlimited* Kilometer Warranty | 3 Year Road Side Assistance (RSA)* | Upto 7 Years Extended Warranty^ | Upto 5 Years Shield of Trust Running Repair Package* | Upto 5 Years Shield of Trust Super Maintenance Package* | Bluelink 3 Years free Bluelink subscription with 70+ Bluelink features | JioSaavn Pro 1 year complimentary subscription*

For Information Contact: Toll Free:1800114645 **Telangana:** **Karim Nagar:** Sasya Hyundai, Ph: 9550077566 **Hyderabad/Secunderabad:** Lakshmi Hyundai, Himayath Nagar Ph: 7331119964 Madinaguda Ph: 8096666325, Malakpet, Ph: 8096666473 LB Nagar, Ph: 8096666428 Kukatpally, Ph: 8096666276 KPHB-manjeera Trinity Ph: 8096666205, Erragadda PH: 8886628256, Attapur, Ph: 7997999408 Fusion Hyundai, Bowenpally Ph: 7330772222, Tirumalghery Ph: 9154953048 Kun United Hyundai, Lakadikapul Ph: 7997770045 ECIL X Roads, Ph: 7997770051 Hitech City, Ph: 7997770049 Shaikpet, Ph: 7997770046 Gachibowli, Ph: 7997770048 Bharat Hyundai, Financial District Gachibowli, Ph: 7095288288 Neon Hyundai, SP Road Ph: 8008004996, Dwaraka Hyundai, Boduppal Ph: 7337331720 JSP Hyundai, Jubilee Hills Ph: 8882101010, JSP Hyundai, Banjara Hills Ph: 8882101010, Geetha Hyundai, Mettuguda, Ph: 8099678678 **Khammam:** Bharat Hyundai, Ph: 7733888999, Kothagudem Ph: 7032153153 **Mahabubnagar:** Trend Hyundai, Ph: 7660022382, **Nalgonda:** Sansai Hyundai, Ph: 9160079966 **Nirmal:** Prakash Hyundai, Ph: 9052110404 **Nizamabad:** Prakash Hyundai, Ph: 9052116511 **Warangal:** Hema Hyundai, Ph: 8008204442, Neon Hyundai, Hanmakonda, Ph: 8186081868 **AP:** **Anantapur:** Kun United Hyundai, Ph: 9885289069 **Bhimavaram:** Kusalava Hyundai, Ph: 9866175390 **Chittoor:** RK Hyundai, Ph: 9533873666 **Guntur:** Kusalava Hyundai, Ph: 9866672302 **Kadapa:** MDH Hyundai, Ph: 8886112111 **Kurnool:** Kun United Hyundai, Ph: 9160114474 **Nellore:** Kun Hyundai, Ph: 9849549222 **Ongole:** Sri Chakra Hyundai, Ph: 9949096708 **Rajahmundry:** Lakshmi Hyundai, Ph: 8096666410 **Tirupati:** RK Hyundai, Ph: 9885234307 **Vijayawada:** Kusalava Hyundai, Labbipet, Ph: 9985374311, Autonagar, Ph: 7997966434 Sai Swarna Hyundai, Ramavarappadu Ring Road, Ph: 9581251234 Lucky Hyundai, Enikepadu Ph: 7799916789 **Vishakapatnam:** Lakshmi Hyundai, CBM Compound, Ph: 7997999456 Mango Hyundai, PM Pallem, Opp Dr. YSR Stadium, Ph: 8099000666 **Srikakulam:** Mango Hyundai, Pedapadu Road, Ph: 8099000666 **Gajuwaka:** Lakshmi Hyundai, 8096666518 **Vizianagaram:** Lakshmi Hyundai, Ph: 8096666550 **Kakinada:** Sai Swarna Hyundai, Ph: 8186941234

*Terms & Conditions apply. ~Ex-showroom price. Features & specifications shown may vary or not be part of standard fitment & are subject to change without prior notice. Hyundai Motor India reserves the right to change specifications, colour, equipment and schemes at any time without prior notice. The black shade on glasses is due to lighting effect. Size, colour may vary due to lighting and positing effects. Visit your nearest Hyundai dealership for more details. Hyundai urges you to follow traffic rules – these are meant to keep you safe on roads. Bluelink functionality is dependent on adequate power supply and uninterrupted network connectivity. The Bluelink system is designed in such a way that it makes vehicle theft difficult if its circuit and battery connection is uninterrupted. Hyundai SmartSense, the Advanced Driver Assistance System is not a substitute for safe and attentive driving. Its effectiveness depends on various factors. Availability of Hyundai SmartSense Features may differ by variants. ^Upto 7 years extended warranty is applicable only for petrol variants. Extended Warranty and Shield of Trust Packages are on payable basis. The JioSaavn Music streaming service functionality may vary based on network connectivity /content provider platform functionality. For more details on JioSaavn, refer T&C and Privacy Policy on - https://www.jiosaavn.com/corporate/terms/. For more details, consult the nearest authorized dealer. INNOCEAN-007/24 TEL